thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

గ్లాస్గోలో ముగిసిన కామన్ వెల్త్ క్రీడలు



11

# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 123| జగిత్యాల | మంగళవారం 04 ఆగస్టు, 2026 ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్| పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

## సుప్రీంకోర్టులో మరో నాలుగు జడ్జిలకు గ్రీన్‌సిగ్నల్

- న్యాయమూర్తుల సంఖ్య 34 నుంచి 38కు పెంపు
- విపక్షాల ఆందోళనల మధ్య చర్చ లేకుండానే లోక్‌సభ ఆమోదం
- పెండింగ్ కేసుల వేగవంతమైన పరిష్కారమే లక్ష్యమన్న కేంద్రం

2





## ఈయేడు కుంభవృష్టి వర్షాలు తప్పవు

- వర్షాలతో ప్రాణనష్టం కూడా ఎక్కువే
- రంగం భవిష్యవాణిలో మాతంగి వెల్లడి

2

## సహజీవనం కూడా చట్టబద్ధమే!

- భాగస్వామిని వేధింపులకు గురి చేస్తే చట్టప్రకారం శిక్ష
- సుప్రీం ధర్మాసనం సంచలన తీర్పు

4

సహజీవనం అంశంపై సుప్రీంకోర్టు సంచలన తీర్పునిచ్చింది. సహజీవనంలో భాగస్వామిని వేధింపులకు గురి చేస్తే భారతీయ శిక్షాస్మృతి లోని సెక్షన్ 498-ఏ ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేయవచ్చని స్పష్టం చేసింది.




## నిమ్స్‌లో రొబోటిక్ సర్జరీల కొత్త చరిత్ర

- రెండున్నరేళ్లలోనే 1,000 శస్త్రచికిత్సలు పూర్తి
- వైద్య బృందాన్ని అభినందించిన సీఎం రేవంత్, మంత్రి దామోదర రాజనర్సింహా
- 90 శాతానికి పైగా ఆరోగ్యశ్రీ, సీఎంఆర్ఎఫ్ ద్వారా ఉచిత చికిత్సలు

2





## సాగునీటి ప్రాజెక్టుల అనుమతులపై స్పెషల్ ఫోకస్

- ఆరు నెలల్లో పర్యావరణ అనుమతులే లక్ష్యం
- పాలమూరు-రంగారెడ్డి, సీతారామ, డిండి, గౌరవెల్లికి అత్యధిక ప్రాధాన్యం
- సుప్రీంకోర్టు తీర్పుతో కొత్త అవకాశాలు..
- అధికారులకు మంత్రి ఉత్తమ్ దిశానిర్దేశం

తెలంగాణ ప్రయోజనాల పరిరక్షణకు అంతర్రాష్ట్ర విభాగాన్ని బలోపేతం చేయాలి

రాష్ట్రంలోని 4 ప్రధాన సాగునీటి ప్రాజెక్టులైన పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, సీతారామ సాగర్, డిండి, గౌరవెల్లి ప్రాజెక్టులకు రాబోయే ఆరు నెలల్లో పర్యావరణ అనుమతులు సాధించడమే లక్ష్యంగా ప్రణాళికబద్ధంగా వ్యవహరించాలని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పర్యావరణ అనుమతుల అంశంపై సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన చారిత్రాత్మక తీర్పు తెలంగాణ ప్రాజెక్టులకు న్యాయపరమైన స్పష్టతనిచ్చిందని తెలిపారు. సోమవారం నాడు హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ బలరాం నాయక్ మరియు ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు.

## పోలీస్ ఉద్యోగాల భర్తీ ప్రక్రియపై అసంతృప్తి

- ఇందిరాపార్క్ వద్ద నిరుద్యోగుల మెరుపు ధర్నా
- 19వేల ఖాళీ పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్

2



## సింగరేణికి కొత్త ఊపిరి

ప్రజా ప్రభుత్వంలో సింగరేణికి కొత్త ఊపిరి లభించిందని ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క అన్నారు. కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ నిర్వహించిన ఆన్‌లైన్ వేలంలో మణుగూరు పీకేఓసీ-2 డిప్‌సైడ్ బొగ్గు బ్లాక్‌ను సింగరేణి దక్కించుకోవడం చారిత్రక విజయమని అభివర్ణించారు. సింగరేణి పరిరక్షణ, విస్తరణతో పాటు తెలంగాణ ఇంధన భద్రతను సుస్థిరం చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం గత 30 నెలలుగా చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తున్నాయని అమెరికా పర్యటనలో ఉన్న భట్టి విక్రమార్క ఒక ప్రకటనలో తెలిపారు.

3



- వేలంలో మణుగూరు పీకేఓసీ-2 డిప్‌సైడ్ బ్లాక్ కైవసం
- ఏటా 60 లక్షల టన్నుల చొప్పున 20 ఏళ్ల పాటు బొగ్గు వెలికితీత
- రెండు వేల మందికి ఉపాధి భద్రత.. మణుగూరు ప్రాంతానికి మరో 20 ఏళ్ల భరోసా
- ప్రజా ప్రభుత్వ కృషితోనే చారిత్రక విజయం: భట్టి విక్రమార్క



## బీజేపీ కంచుకోటలో పీకే జెండా

- బంకీపూర్ ఉపఎన్నికలో సంచలన విజయం
- 30 ఏళ్ల కమలం కోట బద్దలు.. బిహార్ రాజకీయాల్లో కొత్త సమీకరణాలు
- బిహార్, మధ్యప్రదేశ్‌లో బీజేపీకి ఎదురుదెబ్బ.. గుజరాత్‌లో పరువు నిలుపుకున్న కమలం

4



## విద్యార్థుల బకాయిలు చెల్లించకుంటే ఉద్యమం

- పెండింగ్ నిధులను విడుదల చేయాలి
- సమస్య పరిష్కారం వరకు పోరాటం కొనసాగిస్తాం: ఆర్. కృష్ణయ్య

3

## నిరుద్యోగులను నట్టేట ముంచిన రేవంత్

- యువత జీవితాలతో ఆటలు
- యూత్ డిక్లరేషన్‌లోని 24 హామీల్లో ఒక్కటీ అమలు కాలేదు
- జాబ్ క్యాలెండర్‌కే విలువ లేకుండా చేశారు: కేటీఆర్




3

చురకలు





# ఈయేడు కుంభవృష్టి వర్షాలు తప్పవు

**వర్షాలతో ప్రాణనష్టం కూడా ఎక్కువే**

**రంగం భవిష్యవాణిలో మాతంగి వెల్లడి**

**హైదరాబాద్, ఆగస్ట్ 3:** సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆలయంలో మాతంగి స్వర్ణలత భవిష్యవాణి(రంగం) వినిపించారు. మీరెవరూ నేను చెప్పింది ఏదీ ఆచరించడం లేదంటూ మాతంగి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడకు నేను సంతోషంగా రాలేదు.. క్రోధంతో వచ్చానని అన్నారు. మీ ప్రశ్నలకు ఎందుకు సమాధానం చెప్పాలని నిలదీశారు. నా విగ్రహం ప్రతిష్ట చేస్తానని మాట ఇచ్చి జరిపించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ ఆపద వచ్చినా.. ప్రమాదం వచ్చినా కాపాడుతున్నానని మాతంగి స్వర్ణలత తెలిపారు. కానీ మీరు చేసే చర్యలే నాకు ఆగ్రహం తెప్పిస్తుందని అన్నారు. వావివరసలు లేకుండా ఘోరాలు జరుగుతున్నాయని.. అలాంటి వారిని వదిలిపెట్టనని అన్నారు. వారిని పాదాల కింద నలిపేస్తానని అన్నారు. ఈ ఏడాది ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మాతంగి భవిష్యవాణిలో చెప్పారు. ఈ ఏడాది కుంభవర్షాలు ఉన్నాయని తెలిపారు. అగ్నిప్రమాదాలు కూడా పొంచి ఉన్నాయని చెప్పారు. ఈ ఏడాది ప్రాణనష్టం భారీగా జరుగుతుందని అన్నారు. కాబట్టి జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కొంతమంది కళ్లు నెత్తికెక్కి ప్రవర్తిస్తున్నారని మాతంగి స్వర్ణలత ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి ప్రవర్తన తనకు సంతోషం కలిగించడం లేదని తెలిపారు. సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల జాతర చివరి ఘట్టానికి చేరుకుంది. ఈ ఉత్సవాల్లో భాగంగా రంగం భవిష్యవాణిని మాతంగి స్వర్ణలత వినిపించారు. తాను సంతోషంగా లేనని.. క్రోధంతో వచ్చానని భవిష్యవాణిలో చెప్పారు. ఈ ఏడాది కుంభవృష్టి ఉంది. వర్షాల్లో ప్రజలు కొట్టుకుపోయే పరిస్థితి ఉంది. రంగం భవిష్యవాణితో ఈ బోనాల జాతర ముగియనుంది. ఈ నేపథ్యంలో భక్తులు భారీ సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. రంగం అనంతరం అమ్మవారిని అంబారీపై ఊరేగించనున్నారు.

# జోగినిలకు గుర్తింపు కార్డులు

**లాల్‌దర్వాజ బోనాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి**

**జోగినిల సంక్షేమానికి ప్రభుత్వం అండ: మంత్రి పొన్నం**

**మహంకాళి ఆలయం వద్ద జోగినిల ఆందోళన..**

**హైదరాబాద్, ఆగస్టు 3:** లాల్‌దర్వాజ సింహవాహిని మహంకాళి బోనాల సందర్భంగా జోగినిలకు ప్రత్యేక గుర్తింపు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. వారికి ప్రత్యేక గుర్తింపు కార్డులు జారీ చేసే అంశాన్ని పరిశీలిస్తున్నామని, భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. లాల్‌దర్వాజ బోనాల ఏర్పాట్లపై మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఈ ఉత్సవాల కోసం ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందన్నారు. భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చినప్పటికీ దర్శనాలు సజావుగా జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేశారని తెలిపారు. అమ్మవారి ఆశీర్వాదంతో రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. జోగినిలు ప్రత్యేక గుర్తింపు కల్పించాలని కోరిన విషయాన్ని ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తోందని మంత్రి వెల్లడించారు. వారికి అధికారిక గుర్తింపు కార్డులు జారీ చేయడంతో పాటు, మున్సిపల్ ఎన్నికల్లో కో-ఆప్షన్ సభ్యులుగా అవకాశం కల్పించే అంశాన్ని కూడా ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు చెప్పారు. అమ్మవారికి సేవలందించే జోగినిల సంక్షేమానికి మూడు శాఖల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా, ఉజ్జయిని మహంకాళి ఆలయం వద్ద జోగినిలు సోమవారం ఆందోళనకు దిగారు. బోనాల సందర్భంగా తమను ఆలయ సిబ్బంది, పోలీసులు అవమానించారని ఆరోపిస్తూ నిరసన వ్యక్తం చేశారు. జోగిని శ్యామల మాట్లాడుతూ, అవసరం వచ్చినప్పుడే ప్రభుత్వం జోగినిలను గుర్తు చేసుకుంటోందని విమర్శించారు. బోనాల సందర్భంగా కనీస ఏర్పాట్లు కూడా చేయకపోవడం బాధాకరమన్నారు. ఉదయం నుంచే ఆలయ గేట్ల వద్ద పోలీసులు జోగినిలను అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. బ్యారికేడ్లు తొలగించుకుని జోగినిలు ఆలయంలోకి ప్రవేశించగా, ఆలయం ముందు కొంతసేపు గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ కారణంగా రంగం కార్యక్రమం కూడా ఆలస్యంగా ప్రారంభమైంది. పరిస్థితిని చక్కదిద్దేందుకు మంత్రి పొన్నం ప్రభాకర్, దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు జోగినిలతో సమావేశమై వారి సమస్యలను విన్నారు. ప్రభుత్వం వారి డిమాండ్లను పరిశీలిస్తుందని హామీ ఇవ్వడంతో జోగినిలు ఆందోళన విరమించారు.

# ఎన్‌కౌంటర్‌లో కరుడుగట్టిన గ్యాంగ్‌స్టర్ హతం

**తుపాకీ లాక్కుని పారిపోతుండగా కాల్పులు**

**రాంచీ, ఆగస్ట్ 3:** ఝార్ఖండ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఓ కరుడుగట్టిన గ్యాంగ్‌స్టర్ హతమయ్యాడు. పోలీసుల తుపాకీ లాక్కుని పారిపోతుండగా జరిగిన ఎన్‌కౌంటర్‌లో గ్యాంగ్‌స్టర్ సుజిత్ సిన్హా మరణించాడని పోలీసులు తెలిపారు. సాహిబ్‌గంజ్ డివిజనల్ జైలుకు అతడిని తరలిస్తుండగా శనివారం రాత్రి ఈ ఘటన జరిగిందని చెప్పారు. జాతీయ మీడియా కథనాల ప్రకారం, ధన్‌బాద్ జైలు నుంచి సాహిబ్‌గంజ్ మండల్ జైలుకు తరలిస్తుండగా సాహిబ్‌గంజ్ హైవేపై ఈ ఘటన జరిగింది. నాలుగు పోలీసు వాహనాల ఎస్కార్ట్‌తో అతడిని పోలీసులు తరలించారు. అయితే, జమ్‌తారా పోలీస్ స్టేషన్ పరిధిలోకి కాన్వాయ్ వచ్చేసరికి తాను మరుగుదొడ్డికి వెళ్లాలని అతడు కోరాడు. వాహనాలు ఆపిన సమయంలో అతడు తుపాకీ లాక్కుని చీకట్లోకి పారిపోయేందుకు ప్రయత్నించాడని పోలీసులు తెలిపారు. తమపై కాల్పులు కూడా జరిపాడని అన్నారు. స్వీయరక్షణ కోసం తామూ కాల్పులు జరపాల్సి వచ్చిందని చెప్పారు. అతడు ఘటనా స్థలంలోనే మరణించినట్టు అక్కడికి వచ్చిన మెడికల్ టీమ్ ప్రకటించింది. జమ్‌తారా ఎస్పీ శంభు కుమార్ సింగ్ ఆధ్వర్యంలో ఈ ఉదంతంపై దర్యాప్తు కొనసాగుతోంది. ఝార్ఖండ్‌లో సిన్హాపై అనేక కేసులు ఉన్నాయి. బలవంతపు వసూళ్లు, హత్య, హత్యాయత్నం తదితర కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. రాష్ట్రంలో తన ఇన్‌ఫ్లుయెన్స్‌ను కొనసాగించేందుకు పలు గ్యాంగులతో జట్లు కట్టి నెట్‌వర్క్‌ను నిర్మించుకున్నాడని పోలీసులు తెలిపారు.

# సాగునీటి ప్రాజెక్టుల అనుమతులపై స్పెషల్ ఫోకస్

- ఆరు నెలల్లో పర్యావరణ అనుమతులే లక్ష్యం
- పాలమూరు-రంగారెడ్డి, సీతారామ, డిండి, గౌరవెల్లికి అత్యధిక ప్రాధాన్యం
- సుప్రీంకోర్టు తీర్పుతో కొత్త అవకాశాలు..
- అధికారులకు మంత్రి ఉత్తమ్ దిశానిర్దేశం



**హైదరాబాద్, ఆగస్టు 3:** రాష్ట్రంలోని కీలక సాగునీటి ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు సాధించే ప్రక్రియను వేగవంతం చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, సీతారామ సాగర్, డిండి, గౌరవెల్లి ప్రాజెక్టులను అత్యున్నత ప్రాధాన్య జాబితాలో ఉంచి, సాధ్యమైనంత వరకు ఆరు నెలల్లో పర్యావరణ అనుమతులు సాధించేలా సమగ్ర కార్యాచరణ రూపొందించాలని సూచించారు. సచివాలయంలో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, పర్యావరణ అనుమతుల అంశంపై సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పు రాష్ట్రానికి న్యాయపరమైన స్పష్టతను కల్పించిందని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖతో పాటు సంబంధిత సంస్థల వద్ద పెండింగ్‌లో ఉన్న ప్రతిపాదనలను వేగంగా ముందుకు తీసుకెళ్లాలని ఆదేశించారు. గతంలో చట్టబద్ధంగా అనుమతులు పొందిన ప్రాజెక్టులకు రక్షణ కొనసాగుతుందని, తిరస్కరణకు గురైన ప్రతిపాదనలను సాంకేతిక లోపాలు సరిచేసి అవసరమైతే తిరిగి సమర్పించాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టుల కోసం సాగించిన న్యాయపోరాటం వల్లే ఈ అనుకూల పరిస్థితి ఏర్పడిందని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణ ప్రయోజనాల పరిరక్షణలో అంతర్రాష్ట్ర విభాగం కీలక పాత్ర పోషిస్తుందని, దానిని సాంకేతిక, పర్యావరణ, న్యాయ నిపుణులతో మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు. ప్రతి ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తి చరిత్ర, అనుమతులు, రీడిజైన్‌లు, న్యాయపరమైన అంశాలు, పెండింగ్ కేసులు, సాంకేతిక వివరాలన్నింటినీ ఒకే సమగ్ర దస్త్రంలో సిద్ధంగా ఉంచాలని సూచించారు. ప్రతి ప్రాజెక్టుకు ప్రత్యేక నోడల్ అధికారిని నియమించి, ఏడు రోజుల్లో అన్ని రికార్డులు సేకరించాలని, 30 రోజుల్లో పర్యావరణ అధ్యయనాలు, భూ రికార్డులు, న్యాయపరమైన పత్రాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రధాన పరిపాలనా ప్రక్రియతో పాటు దరఖాస్తుల తయారీ, పరిశీలన, సమర్పణను 60 రోజుల్లో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. గౌరవెల్లి ప్రాజెక్టుపై ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించిన మంత్రి, పంప్‌హౌస్‌ను పూర్తిస్థాయిలో వినియోగానికి సిద్ధంగా ఉంచాలని ఇంజినీర్లను ఆదేశించారు. పంపుల తనిఖీలు, మరమ్మతులు, కాలువల పరిశీలన, నీటి ప్రవాహానికి అడ్డంకుల తొలగింపు వంటి పనులను అత్యవసరంగా పూర్తి చేయాలని సూచించారు. సీతారామ సాగర్ ప్రాజెక్టుకు అవసరమైన పర్యావరణ పత్రాలను నవీకరించి, అనుమతులు లభించిన వెంటనే పనులు పునఃప్రారంభించేలా టెండర్లు, ఇంజినీరింగ్ ప్రణాళికలు ముందుగానే సిద్ధం చేయాలని ఆదేశించారు. పాలమూరు-రంగారెడ్డి, డిండి ప్రాజెక్టుల విషయంలోనూ ఇదే స్థాయి అత్యవసరతతో పనిచేయాలని స్పష్టం చేశారు. ఎన్‌జీటీ, సుప్రీంకోర్టు తదితర న్యాయస్థానాల్లో కొనసాగుతున్న కేసుల విషయంలో న్యాయ సలహాదారులు, శాఖాధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి ఆదేశించారు. న్యాయస్థానాల్లో విచారణకు ముందే అన్ని సాంకేతిక నివేదికలు, కౌంటర్ అఫిడవిట్లు సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

**పోలవరం బ్యాక్‌వాటర్‌పై ముందస్తు అప్రమత్తత**

పోలవరం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ ప్రభావంపై కూడా సమావేశంలో విస్తృతంగా చర్చ జరిగింది. తెలంగాణలోని గ్రామాలు, భూములు, ప్రజా ఆస్తులపై పడే ప్రభావాన్ని శాస్త్రీయంగా అంచనా వేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. విశ్వసనీయ క్షేత్రస్థాయి సమాచారం, సాంకేతిక అధ్యయనాలు, ఆర్థిక అంచనాల ఆధారంగా తెలంగాణ వాదనను కేంద్రం, పోలవరం ప్రాజెక్టు అథారిటీ ముందు బలంగా వినిపించాలని సూచించారు. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, పోలవరం పూర్తిస్థాయిలో వినియోగంలోకి వచ్చేలోపే ఉమ్మడి ఖమ్మం జిల్లాపై బ్యాక్‌వాటర్ ప్రభావాన్ని స్పష్టంగా అంచనా వేయాలని అన్నారు. ముంపు లేదా బ్యాక్‌వాటర్ ప్రభావంతో నష్టపోయే భూములు, మౌలిక వసతులు, ఇతర ఆస్తులకు పరిహారం చెల్లించే బాధ్యత సంబంధిత కేంద్ర సంస్థలదేనని స్పష్టం చేశారు. పరిహార దావాలకు అవసరమైన అంచనాలను త్వరగా పూర్తి చేసి, అధికారికంగా కేంద్ర సంస్థల ముందు ఉంచాలని మంత్రి ఉత్తమ్ అధికారులను ఆదేశించారు.

# పోలీస్ ఉద్యోగాల భర్తీ ప్రక్రియపై అసంతృప్తి

**ఇందిరాపార్క్ వద్ద నిరుద్యోగుల మెరుపు ధర్నా**



**హైదరాబాద్, ఆగస్ట్ 3:** తెలంగాణలో పోలీస్ ఉద్యోగాల భర్తీ ప్రక్రియపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ నిరుద్యోగ యువత హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ చౌరస్తాలో సోమవారం మెరుపు ధర్నాకు దిగింది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన 7,437 పోలీస్ పోస్టుల నోటిఫికేషన్ సరిపోదని, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న సుమారు 19 వేల పోలీస్ పోస్టుల భర్తీకి మరో సమగ్ర నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నోటిఫికేషన్ విడుదలలో జరిగిన జాప్యం కారణంగా వేలాది మంది అభ్యర్థులు వయోపరిమితి దాటిపోయారని నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఉద్యోగాలకు అర్హత కోల్పోయిన అభ్యర్థులకు న్యాయం చేయాలంటే వయోపరిమితిని పెంచాల్సిందేనని ప్రభుత్వాన్ని కోరారు. పోలీస్ నియామక నోటిఫికేషన్‌లో కానిస్టేబుల్ పోస్టులకు గరిష్ఠ వయోపరిమితిని 36 సంవత్సరాలకు, సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) పోస్టులకు 38 సంవత్సరాలకు పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే దరఖాస్తు రుసుము కూడా నిరుద్యోగులపై అదనపు భారం అవుతోందని, దానిని వెంటనే తగ్గించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసిన నిరుద్యోగులు, తమ డిమాండ్లపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పోలీస్ ఉద్యోగాల భర్తీలో పారదర్శకతతో పాటు నిరుద్యోగులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నిరుద్యోగ జేఏసీ నేతలు మధుసూదన్ గౌడ్, శ్రీకాంత్, వీరేష్, కరుణాకర్, శ్రీకాంత్ రాథోడ్ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో నిరుద్యోగ యువత పాల్గొన్నారు.

# సుప్రీంకోర్టులో మరో నాలుగు జడ్జిలకు గ్రీన్‌సిగ్నల్

- న్యాయమూర్తుల సంఖ్య 34 నుంచి 38కు పెంపు
- విపక్షాల ఆందోళనల మధ్య చర్చ లేకుండానే లోక్‌సభ ఆమోదం
- పెండింగ్ కేసుల వేగవంతమైన పరిష్కారమే లక్ష్యమన్న కేంద్రం

**న్యూఢిల్లీ, ఆగస్టు 3:** సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్యను పెంచే కీలక బిల్లుకు లోక్‌సభ సోమవారం ఆమోదం తెలిపింది. ప్రధాన న్యాయమూర్తితో కలిపి సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను 34 నుంచి 38కు పెంచేందుకు జారీ చేసిన ఆర్డినెన్స్ స్థానంలో తీసుకొచ్చిన సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య (సవరణ) బిల్లు--2026ను సభ ఆమోదించింది. నీట్ ప్రశ్నపత్రం లీకేజీ, రామమందిర విరాళాల వ్యవహారాలపై విపక్ష సభ్యులు నినాదాలతో నిరసన వ్యక్తం చేయడంతో సభలో గందరగోళం నెలకొంది. ఈ నేపథ్యంలో బిల్లుపై ఎలాంటి చర్చ జరగకుండానే స్పీకర్ ఓం బిర్లా దానిని ఓటింగ్‌కు పెట్టగా, సభ ఆమోదం తెలిపింది. ఆర్డినెన్స్‌ను వ్యతిరేకిస్తూ విపక్షాలు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని కూడా మూజువాణి ఓటుతో తిరస్కరించారు. సభలో బిల్లును ప్రవేశపెట్టిన కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్, పెరుగుతున్న కేసుల భారం, న్యాయ విచారణ వేగవంతం చేయాల్సిన అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని న్యాయమూర్తుల సంఖ్య పెంపు నిర్ణయం తీసుకున్నామని వివరించారు. అనంతరం బిల్లుపై సభ్యులను మాట్లాడాలని స్పీకర్ కోరినా, విపక్షాల ఆందోళనలు కొనసాగడంతో చర్చ జరగలేదు.

**పెండింగ్ కేసుల పరిష్కారానికి దోహదం**

బిల్లు ఆమోదంపై బీజేపీ ఎంపీ రఘునందన్ రావు హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుతం సుప్రీంకోర్టులో దాదాపు లక్ష కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, ఏడాదికి సుమారు 65 వేల కేసులు పరిష్కారమవుతున్నప్పటికీ 75 వేల వరకు కొత్త కేసులు నమోదవుతున్నాయని తెలిపారు. ఈ పరిస్థితుల్లో న్యాయమూర్తుల సంఖ్య పెంపు ద్వారా కేసుల విచారణ వేగవంతమై ప్రజలకు త్వరితగతిన న్యాయం అందే అవకాశాలు మెరుగుపడతాయని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో 2019లో ఒకసారి, ఇప్పుడు మరోసారి సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య పెంచినట్లు రఘునందన్ రావు గుర్తు చేశారు. న్యాయవ్యవస్థ ఆధునికీకరణకు కేంద్రం ఇప్పటికే వేల కోట్ల రూపాయలు వెచ్చించిందని పేర్కొన్నారు. కొలీజియం వ్యవస్థలో మరింత పారదర్శకత అవసరమని, భవిష్యత్తులో జ్యుడీషియల్ కమిషన్ ఏర్పాటు అంశాన్ని పరిశీలిస్తే మంచిదని అభిప్రాయపడ్డారు. జస్టిస్ ఉజ్జల్ భుయాన్ చేసిన తాజా వ్యాఖ్యలను కూడా స్వాగతిస్తూ, న్యాయవ్యవస్థలో సంస్కరణల దిశగా కేంద్రం చర్యలు తీసుకునే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# నిమ్స్‌లో రొబోటిక్ సర్జరీల కొత్త చరిత్ర

- రెండున్నరేళ్లలోనే 1,000 శస్త్రచికిత్సలు పూర్తి
- వైద్య బృందాన్ని అభినందించిన సీఎం రేవంత్, మంత్రి దామోదర రాజనర్సింహ
- 90 శాతానికి పైగా ఆరోగ్యశ్రీ, సీఎంఆర్‌ఎఫ్ ద్వారా ఉచిత చికిత్సలు



**హైదరాబాద్, ఆగస్టు 3:** ప్రభుత్వ వైద్య రంగంలో నిమ్స్ మరో అరుదైన మైలురాయిని అధిగమించింది. కేవలం రెండున్నర సంవత్సరాల వ్యవధిలోనే 1,000 రొబోటిక్ శస్త్రచికిత్సలను విజయవంతంగా పూర్తి చేసి రాష్ట్ర వైద్యరంగంలో కొత్త రికార్డు సృష్టించింది. ఈ ఘనత సాధించిన నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాహుల్ దేవరాజ్, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ఆపరేషన్ థియేటర్ బృందాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అభినందించారు. సోమవారం సచివాలయంలో ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాహుల్ దేవరాజ్ కలిసి రొబోటిక్ సర్జరీల వివరాలను తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యాధునిక వైద్య సేవలను సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంలో నిమ్స్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఇటీవలే 2,000 కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలను పూర్తి చేసిన నిమ్స్, ఇప్పుడు 1,000 రొబోటిక్ సర్జరీల మైలురాయిని చేరుకోవడం ప్రభుత్వ వైద్యరంగ సామర్థ్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. దక్షిణ భారతదేశంలో ప్రభుత్వ రంగంలో తొలి రొబోటిక్ కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించిన నిమ్స్, దేశంలోని ప్రముఖ అవయవ మార్పిడి కేంద్రాల్లో ఒకటిగా నిలిచిందని మంత్రి గుర్తు చేశారు. ప్రస్తుతం నిమ్స్‌తో పాటు ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రిలో కూడా రొబోటిక్ శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నామని, నిర్మాణంలో ఉన్న కొత్త టిమ్స్ ఆసుపత్రులు, గాంధీ, కొత్త ఉస్మానియా ఆసుపత్రుల్లోనూ ప్రపంచస్థాయి రొబోటిక్ ఆపరేషన్ థియేటర్లను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాహుల్ దేవరాజ్ మాట్లాడుతూ ఇప్పటివరకు నిర్వహించిన వెయ్యి రొబోటిక్ శస్త్రచికిత్సల్లో యూరాలజీ విభాగంలో 590, సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగంలో 248, సర్జికల్ ఆంకాలజీ విభాగంలో 162 శస్త్రచికిత్సలు జరిగినట్లు తెలిపారు. వీటిలో 90 శాతానికి పైగా ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా పూర్తిగా ఉచితంగా నిర్వహించడం విశేషమన్నారు. ఖరీదైన రొబోటిక్ శస్త్రచికిత్సలను కూడా సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకురాగలిగామని చెప్పారు. ఈ విజయానికి యూరాలజీ, సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ, సర్జికల్ ఆంకాలజీ, అనస్థీషియా విభాగాలు, నర్సింగ్ సిబ్బంది, ఆపరేషన్ థియేటర్ బృందం, ఇతర సహాయక విభాగాల సమిష్టి కృషే కారణమని ఆయన తెలిపారు. రాష్ట్రంలో ఆధునిక వైద్య సేవల విస్తరణకు సహకరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు కృతజ్ఞతలు తెలిపారు. ఇదే సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక ప్రకటన విడుదల చేసి నిమ్స్ వైద్య బృందాన్ని అభినందించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యాధునిక వైద్య సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలనే ప్రజా ప్రభుత్వ సంకల్పం ఫలిస్తోందన్నారు. ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అత్యధిక రొబోటిక్ శస్త్రచికిత్సలను ఉచితంగా నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. వైద్యరంగంలో నిమ్స్ మరిన్ని మైలురాళ్లు అధిరోహించాలని ఆకాంక్షించారు.

చురకలు

మంగళవారం 04.08.2026

# సింగరేణికి కొత్త ఊపిరి

- వేలంలో మణుగూరు పీకేఓసీ-2 డిప్‌సైడ్ బ్లాక్ కైవసం
- ఏటా 60 లక్షల టన్నుల చొప్పున 20 ఏళ్ల పాటు బొగ్గు వెలికితీత
- రెండు వేల మందికి ఉపాధి భద్రత.. మణుగూరు ప్రాంతానికి మరో 20 ఏళ్ల భరోసా
- ప్రజా ప్రభుత్వ కృషితోనే చారిత్రక విజయం: భట్టి విక్రమార్క



**హైదరాబాద్, ఆగస్టు 3:** ప్రజా ప్రభుత్వంలో సింగరేణికి కొత్త ఊపిరి లభించిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క అన్నారు. కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ నిర్వహించిన ఆన్‌లైన్ వేలంలో మణుగూరు పీకేఓసీ-2 డిప్‌సైడ్ బొగ్గు బ్లాక్‌ను సింగరేణి దక్కించుకోవడం చారిత్రక విజయమని అభివర్ణించారు. సింగరేణి పరిరక్షణ, విస్తరణతో పాటు తెలంగాణ ఇంధన భద్రతను సుస్థిరం చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం గత 30 నెలలుగా చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తున్నాయని అమెరికా పర్యటనలో ఉన్న భట్టి విక్రమార్క ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ప్రజల ఆస్తి అయిన సింగరేణిని కాపాడేందుకు కొత్త బొగ్గు బ్లాకులను సాధించడమే ప్రధాన లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఇటీవల ఒడిశాలోని నైనీ బొగ్గు బ్లాక్‌లో ఉత్పత్తిని ప్రారంభించామని, తాడిచర్ల-2 బ్లాక్‌కు మైనింగ్ లీజును సాధించామని గుర్తుచేశారు. తాజాగా మణుగూరు పీకేఓసీ--2 డిప్‌సైడ్ బ్లాక్‌ను దక్కించుకోవడంతో నెల రోజుల వ్యవధిలో సింగరేణి రెండు చారిత్రక విజయాలు నమోదు చేసిందని పేర్కొన్నారు. ప్రారంభమవుతుందో లేదో అన్న అనిశ్చితిలో ఉన్న నైనీ బొగ్గు బ్లాక్‌కు అవసరమైన అనుమతులు సాధించేందుకు తాను స్వయంగా ఒడిశాకు వెళ్లి ప్రజాప్రతినిధులు, స్థానికులతో చర్చించానని తెలిపారు. ఆ ప్రయత్నాల ఫలితంగానే 36 ఏళ్ల పాటు సింగరేణికి బలమైన ఆధారంగా నిలిచే నైనీ బ్లాక్‌లో బొగ్గు ఉత్పత్తి ప్రారంభమైందన్నారు. 2013లో యూపీఏ ప్రభుత్వ హయాంలో అనుమతులు పొందిన తాడిచర్ల-2 బ్లాక్‌ను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్రంతో సంప్రదింపులు జరిపి గత నెలలో మైనింగ్ లీజు సాధించిందని చెప్పారు. ఈ బ్లాక్‌లో 336 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయని, 45 ఏళ్ల పాటు వెలికితీసే అవకాశం ఉందని వివరించారు. కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ తాజాగా నిర్వహించిన వేలంలో సింగరేణి తొలిసారిగా పాల్గొని మణుగూరు పీకేఓసీ-2 డిప్‌సైడ్ బ్లాక్‌ను దక్కించుకుందని భట్టి తెలిపారు. గత పాలకులు సింగరేణిని వేలాల్లో పాల్గొనకుండా అడ్డుకోవడంతో రాష్ట్రంలోని విలువైన బొగ్గు బ్లాకులు ప్రైవేటు సంస్థలకు వెళ్లిపోయాయని ఆరోపించారు. తమ ప్రభుత్వం సింగరేణి మనుగడను దృష్టిలో పెట్టుకుని వేలంలో పాల్గొనేలా నిర్ణయం తీసుకోవడంతో దాదాపు 12 ఏళ్ల తర్వాత సంస్థకు బొగ్గు బ్లాక్ దక్కిందన్నారు. మణుగూరు పీకేఓసీ-2 డిప్‌సైడ్ బ్లాక్‌లో 120 మిలియన్ టన్నుల జీ-8 గ్రేడ్ నాణ్యమైన బొగ్గు నిల్వలు ఉన్నాయని తెలిపారు. ఏటా ఆరు మిలియన్ టన్నుల చొప్పున 20 ఏళ్ల పాటు బొగ్గును వెలికితీసి తెలంగాణ విద్యుత్ అవసరాలకు వినియోగించుకోవచ్చన్నారు. ఈ బ్లాక్ ద్వారా రెండు వేల మందికిపైగా కార్మికులకు దీర్ఘకాలిక ఉపాధి భద్రత లభిస్తుందని చెప్పారు. మణుగూరు ఏరియా అస్తిత్వాన్ని కాపాడడంతో పాటు అక్కడి ఆర్థికాభివృద్ధికి కూడా ఈ ప్రాజెక్టు దోహదపడుతుందని తెలిపారు. రాబోయే 20 ఏళ్ల పాటు తెలంగాణ విద్యుత్ అవసరాలకు అవసరమైన బొగ్గు సరఫరా భద్రత మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా కోయగూడెం--3, సత్తుపల్లి--3 వంటి కీలక బొగ్గు బ్లాకులు ప్రైవేటు సంస్థలకు వెళ్లిపోయాయని భట్టి విమర్శించారు. వాటిని తిరిగి సింగరేణికి దక్కేలా కృషి చేయడమే తమ తదుపరి లక్ష్యమని ప్రకటించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో సింగరేణిని మరింత బలోపేతం చేయడం, కొత్త బొగ్గు నిల్వలను సమకూర్చడం, కార్మికులకు ఉపాధి భద్రత కల్పించడం ప్రభుత్వ ప్రాధాన్యమని స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో సింగరేణిని తెలంగాణకే పరిమితం చేయకుండా ఇతర రాష్ట్రాల్లోని బొగ్గు గనులు, దేశ విదేశాల్లోని కీలక ఖనిజాల అన్వేషణ, తవ్వకాల రంగాల్లోనూ విస్తరించేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని భట్టి విక్రమార్క తెలిపారు. మణుగూరు బ్లాక్ సాధించిన సింగరేణి యాజమాన్యం, కార్మిక సంఘాలు, కార్మికులందరికీ ఆయన అభినందనలు తెలిపారు.

# బీజేపీ కంచుకోటలో ప్రశాంత్ కిశోర్ జెండా

- బంకీపూర్ ఉపఎన్నికలో విజయం
- 30 ఏళ్ల కమలం కోట బద్దలు.. బిహార్ రాజకీయాల్లో కొత్త సమీకరణాలు
- బిహార్, మధ్యప్రదేశ్‌లో బీజేపీకి ఎదురుదెబ్బ.. గుజరాత్‌లో పరువు నిలుపుకున్న కమలం

**పాట్నా/న్యూఢిల్లీ, ఆగస్టు 3:** బిహార్ రాజకీయాల్లో సంచలన పరిణామం చోటుచేసుకుంది. బంకీపూర్ శాసనసభ ఉపఎన్నికలో జనసురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ ఘన విజయం సాధించి, మూడు దశాబ్దాలుగా భారతీయ జనతా పార్టీకి కంచుకోటగా ఉన్న నియోజకవర్గాన్ని కైవసం చేసుకున్నారు. బీజేపీ అభ్యర్థి నీరజ్ సిన్హాపై 18,953 ఓట్ల భారీ మెజారిటీతో విజయం సాధించిన ప్రశాంత్ కిశోర్ బిహార్ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు నాంది పలికారు. కౌంటింగ్ ప్రారంభమైనప్పటి నుంచే ఆధిక్యంలో కొనసాగిన ప్రశాంత్ కిశోర్ చివరకు 63,203 ఓట్లు సాధించగా, బీజేపీ అభ్యర్థి నీరజ్ సిన్హాకు 44,250 ఓట్లు వచ్చాయి. ఆర్జేడీ అభ్యర్థి రేఖా కుమారి 14,085 ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు. విజయం అనంతరం స్పందించిన ప్రశాంత్ కిశోర్, ఈ ఫలితం బీజేపీ అగ్రనాయకత్వానికి ప్రజలు ఇచ్చిన స్పష్టమైన సందేశమని వ్యాఖ్యానించారు. బిహార్‌లో పాలనపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని పేర్కొంటూ, ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరిని వెంటనే పదవి నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. ఈ ఫలితం రాష్ట్ర రాజకీయాల్లో మార్పుకు నాంది పలుకుతుందని ఆయన అన్నారు. రాజ్యసభకు ఎన్నిక కావడంతో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడంతో బంకీపూర్‌లో ఉపఎన్నిక జరిగింది. 1995 నుంచి వరుసగా బీజేపీ గెలుస్తున్న ఈ నియోజకవర్గంలో కమలానికి తొలిసారి పరాజయం ఎదురుకావడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

### వరుస ఉపఎన్నికల్లో బీజేపీకి షాక్

బంకీపూర్ ఫలితంతో పాటు మధ్యప్రదేశ్‌లోని దతియా ఉపఎన్నికలో కూడా బీజేపీ అభ్యర్థి ఓటమి పాలవడంతో అధికార పార్టీకి వరుస ఎదురుదెబ్బలు తగిలాయి. సాధారణంగా అధికార పార్టీలకు అనుకూలంగా ఉండే ఉపఎన్నికల్లో బీజేపీ వెనుకబడటం విశ్లేషకుల దృష్టిని ఆకర్షిస్తోంది. అయితే గుజరాత్‌లోని మంజల్‌పూర్ నియోజకవర్గంలో విజయం సాధించడం ద్వారా బీజేపీ



కొంత ఊరట పొందింది. బిహార్‌లో యువత ఓటింగ్ ధోరణి, స్థానిక రాజకీయ సమీకరణాలు, ప్రభుత్వ వ్యతిరేక భావన, పోలింగ్ శాతం తగ్గడం వంటి అంశాలు బీజేపీ ఓటమికి కారణమయ్యాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రశాంత్ కిశోర్ విజయం జనసురాజ్ పార్టీకి తొలి శాసనసభ విజయంగా నిలవడంతో పాటు, బిహార్ రాజకీయాల్లో ఆయనను కీలక ప్రత్యామ్నాయ శక్తిగా నిలబెట్టిందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

# నిరుద్యోగులను నట్టేట ముంచిన రేవంత్

- ఉద్యోగాల భర్తీ పేరుతో యువత జీవితాలతో ఆటలు
- యూత్ డిక్లరేషన్‌లోని 24 హామీల్లో ఒక్కటీ అమలు కాలేదు
- జాబ్ క్యాలెండర్‌కే విలువ లేకుండా చేశారు: కేటీఆర్

**హైదరాబాద్, ఆగస్టు 3:** ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పూర్తిగా విస్మరించారని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. యూత్ డిక్లరేషన్ పేరుతో యువతను నమ్మించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగ భృతి విషయంలో మోసం చేసిందని ఆరోపించారు. సోమవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ, రాష్ట్రంలో సుమారు 20 వేల పోలీసు ఉద్యోగాలు ఖాళీగా ఉంటే కేవలం ఏడు వేల పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. ఉద్యోగాల కోసం ప్రశ్నిస్తున్న యువతను అవమానించేలా ముఖ్యమంత్రి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఇంజినీరింగ్ పట్టభద్రులను కించపరిచే వ్యాఖ్యలు చేయడం ముఖ్యమంత్రి బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని అన్నారు. యువతపై రేవంత్ చేసిన వ్యాఖ్యలకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. యూత్ డిక్లరేషన్‌లో కాంగ్రెస్ 24 హామీలు ఇచ్చిందని, వాటిలో ఒక్కటైనా పూర్తిగా అమలు చేసిందా అని నిలదీశారు. అసెంబ్లీలో ప్రభుత్వం ప్రకటించిన జాబ్ క్యాలెండర్‌ను ప్రస్తావిస్తూ, ప్రచార సభల్లో ఇచ్చిన హామీలకు విలువ లేకపోయినా కనీసం శాసనసభలో ఇచ్చిన మాటకైనా గౌరవం ఉండాలని కేటీఆర్ అన్నారు. జాబ్ క్యాలెండర్ ప్రకటించి రెండేళ్లు గడిచినా నోటిఫికేషన్లు విడుదల చేయకపోవడం నిరుద్యోగులను మోసం చేయడమేనన్నారు. ఖమ్మంలో వేణు అనే యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటనను ప్రస్తావించిన కేటీఆర్, అతడు రాసిన లేఖ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ఒక అభియోగపత్రంలా ఉందని వ్యాఖ్యానించారు. ఆ లేఖను రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్కకు చేరే వరకు పంచాలని యువకుడు కోరిన విషయాన్ని గుర్తుచేశారు. ఎన్నికల సమయంలో అశోక్‌నగర్‌లో నిరుద్యోగులకు హామీలు ఇచ్చిన రాహుల్ గాంధీ, ఇప్పుడు తెలంగాణకు వచ్చి యువతకు సమాధానం ఎందుకు చెప్పడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాలకు వెళ్లకుండా, అధికారంలో లేని రాష్ట్రాల్లో మాత్రమే రాజ్యాంగ పుస్తకంతో తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్ర యువత తీవ్ర నిరాశ, నిర్వేదంలో ఉందని కేటీఆర్ అన్నారు. ఎన్నికల సమయంలో యువతను ఉపయోగించుకుని, అధికారంలోకి వచ్చిన తర్వాత వారిని విస్మరించడం కాంగ్రెస్, బీజేపీలకు అలవాటుగా మారిందని విమర్శించారు. ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగ భృతి సహా యువతకు ఇచ్చిన హామీలన్నింటినీ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మీడియా సమావేశంలో మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.






# సింగరేణికి డీప్‌సైడ్ కోల్ బ్యాక్ దక్కదడం సంతోషకరం

### కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 3:** డిప్‌సైడ్ కోల్ బ్లాక్ సింగరేణికి దక్కడం సంతోషకరమని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా సింగరేణి కార్మికులకు, కార్మికుల కుటుంబ సభ్యులకు, కార్మిక సంఘాల ప్రతినిధులకు, సింగరేణి అధికారులకు. తెలంగాణ ప్రజలకు అభినందనలు తెలిపారు. ఈ మేరకు కిషన్‌రెడ్డి ఓ ప్రకటన విడుదల చేశారు. ఇటీవల.. ఒడిశాలోని నైని కోల్ బ్లాక్, తాడిచర్ల -2 బ్లాక్ సింగరేణి సిగలో చేరిన సందర్భంలో.. ఖఐక్షఅ-2 డిప్ సైడ్ బ్లాక్‌ను కూడా సింగరేణికే దక్కేలా చొరవ తీసుకోవాలని కార్మికులు, యూనియన్ లీడర్ల నుంచి డిమాండ్లు వచ్చాయని ప్రస్తావించారు. ఖఐక్షఅ-2 డిప్‌సైడ్ బ్లాక్ సింగరేణికి వచ్చే విధంగా అన్నిరకాలుగా బాధ్యత వహించానని తెలిపారు. తాను కేంద్ర మంత్రిగానే కాకుండా తెలంగాణ బిడ్డగా.. సింగరేణి శ్రేయస్సు, అభివృద్ధి, సింగరేణి కార్మికులను ప్రేమించే వ్యక్తిగా ప్రత్యేక కృషి చేశానని చెప్పుకొచ్చారు. తన సహకారం ఫలితంగా సింగరేణి విజయం సాధించడం చాలా సంతోషకరమైన విషయమని కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో సోమవారం వేలం పక్రియ పూర్తయిపోయిందని వెల్లడించారు. ఈ విధానంలో సింగరేణి సంస్థకు మణుగూరు ఖఐక్షఅ-2 డిప్‌సైడ్ బ్లాక్‌ను కేటాయిస్తున్నట్లు తెలిపారు. దక్షిణ భారతదేశంలో ఉన్న ఏకైక బొగ్గు ఉత్పత్తి సంస్థ అయిన సింగరేణి సంస్థ.. ఈ డిప్ సైడ్ బ్లాక్ వల్ల సుమారు 180 మిలియన్ టన్నుల బొగ్గు రిజర్వ్ ఉన్నాయని వెల్లడించారు. ఈ సంవత్సరానికి 6 మిలియన్ టన్నుల చొప్పున 25 ఏళ్లపాటు ఈ మైన్ నడుస్తుందని స్పష్టం చేశారు. దాదాపు 2వేల మందికి ఉద్యోగాలు వస్తాయని కిషన్‌రెడ్డి వెల్లడించారు. ఇక్కడ దొరికే ఉ-8 బొగ్గు కారణంగా.. మొత్తం రూ.43వేల కోట్లకు పైగా రెవెన్యూ జనరేట్ అవుతుందని చెప్పుకొచ్చారు. అలాగే, రాష్ట్ర ప్రభుత్వానికి రూ.10,500 కోట్లకు మించి ఆదాయం కూడా వస్తుందని వివరించారు. తెలంగాణ ఇంధన భద్రతకు భరోసా దక్కడంతోపాటుగా.. సింగరేణి భవిష్యత్తు అభివృద్ధికి అవసరమైన వనరులు లభిస్తాయని వెల్లడించారు. ప్రభుత్వానికి, సింగరేణికి, విద్యుత్ రంగానికి, ఉద్యోగులకు మేలు జరుగుతుందని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వానికి దాదాపుగా రూ.48వేల కోట్లకు పైగా ఆదాయం సమకూరుతుందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

# విద్యార్థుల బకాయిలు చెల్లించకుంటే ఉద్యమం

### పెండింగ్ నిధులను వెంటనే విడుదల చేయాలి : ఆర్. కృష్ణయ్య

### సమస్య పరిష్కారం వరకు పోరాటం కొనసాగిస్తాం



**హైదరాబాద్, ఆగస్టు 3:** ఉన్నత విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు ప్రభుత్వం చెల్లించాల్సిన పెండింగ్ మొత్తాలను తక్షణమే విడుదల చేయాలని రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఆలస్యం కొనసాగితే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బీసీ విద్యార్థి సంఘం చేపట్టిన హయ్యర్ ఎడ్యుకేషన్ కార్యాలయం ముట్టడి సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. తనను ఆంధ్రప్రదేశ్ నుంచి ఎన్నికైన రాజ్యసభ సభ్యుడిగా పేర్కొంటూ అక్కడి సమస్యలపైనే మాట్లాడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు సమంజసం కాదని ఆర్. కృష్ణయ్య అన్నారు. ప్రజల సమస్యలపై స్పందించడం ప్రజాప్రతినిధిగా తన బాధ్యత అని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో విద్యార్థుల విద్యా వ్యయాన్ని ప్రభుత్వం పూర్తిగా భరిస్తోందని, తెలంగాణలో మాత్రం అందుతున్న ఆర్థిక సాయం వాస్తవ ఖర్చులకు సరిపోవడం లేదని ఆయన పేర్కొన్నారు. దీంతో పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. తెలంగాణలో కూడా పూర్తి విద్యా వ్యయాన్ని ప్రభుత్వం భరించే విధానాన్ని అమలు చేయాలని ఆర్. కృష్ణయ్య కోరారు. పెండింగ్ చెల్లింపులతో పాటు సమగ్ర సహాయ విధానంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకునే వరకు తమ ఆందోళనలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

# ట్రైనీ ఐపీఎస్ కస్టడీ కోరుతూ పిటిషన్

**హైదరాబాద్, ఆగస్టు 3:** ట్రైనీ ఐపీఎస్ ఉదయ్‌కృష్ణారెడ్డి కస్టడీ కోరుతూ పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. ఏడు రోజులపాటు కస్టడీకి కోరారు. ఈ కేసులో ఇప్పటికే పోలీసులు కీలక ఆధారాలు సేకరించారు. ఉదయ్‌కృష్ణారెడ్డి ఫోన్, ల్యాప్‌టాప్‌లను ఫోరెన్సిక్ పరీక్షలకు పంపారు. మరో ఇద్దరి వాంగ్మూలాలను నమోదు చేశారు. ఈ వ్యవహారంలో ఆర్థిక లావాదేవీల కోణంలోనూ అధికారులు దర్యాప్తు చేపట్టారు. ఇన్‌స్టాలో పరిచయమైన మరో యువతికి ఉదయ్ పెళ్లి ప్రతిపాదనలు పంపినట్లు గుర్తించారు. ఆ యువతి స్టేట్‌మెంట్‌ను ఇప్పటికే పోలీసులు రికార్డు చేశారు. మరోవైపు ఉప్పరపల్లి కోర్టులో ఉదయ్ బెయిల్ పిటిషన్‌పై మధ్యాహ్నం కోర్టు విచారణ చేపట్టనుంది. పోలీసు కస్టడీ పిటిషన్ రేపు విచారణకు వచ్చే అవకాశం ఉంది.

# 3కోట్లు ముంచేసిన దంపతులు పరారీ

**సంగారెడ్డి, ఆగస్ట్ 3:** అమీన్‌పూర్ మండలం బీరంగూడ డివిజన్‌లోని రాఘవేంద్ర కాలనీలో చిట్టీల పేరుతో భారీ మోసం జరిగింది. స్థానికంగా సాయి గణేలిష్ టెక్స్‌టైల్స్ పేరుతో బట్టల దుకాణం నిర్వహిస్తున్న శిరీష.. తన భర్త సాంబశివరావుతో కలిసి కొన్నేళ్లుగా చిట్టీల వ్యాపారం నిర్వహిస్తోంది. అధిక లాభాలు వస్తాయని ఆశ చూపిస్తూ కాలనీలోని పలువురు మహిళలను ఆకర్షించి, వారి నుంచి విడతల వారీగా భారీ మొత్తంలో నగదు సేకరించినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో దాదాపు రూ.3 కోట్ల వరకు వసూలు చేసినట్లు సమాచారం. చిట్టీల గడువు సమీపిస్తుండటంతో డబ్బులు తిరిగి ఇవ్వాల్సిన సమయంలో శిరీష, సాంబశివరావు దంపతులు తమ సొంత ఇంటిని విక్రయించి రాత్రికి రాత్రే పరారైనట్లు స్థానికులు చెబుతున్నారు. దీంతో మోసపోయిన మహిళలు తీవ్ర ఆందోళనకు గురై అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దంపతుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. బాధితుల నుంచి పూర్తి వివరాలు సేకరించి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## సంపాదకీయం



# హామీలతో మోసగిస్తున్న పాలకులు!

### మారుతున్న ప్రభుత్వాలు.. మారని ప్రజల కష్టాలు

ప్రభుత్వాలు మారుతున్నాయి. ముఖ్యమంత్రులు మారుతున్నారు. పార్టీ జెండాలు, నినాదాలు మారుతున్నాయి. కానీ ప్రజల సమస్యలు మాత్రం అలాగే మిగిలిపోతున్నాయి. ఎన్నికల ముందు గుప్పించే హామీలు అధికారంలోకి వచ్చిన తరువాత ఒక్కొక్కటిగా మరుగున పడుతున్నాయి. ప్రజల విశ్వాసాన్ని ఓట్లుగా మార్చుకోవడంలో చూపే చురుకుదనం, ఆ హామీల అమలులో మాత్రం కనిపించడం లేదు. తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లకు చేరువవుతున్నా కీలక సమస్యలపై ఇంకా స్పష్టత కనిపించడం లేదు. ధరణి వ్యవస్థలో జరిగిన అక్రమాలను వెలికితీస్తామని, అన్యాక్రాంతమైన భూములను తిరిగి స్వాధీనం చేసుకుంటామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పెద్దఎత్తున ప్రచారం చేసింది. కానీ ఇప్పటివరకు ఎన్ని ఎకరాలు అక్రమంగా చేతులు మారాయి, ఎవరెవరు లబ్ధి పొందారు, ఎంత ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైంది అన్న అంశాలపై ప్రజలకు సమగ్ర సమాచారం అందలేదు. దేవాదాయ శాఖకు చెందిన వేలాది ఎకరాల భూములు అక్రమ ఆక్రమణలకు గురయ్యాయన్న ఆరోపణలు చాలా కాలంగా ఉన్నాయి. కొందరు వాటికి పట్టాలు సృష్టించుకుని రైతు భరోసా వంటి పథకాల ప్రయోజనాలు కూడా పొందుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ భూములను కాపాడలేకపోయింది. ప్రస్తుత ప్రభుత్వం కూడా నిర్ణయాత్మక చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు. ఆంధ్రప్రదేశ్‌లోనూ దేవాదాయ, ప్రభుత్వ భూముల పరిరక్షణపై పాలకులు స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాల్సిన అవసరం ఉంది. కాళేశ్వరం విషయంలోనూ విమర్శలు, ప్రత్యారోపణలే తప్ప ప్రజలకు ఉపయోగపడే పరిష్కారం కనిపించడం లేదు. ప్రాజెక్టులో జరిగిన లోపాలు, అవినీతి ఆరోపణలపై విచారణ జరగాల్సిందే. అదే సమయంలో ప్రజాధనంతో నిర్మించిన వ్యవస్థలో ఉపయోగించగల భాగాలను శాస్త్రీయంగా వినియోగంలోకి తీసుకురావడంపైనా దృష్టి పెట్టాలి. రాజకీయ ఆధిపత్య పోరాటంలో ప్రజల ప్రయోజనాలు బలికాకూడదు. జర్నలిస్టుల సమస్యల విషయంలోనూ ప్రభుత్వాల నిర్లక్ష్యం కొనసాగుతోంది. అక్రిడిటేషన్లు, ఆరోగ్య కార్డులు, ఇళ్ల స్థలాలు వంటి అంశాలు సంవత్సరాలుగా పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జర్నలిస్టులకు కేటాయించిన భూములపై వివాదాలు కొనసాగుతున్నాయి. న్యాయస్థాన తీర్పులను చూపిస్తూ వేల కోట్ల విలువైన భూములను ఇతర అవసరాలకు మళ్లించే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. జర్నలిస్టుల సంక్షేమం గురించి సభల్లో చెప్పే మాటలు కార్యరూపం దాల్చకపోతే వాటికి విలువ ఉండదు. అన్నింటికన్నా తీవ్రమైన సమస్య నిరుద్యోగం. ఢిల్లీలో విద్యార్థుల ఆందోళనలకు సంఘీభావం ప్రకటించే రాజకీయ నాయకులు, తమ రాష్ట్రాల్లోని నిరుద్యోగుల ప్రశ్నలకు మాత్రం సమాధానం చెప్పడం లేదు. తెలంగాణలో ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలు, ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్, నెలకు రూ.4 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని కాంగ్రెస్ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీల అమలు మాత్రం ఆశించిన స్థాయిలో జరగలేదు. 2024 ఆగస్టు 2న అసెంబ్లీ వేదికగా ప్రకటించిన జాబ్ క్యాలెండర్‌లో 15 రకాల నోటిఫికేషన్లు ఇస్తామని ప్రభుత్వం తెలిపింది. కానీ రెండేళ్లు గడిచినా అందులో పేర్కొన్న నోటిఫికేషన్లలో చాలావరకు వెలువడలేదన్న అసంతృప్తి నిరుద్యోగుల్లో ఉంది. జాబ్ క్యాలెండర్‌కు కాలపరిమితి ముగిసిపోయినా బాధ్యత ఎవరిదన్న ప్రశ్నకు సమాధానం లేదు. యువజన డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీల పరిస్థితీ ఇదే. నిరుద్యోగ భృతి, విద్యాభరోసా కార్డు, వడ్డీలేని రుణాలు, యువతులకు విద్యుత్ స్కూటీలు వంటి హామీలు కాగితాలపైనే మిగిలిపోయాయని యువత ఆరోపిస్తోంది. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలో వేలాది నియామకాలు చేపట్టామని ప్రభుత్వం చెబుతున్నా, ఎన్నికల సమయంలో ఇచ్చిన మొత్తం హామీలతో పోలిస్తే ఇంకా పెద్ద అంతరం కనిపిస్తోంది. ప్రభుత్వ శాఖల్లో ఖాళీలు వేలల్లో ఉన్నాయి. పాఠశాల విద్యాశాఖలో వేలాది ఉపాధ్యాయ పోస్టులు, విశ్వవిద్యాలయాల్లో బోధన, బోధనేతర పోస్టులు, గురుకులాలు, పోలీసు, ఆర్టీసీ, అంగన్‌వాడీలు, ఎక్సైజ్, మైనారిటీ సంక్షేమ శాఖల్లో భారీగా ఖాళీలు ఉన్నట్లు వివిధ వర్గాలు చెబుతున్నాయి. ప్రతి సంవత్సరం వేల మంది ఉద్యోగ విరమణ పొందుతున్నా, ఆ మేరకు నియామకాలు జరగకపోవడంతో ఖాళీల సంఖ్య పెరుగుతోంది. రెగ్యులర్ ఉద్యోగుల సంఖ్యకు సమానంగా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్న పరిస్థితి కూడా ఆందోళన కలిగిస్తోంది. శాశ్వత ఉద్యోగాల స్థానంలో తాత్కాలిక నియామకాలే ప్రభుత్వాలకు అనుకూల మార్గంగా మారాయి. దీనికి గత ప్రభుత్వాలన్నీ బాధ్యత వహించాల్సిందే. ఇంటికో ఉద్యోగం, లక్షల నియామకాలు అంటూ గతంలో బీఆర్ఎస్ చేసిన ప్రకటనలు కూడా నిరుద్యోగుల ఆశలను నెరవేర్చలేకపోయాయి. తెలంగాణలో కేసీఆర్, రేవంత్ రెడ్డి అయినా.. ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు, జగన్ అయినా ఎన్నికల సమయంలో ప్రజలకు భారీ హామీలు ఇచ్చారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్థిక ఇబ్బందులు, గత ప్రభుత్వ అప్పులు, న్యాయపరమైన చిక్కులు వంటి కారణాలను చూపుతూ అమలును వాయిదా వేస్తున్నారు. ప్రజలు మాత్రం ప్రతి ఎన్నికలో కొత్త ఆశతో ఓటేస్తూ, తరువాత మళ్లీ నిరాశలో మునిగిపోతున్నారు. ప్రజాస్వామ్యంలో హామీ అనేది కేవలం ఎన్నికల ప్రచార నినాదం కాదు. అది ప్రజలతో చేసుకున్న ఒప్పందం. అధికారంలోకి వచ్చిన తర్వాత దానిని అమలు చేయాల్సిన నైతిక, రాజకీయ బాధ్యత పాలకులపై ఉంటుంది. హామీలు నిలబెట్టుకోలేని ప్రభుత్వాలు కనీసం ప్రజలకు నిజాయతీగా పరిస్థితిని వివరించాలి. కాలపట్టిక ప్రకటించాలి. పురోగతిని వెల్లడించాలి. మాటలతో ప్రజలను కొంతకాలం మభ్యపెట్టవచ్చు. కానీ నిరుద్యోగి నిరీక్షణను, రైతు నష్టాన్ని, జర్నలిస్టు ఆవేదనను, భూమి కోల్పోయిన పేదవాడి బాధను శాశ్వతంగా దాచలేరు. ప్రభుత్వాలు మారినా పాలనా ధోరణి మారకపోతే ప్రజల విశ్వాసం క్రమంగా కరిగిపోతుంది. పాలకులు ఇప్పటికైనా హామీల రాజకీయాల నుంచి బాధ్యతాయుత పాలన వైపు అడుగులు వేయాలి.

# జార్ఖండ్‌లో పబ్లిక్ సర్వీస్ కమిషన్ పేపర్ లీక్

- సమగ్ర విచారణ జరపాలంటూ విద్యార్థుల డిమాండ్
- నిరాహారదీక్షకు దిగిన విద్యార్థులు.. మద్దతుగా ఆందోళన
- ఆందోళనకు మద్దతు తెలిపన కాక్రోచ్ నేత అభిజిత్ దీప్కే




**రాంచీ, ఆగస్ట్ 3:** నీట్ పేపర్ లీక్ నిరసనలతో కొన్నిరోజుల క్రితం దేశ రాజధాని ఢిల్లీ ఉద్రిక్తంగా మారగా.. ఇప్పుడు ఝార్ఖండ్‌లో అదే పరిస్థితి కనిపిస్తోంది. ఝార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రిలిమినరీ పరీక్షలో అవకతవకలు చోటుచేసుకున్నాయని రాజధాని నగరం రాంచీలో ప్రారంభమైన ఆందోళనలు ఉధృతంగా మారాయి. నియామక పరీక్షను రద్దు చేయాలని, ఆ ఆరోపణలపై సీబీఐతో దర్యాప్తు జరిపించాలని, నియామక వ్యవస్థలో సంస్కరణలు చేపట్టాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను నెరవేర్చాలంటూ విద్యార్థి నాయకుడు దేవేంద్రనాథ్ మహతో ఆదివారం జైపాల్ సింగ్ ముండా స్టేడియంలో నిరాహార దీక్ష ప్రారంభించారు. ఈ ఆందోళనలకు కాక్రోచ్ జనతాపార్టీ మద్దతు ప్రకటించింది. జేపీఎస్సీ పరీక్ష ఫలితాలు గతనెల విడుదలయ్యాయి. తర్వాత ముఖ్యమంత్రిని కలిసి, పేపర్ లీక్‌పై ఆధారాలను సమర్పించాం. కొన్నివారాలుగా నిరసనలు జరుగుతున్నా.. విద్యార్థుల ఆందోళనలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం, జేపీఎస్సీ తగిన చర్యలు తీసుకోవడంలో విఫలమైంది.




దాంతో విద్యార్థులు నిరుత్సాహానికి గురవుతున్నారు. వారిలో మనోధైర్యాన్ని నింపేందుకు, మా పోరాటాన్ని ఉద్ధృతం చేసేందుకు నిరాహార దీక్ష ప్రారంభిస్తున్నాను. నిందితులకు శిక్ష పడటమే మా ప్రధాన లక్ష్యం అని స్టేడియంలోని ఆందోళనకారులను ఉద్దేశించి మహతో మాట్లాడారు. పేపర్ లీక్ ఆరోపణలు, నియామక ప్రక్రియలో అవకతవకలు, పాలనాపరమైన లోపాలతో తమ కెరీర్‌కు తీవ్రనష్టం వాటిల్లుతోందంటూ ఆ రాష్ట్రంలోని విద్యార్థులు కొన్ని వారాల క్రితం నిరసనలు ప్రారంభించారు. జేపీఎస్సీ, జేఎస్ఎస్సీ సీజీఎల్ పరీక్షలకు సంబంధించి ఓఎంఆర్ షీట్ వైరల్ అయిన తర్వాతే ప్రభుత్వం స్పందించిందని ఆందోళనకారులు విమర్శించారు. ఈ పరీక్షల విషయంలో సంస్థాగత మార్పులు తీసుకురావాలని డిమాండ్ చేశారు. వీరికి సీజేపీ మద్దతు ప్రకటించింది. నిరసనకారులతో మాట్లాడాం. వారికి మేం అండగా ఉంటాం. వారి డిమాండ్లకు మా మద్దతు ఉంటుందని అభిజీత్ దీప్కే ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఝార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రిలిమినరీ పరీక్షలో పేపర్ లీకైనట్టు ఆరోపణలు రావడంతో అక్కడి విద్యార్థులు గత కొన్ని రోజులుగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో కాక్రోచ్ జనతా పార్టీ తాజాగా ఝార్ఖండ్ విద్యార్థులకు మద్దతు ప్రకటించింది. దేశరాజధాని రాంచీలో ప్రస్తుతం విద్యార్థుల నిరసనలు మిన్నంటాయి. పేపర్ లీక్ ఉదంతంపై దర్యాప్తు జరపాలని విద్యార్థులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. రాంచీలోని జైపాల్ సింగ్ ముండా స్టేడియం వద్ద విద్యార్థులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. విద్యార్థి నాయకుడు దేవేంద్ర నాథ్ మహతో ఆదివారం ఆమరణ దీక్ష ప్రారంభించారు. వారాల తరబడి నిరసన తెలుపుతున్నా ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు తీసుకోవడంలో విఫలమైందని మహతో ఆరోపించారు. కమిషన్, ప్రభుత్వం తీరుతో విద్యార్థుల మనోవేదనకు గురవుతున్నారని అన్నారు. ముఖ్యమంత్రి తమ డిమాండ్స్‌కు ఆమోదం తెలిపే వరకూ తన దీక్ష కొనసాగుతుందని చెప్పారు. ఇటీవల జరిగిన ప్రిలిమినరీ పరీక్షను రద్దు చేయాలని కూడా ఆయన డిమాండ్ చేశారు. ఈ మధ్యకాలంలో టీడీపీఎల్ ద్వారా జరిగిన పరీక్షలను సమీక్షించాలని డిమాండ్ చేశారు. ఎగ్జామ్‌లోనైనా పేపర్ లీక్ జరుగుతూనే ఉందని ఒక విద్యార్థులు మండిపడ్డారు. ఈ విషయాలపై సీఎం హేమంత్ సోరెన్ తమతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు.

# విద్యార్థులపై కేసులు ముందుకు తీసుకెళ్లం

- సుప్రీంకోర్టుకు కేంద్రం హామీ.. ఎలాంటి బలవంతపు చర్యలు ఉండవని స్పష్టం
- హామీని తప్పకుండా అమలు చేయాలని కేంద్రానికి ధర్మాసనం ఆదేశం

**న్యూఢిల్లీ, ఆగస్టు 3:** జంతర్‌మంతర్ వద్ద గత నెల జరిగిన విద్యార్థుల ఆందోళనల సందర్భంగా నమోదైన ఎఫ్ఐఆర్‌లపై కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీకి సంబంధించిన అంశాన్ని సుప్రీంకోర్టు సోమవారం విచారించింది. విద్యార్థులపై నమోదైన కేసులను ముందుకు తీసుకెళ్లబోమన్న తమ హామీకి కట్టుబడి ఉన్నామని కేంద్ర ప్రభుత్వం ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనానికి స్పష్టం చేసింది. విచారణ సందర్భంగా ప్రభుత్వం కోర్టుకు ఇచ్చిన హామీ కేవలం మాటల్లోనే కాకుండా ఆచరణలోనూ అమలు కావాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. గతంలో ఇచ్చిన హామీకి విరుద్ధంగా విద్యార్థులపై అనవసరమైన చట్టపరమైన చర్యలు కొనసాగించరాదని కేంద్రాన్ని ఆదేశించింది. విద్యార్థులపై బలవంతపు చర్యలు తీసుకోవద్దంటూ ఇప్పటికే మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన విషయాన్ని కూడా ధర్మాసనం గుర్తు చేసింది. జంతర్‌మంతర్ ఆందోళనలకు సంబంధించి ఇప్పటికే నమోదైన ఎఫ్ఐఆర్‌ల దర్యాప్తుపై వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో, ప్రభుత్వం తన హామీని ఏ విధంగా అమలు చేస్తుందనే అంశంపై కోర్టు దృష్టి సారించింది. మరోవైపు విద్యార్థుల ఆందోళనలకు నాయకత్వం వహిస్తున్న సీజేపీ స్పందిస్తూ, కేంద్రం ఇచ్చిన హామీ మేరకు నమోదైన అన్ని ఎఫ్ఐఆర్‌లను పూర్తిగా ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసింది. హామీలు అమలు కాకపోతే దేశవ్యాప్తంగా మరోసారి ఆందోళనలు చేపడతామని హెచ్చరించింది.



# సహజీవనం కూడా చట్టబద్ధమే!

### భాగస్వామిని వేధింపులకు గురి చేస్తే చట్టప్రకారం శిక్ష

### సుప్రీం ధర్మాసనం సంచలన తీర్పు




**న్యూఢిల్లీ, ఆగస్ట్ 3:** సహజీవనం అంశంపై భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు సంచలన తీర్పునిచ్చింది. సహజీవనంలో భాగస్వామిని వేధింపులకు గురి చేస్తే భారతీయ శిక్షాస్మృతిలోని సెక్షన్ 498-ఏ ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేయవచ్చని స్పష్టం చేసింది. పెళ్లి కాలేదనే కారణంతో భర్త స్థానంలో ఉన్న వ్యక్తి వేధింపుల ఆరోపణల నుంచి తప్పించుకోలేరని పేర్కొంది. వివాహం జరగలేదన్న కారణాన్ని చూపి బాధితురాలికి చట్టపరమైన రక్షణ కల్పించకపోవడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 14కు విరుద్ధమని తెలిపింది. ఈ మేరకు జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ఎన్.కోటిశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం తీర్పు వెలువరించింది. ఈ సందర్భంగా భర్త అనే పదానికి ధర్మాసనం విస్తృత వివరణను ఇచ్చింది. సహజీవన చేస్తున్న వ్యక్తిని భర్తతో సమానంగా పరిగణించవచ్చని తెలిపింది. ఇలాంటి వ్యక్తులు భాగస్వామిని వేధించి తప్పించుకోలేరని ధర్మాసనం పేర్కొంది. అయితే, అన్ని రకాల సహజీవనాలకు ఈ తీర్పు వర్తించదని స్పష్టం చేసింది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి సహజీవనం చేస్తూ హింసకు పాల్పడిన వారికే సెక్షన్ 498-ఏ వర్తిస్తుందని వెల్లడించింది. అలాగే, ప్రాథమిక విచారణ నిర్వహించకుండా తక్షణ అరెస్టులు చేయవద్దని పోలీసులకు కఠిన ఆదేశాలు జారీ చేసింది. ఈ సందర్భంగా సెక్షన్ 498-ఏ ఉద్దేశాన్ని ధర్మాసనం వివరించింది. ఈ సెక్షన్ మహిళలను భర్త లేదా అతని కుటుంబ సభ్యుల మానసిక, శారీరక వేధింపుల నుంచి రక్షించడానికే అని గుర్తు చేసింది. అలాంటి వేధింపులు కేవలం చట్టబద్ధమైన వివాహ బంధంలోనే జరుగుతాయని భావించడం వాస్తవాలకు విరుద్ధమని వ్యాఖ్యానించింది. వివాహిత మహిళకు ఒక రకమైన రక్షణ కల్పించి, అదే తరహా సంబంధంలో ఉన్న మరో మహిళకు రక్షణ నిరాకరించడం సహేతుకం కాదని ధర్మాసనం అభిప్రాయ పడింది. వ్యక్తిగత స్వేచ్ఛలో భాగంగా జీవిత భాగస్వామిని ఎంచుకునే హక్కును చట్టం గుర్తించిందని ధర్మాసనం తెలిపింది. ఆ విధంగా భాగస్వామిని ఎంచుకున్న మహిళకు చట్టపరమైన రక్షణను నిరాకరించలేమని పేర్కొంది. సహజీవనం చేస్తున్న మహిళకు తన భాగస్వామి లేదా అతని కుటుంబ సభ్యుల నుంచి వేధింపులు ఎదురైతే ఆమెకు కూడా సమాన చట్టపరమైన రక్షణ కల్పించాల్సిందేనని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది.

# ప్రధానిపై వ్యాఖ్యలు చేసిన మైనర్‌కు ఊరట

- క్షమించానని మోదీ సందేశం..
- కేసు కొనసాగించబోమన్న ఢిల్లీ పోలీసులు
- జీరో ఎఫ్ఐఆర్ బదిలీ అనంతరం కీలక నిర్ణయం
- పశ్చాత్తాపం వ్యక్తం చేసిన బాలిక



**న్యూఢిల్లీ, ఆగస్టు 3:** నీట్ పేపర్ లీక్ నిరసనల సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన మైనర్ బాలికపై నమోదైన కేసును కొనసాగించబోమని ఢిల్లీ పోలీసు వర్గాలు వెల్లడించాయి. ఈ ఘటనకు సంబంధించి తొలుత నోయిడా పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి, అనంతరం దాన్ని ఢిల్లీలోని పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. ప్రధాని పదవిని అగౌరవపరిచేలా, శాంతిభద్రతలకు భంగం కలిగించేలా వ్యాఖ్యలు చేశారనే ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసినప్పటికీ, ప్రస్తుతం మైనర్‌పై తదుపరి చర్యలు తీసుకోకూడదని నిర్ణయించినట్లు సమాచారం. ఈ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. తన కుమార్తె వయసు కేవలం 15 సంవత్సరాలేనని, అయితే ఎఫ్ఐఆర్‌లో పొరపాటున 25 సంవత్సరాలుగా నమోదు చేశారని బాలిక తల్లి వెల్లడించారు. ఈ అంశాన్ని అధికారులు పరిగణనలోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇటీవల బాలిక సోషల్ మీడియాలో వీడియో విడుదల చేసి ప్రధానికి క్షమాపణలు తెలిపింది. నిరసన కార్యక్రమంలో ఇతరుల ప్రభావానికి లోనై అలాంటి వ్యాఖ్యలు చేశానని, అది తన తప్పిదమని, ఇకపై అలాంటి పొరపాటు జరగదని పేర్కొంది. ఈ వ్యవహారంపై ప్రధాని నరేంద్ర మోదీ కూడా స్పందించినట్లు సమాచారం. తప్పుదారి పట్టిన చిన్నారులను శిక్షించడం కంటే వారికి సరైన మార్గనిర్దేశం చేయడం అవసరమని అభిప్రాయపడినట్లు జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. బాలిక తల్లి మాట్లాడుతూ, తన కుమార్తెను క్షమించిన ప్రధాని గొప్ప మనసు చాటుకున్నారని అన్నారు. అయితే ఎఫ్ఐఆర్‌ను కూడా పూర్తిగా ఉపసంహరించాలని పోలీసులను కోరారు. 18 ఏళ్లలోపు పిల్లలకు ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాల వినియోగంపై పరిమితులు విధించాలని కూడా ఆమె సూచించారు. చిన్నారులు సులభంగా ఇతరుల ప్రభావానికి లోనయ్యే అవకాశం ఉందని, వారి దృష్టి చదువులపైనే ఉండేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఘటన తర్వాత తమ కుటుంబం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందని, వైరల్ వీడియో వెలుగులోకి వచ్చిన తర్వాత నివాసం కూడా మార్చుకోవాల్సి వచ్చిందని ఆమె తెలిపారు. నిరసన కార్యక్రమాలకు హాజరై అభిప్రాయాలు వ్యక్తం చేసే హక్కు యువతకు ఉన్నప్పటికీ, అసభ్య పదజాలం ఉపయోగించడం సమర్థనీయం కాదని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ వ్యవహారంలో బాలిక మైనర్ అని నిర్ధారణ అయిన నేపథ్యంలో కేసును కొనసాగించకూడదని పోలీసులు నిర్ణయించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

చురకలు



# తల్మడ్ల రైల్వే అండర్ బ్రిడ్జి రెండు నెలల పాటు మూసివేతకు కలెక్టర్ అనుమతి

**కామారెడ్డి, ఆగస్టు 3::**



కామారెడ్డి జిల్లా తల్మడ్ల యార్డు వద్ద ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జి (RUB) నెం. 569Aను తాత్కాలికంగా మూసివేయడానికి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అనుమతి మంజూరు చేశారు. ఈ మేరకు జూలై 31, 2026న ఉత్తర్వులు జారీ చేశారు.ముద్ఖేడ్–మెద్చల్ రైల్వే డబ్లింగ్ ప్రాజెక్టులో భాగంగా RUB విస్తరణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో, రెండు నెలల పాటు అండర్ బ్రిడ్జిని మూసివేసి వాహనాలను ప్రత్యామ్నాయంగా RUB నెం. 570A మీదుగా మళ్లించాలని నిర్ణయించారు.ఈ ప్రతిపాదనపై పోలీసు, ఆర్ అండ్ బీ, రెవెన్యూ, జిల్లా పంచాయతీ శాఖల నుంచి నివేదికలు సేకరించారు. ప్రత్యామ్నాయ మార్గంలో ట్రాఫిక్ సజావుగా సాగుతుందని, శాంతిభద్రతల సమస్యలు తలెత్తే అవకాశం లేదని పోలీసు శాఖ పేర్కొంది. ఆర్ అండ్ బీ, రెవెన్యూ శాఖలు కూడా ఎలాంటి అభ్యంతరం లేదని స్పష్టం చేశాయి.అయితే, గ్రామస్థులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ అండర్‌పాస్ మార్గంలో అవసరమైన మరమ్మతులు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి సూచించారు.మూసివేత సమయంలో రైల్వే అధికారులు బ్యారికేడ్లు ఏర్పాటు చేయడం, హెచ్చరిక బోర్డులు, డైవర్షన్ సూచికలు ఏర్పాటు చేయడం, ప్రత్యామ్నాయ మార్గంలో ట్రాఫిక్‌ను సక్రమంగా

# హైదరాబాద్‌లో బ్రిక్స్ అవినీతి నిరోధక వర్కింగ్ గ్రూప్ రెండో సమావేశం

**హైదరాబాద్, ఆగస్టు 3 :**

భారత బ్రిక్స్ అధ్యక్షతలో భాగంగా ఆగస్టు 4–5 తేదీల్లో హైదరాబాద్‌లో బ్రిక్స్ అవినీతి నిరోధక వర్కింగ్ గ్రూప్ (ACWG) రెండో సమావేశం, ఆస్తుల పునరుద్ధరణ నిపుణుల నెట్‌వర్క్ రెండో సమావేశాన్ని కేంద్ర సిబ్బంది, శిక్షణ శాఖ (DoPT) నిర్వహించనుంది.సమావేశాన్ని డీఓపీటీ కార్యదర్శి రచనా షా ప్రారంభిస్తారు. బ్రిక్స్ సభ్య దేశాల ప్రతినిధులు, విధాన నిర్ణేతలు, అవినీతి నిరోధక మరియు చట్ట అమలు సంస్థల నిపుణులు పాల్గొంటారు.సరిహద్దులు దాటి జరిగే అవినీతి నిరోధం, అక్రమ ఆస్తుల పునరుద్ధరణ, పరారీలో ఉన్న నిందితుల గుర్తింపు, అప్పగింత ప్రక్రియల బలోపేతం, ఫిన్‌టెక్, డిజిటల్ ఆస్తులు, కొత్త డిజిటల్ ఆర్థిక వ్యవస్థలతో ముడిపడిన అవినీతి ప్రమాదాల నివారణపై చర్చలు జరుగుతాయి.ఆగస్టు 5న "నూతన సాంకేతికత ఆధారిత నైతిక పాలన" అంశంపై ప్రత్యేక సదస్సు నిర్వహించి, డిజిటల్ ప్రజా కొనుగోళ్లు, పౌర భాగస్వామ్యం, పారదర్శకత, జవాబుదారీతనం వంటి అంశాల్లో సభ్య దేశాలు తమ అనుభవాలను పంచుకోనున్నాయి. సమావేశం ద్వారా బ్రిక్స్ దేశాల

# బీజేపీ కోటలో ప్రశాంత్ కిశోర్ సంచలన విజయం

- **తొలి ఎన్నికలోనే బ్యాంకీపూర్‌ను కైవసం చేసుకున్న జన సురాజ్ అధినేత**

**పాట్నా, ఆగస్టు 3 :**

ప్రముఖ ఎన్నికల వ్యూహకర్తగా దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన జన సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ తన తొలి ఎన్నికల్లోనే సంచలన విజయం సాధించారు. బీజేపీకి మూడు దశాబ్దాలుగా బలమైన కోటగా పేరున్న బీహార్‌లోని బ్యాంకీపూర్ అసెంబ్లీ నియోజకవర్గాన్ని గెలుచుకుని రాష్ట్ర రాజకీయాల్లో కొత్త అధ్యాయానికి నాంది పలికారు.బ్యాంకీపూర్ ఉప ఎన్నికలో ప్రశాంత్ కిశోర్ బీజేపీ అభ్యర్థి నీరజ్ కుమార్‌ను సుమారు 19 వేల ఓట్ల మెజారిటీతో ఓడించారు. దీంతో 1995 నుంచి కొనసాగుతున్న బీజేపీ ఆధిపత్యానికి తెరపడింది.ఈ ఉప ఎన్నిక అత్యంత ప్రతిష్ఠాత్మకంగా మారింది. గతంలో ఐదు పర్యాయాలు బీజేపీ ఎమ్మెల్యేగా గెలిచిన నితిన్ నవీన్ రాజ్యసభకు ఎన్నిక కావడంతో బ్యాంకీపూర్ స్థానానికి ఉప ఎన్నిక జరిగింది. మొదట ప్రకటించిన అభ్యర్థిని బీజేపీ మార్చి నీరజ్ కుమార్‌ను బరిలోకి దింపినా, ప్రశాంత్ కిశోర్ ప్రచారంలో ఆధిక్యం ప్రదర్శించి చివరకు విజయాన్ని సొంతం చేసుకున్నారు.రాజకీయ వ్యూహకర్తగా నరేంద్ర మోదీ, నితీశ్ కుమార్, మమతా బెనర్జీ తదితర నేతల ఎన్నికల ప్రచారాలను విజయవంతంగా నడిపించిన ప్రశాంత్ కిశోర్, తర్వాత జన సురాజ్ పార్టీని స్థాపించి ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. ఈ విజయం ఆయన రాజకీయ జీవితంలో తొలి ఎన్నికల విజయంగా నిలిచింది.ఈ ఫలితం బీహార్ రాజకీయాల్లో కీలక మార్పులకు సంకేతంగా రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. జన సురాజ్ పార్టీకి రాష్ట్రవ్యాప్తంగా మరింత బలం చేకూరే అవకాశముందని, రాబోయే రాజకీయ సమీకరణాలపై ఈ విజయం ప్రభావం చూపవచ్చని వారు పేర్కొంటున్నారు. అదే సమయంలో బీజేపీకి ఈ ఫలితం ఆత్మపరిశీలన అవసరాన్ని సూచిస్తోందని

# రంగం (భవిష్యవాణి) కన్నుల పండుగగా..

- **భక్తి పారవశ్యంలో ఉజ్జయిని మహంకాళి ఆలయం**

**హైదరాబాద్, ఆగస్టు 3 :**





శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి దేవాలయంలో సోమవారం నిర్వహించిన రంగం (భవిష్యవాణి) కార్యక్రమం భక్తి శ్రద్ధల నడుమ అత్యంత వైభవంగా జరిగింది. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆలయ మర్యాదలతో స్వాగతం పొంది భవిష్యవాణి కార్యక్రమంలో పాల్గొన్నారు.భవిష్యవాణి వినిపించిన స్వర్ణలత ప్రజా శ్రేయస్సు, ప్రకృతి శ్రేయస్సు, పచ్చని పంటలు, సమృద్ధిగా వర్షాలు కురుస్తాయని ఆశీర్వచనాలు అందించారు. భక్తులు కోరిన కోరికలు నెరవేరుతాయని, బోనాలు–రంగం వేడుకలు ఆనందాన్ని నింపాయని పేర్కొన్నారు.అనంతరం అమ్మవారిని ఏనుగు అంబారిపై ప్రతిష్ఠించి పోతురాజుల విన్యాసాల మధ్య ఆలయం చుట్టూ వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిసిపోగా, భారీ సంఖ్యలో ప్రజలు ఊరేగింపును తిలకించారు.కార్యక్రమంలో మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, దేవాదాయ శాఖ ప్రధాన కార్యదర్శి శైలజ రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా, డీసీపీ రక్షిత మూర్తి, ఆలయ చైర్మన్ రామేశ్వర్, జాయింట్ కమిషనర్

# నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధిపై సమీక్ష

**హైదరాబాద్, ఆగస్టు 3 ::**





నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధ్యక్షతన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ పాల్గొన్నారు.సమావేశంలో జిల్లా ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులతో కలిసి ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాల మెరుగుదల, వైద్య సేవల విస్తరణ, సిబ్బంది నియామకం, ప్రజలకు అందుతున్న సేవలపై సమగ్రంగా చర్చించారు.ప్రజలకు నాణ్యమైన, అందుబాటులో ఉండే వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మహమ్మద్ అలీ షబ్బీర్ తెలిపారు.ఈ సమావేశంలో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, బాన్స్వాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి, బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి, ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# మల్కాజ్‌గిరిలో 207 దేవాలయాలకు రూ.76.03 లక్షల ఆర్థిక సాయం

- **బోనాల ఉత్సవాల నేపథ్యంలో చెక్కుల పంపిణీ**

**మల్కాజ్‌గిరి, ఆగస్టు 3 :**

ఆషాఢ మాస బోనాల ఉత్సవాల సందర్భంగా మల్కాజ్‌గిరి నియోజకవర్గ పరిధిలోని 207 దేవాలయాలకు రాష్ట్ర దేవాదాయ శాఖ రూ.76.03 లక్షల ఆర్థిక సాయాన్ని మంజూరు చేసింది.వాణీనగర్‌లోని శ్రీ విజయ వినాయక స్వామి దేవాలయ ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఆలయాల ప్రతినిధులకు ఆర్థిక సహాయ చెక్కులను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహకారం అభినందనీయమన్నారు. నియోజకవర్గంలోని పురాతన, ప్రసిద్ధ ఆలయాలతో పాటు నూతనంగా ఏర్పాటైన దేవాలయాలకు కూడా నిధులు కేటాయించాలని మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖలను కోరినట్లు తెలిపారు.తన విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుని 207 దేవాలయాలకు రూ.76.03 లక్షలు మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి, మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలందరూ బోనాల పండుగను భక్తిభావంతో, సంతోషోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు.




కార్యక్రమంలో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్, ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ మోహన్ రెడ్డి, ఆలయ కార్యనిర్వహణ అధికారులు, అర్చకులు, మాజీ

# ఖమ్మం భవిష్యత్ అవసరాలకు విద్యుత్ మౌలిక వసతులు సిద్ధం చేయాలి

## మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**ఖమ్మం, ఆగస్టు 3 :**

ఖమ్మం నగర భవిష్యత్ విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తుగా మౌలిక వసతులు అభివృద్ధి చేయాలని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. రఘునాథపాలెం ప్రభుత్వ వైద్య కళాశాల వద్ద రూ.3.62 కోట్లతో నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రానికి ఆయన శంకుస్థాపన చేశారు. నగరానికి 132 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేసి, భూమి కేటాయింపు పూర్తికాగానే పనులు ప్రారంభించి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

# సహజ వ్యవసాయానికి ఊతం.. తెలంగాణలో 326 బయో-ఇన్‌పుట్ కేంద్రాలు

**హైదరాబాద్, ఆగస్టు 3 :**

తెలంగాణలో సహజ వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు నిఫ్టమ్–సెర్ప్ సంయుక్తంగా రాష్ట్రవ్యాప్తంగా 326 బయో–ఇన్‌పుట్ రిసోర్స్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నాయి. ఈ కార్యక్రమం కోసం 56 మంది జిల్లా అధికారులు, 318 మంది మహిళా పారిశ్రామికవేత్తలకు శిక్షణ ఇచ్చారు. ఈ కేంద్రాల ద్వారా జీవామృతం, బీజామృతం వంటి సహజ వ్యవసాయ ఇన్‌పుట్‌లను తయారు చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు రసాయనాల వినియోగాన్ని తగ్గించి నేల ఆరోగ్యాన్ని మెరుగుపర్చే లక్ష్యంతో కార్యక్రమం అమలు చేస్తున్నారు.

# మెరికల్చర్ అభివృద్ధికి ఏఐ ఆధారిత జాతీయ ప్రాజెక్టు ప్రారంభం

**హైదరాబాద్, ఆగస్టు 3 :**

మెరికల్చర్ రంగ అభివృద్ధికి ఏఐ ఆధారిత విధాన రూపకల్పన కోసం ఐసీఏఆర్–నార్మ్, హైదరాబాద్‌లో జాతీయ స్థాయి బ్లూ ఎకానమీ సంప్రదింపుల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎన్‌ఆర్‌ఎఫ్ పీఎం–ఈసీఆర్‌జీ ప్రాజెక్టును ప్రారంభించారు. దేశ ఆర్థికాభివృద్ధి, తీరప్రాంత జీవనోపాధి, ఎగుమతులు, ఆహార భద్రతకు మెరికల్చర్ కీలకమని వక్తలు పేర్కొన్నారు. భారత్ ప్రపంచంలో రెండో అతిపెద్ద చేపల ఉత్పత్తిదారైనా ఉత్పాదకతను పెంచాల్సిన అవసరం ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఐసీఏఆర్–నార్మ్, కేరళ ఫిషరీస్ యూనివర్సిటీ మధ్య అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరింది.

# ఎగుమతులపై రెండు రోజుల సర్టిఫికేట్ కార్యక్రమం

**హైదరాబాద్, ఆగస్టు 3 :**

ఎగుమతుల వ్యాపారాన్ని ప్రారంభించాలనుకునే పారిశ్రామికవేత్తలు, స్టార్టప్‌లు, వ్యాపారవేత్తల కోసం ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎక్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్స్ (FIEO) ఆగస్టు 6, 7 తేదీల్లో హైదరాబాద్‌లో రెండు రోజుల సర్టిఫికేట్ కార్యక్రమాన్ని నిర్వహించనుంది.ఈ శిక్షణలో ఎగుమతి విధానాలు, డాక్యుమెంటేషన్, జీఎస్‌టీఈ, వాణిజ్య ఆర్థిక సహాయం, ఎగుమతి ప్రోత్సాహకాలు, సరైన ఉత్పత్తులు–విదేశీ మార్కెట్ల ఎంపిక, విదేశీ కొనుగోలుదారుల గుర్తింపు, స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు (FTAs), క్రెడిట్ రిస్క్ మేనేజ్‌మెంట్ తదితర అంశాలపై నిపుణులు అవగాహన కల్పిస్తారు.అలాగే బ్యాంకులు, ఎక్స్‌పోర్ట్ క్రెడిట్ గ్యారంటీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ECGC) అధికారులతో పాల్గొనేవారికి ప్రత్యక్షంగా చర్చించే అవకాశం కల్పిస్తారు. కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసిన వారికి సర్టిఫికేట్ అందజేస్తారు.

# ఎయిర్‌పోర్టు పనులు వేగవంతం చేయాలి

## కలెక్టర్ రాజర్షి షా



**ఆదిలాబాద్, ఆగస్టు 3 :**

జిల్లాలో ప్రతిపాదిత ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టు ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. ఈ నెల 7న హైదరాబాద్‌లో జరిగే ఉన్నతస్థాయి సమీక్ష సమావేశానికి అన్ని శాఖలు పూర్తి వివరాలు, పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌లతో హాజరుకావాలని సూచించారు.ఎయిర్‌పోర్టుకు సంబంధించిన బాక్స్ కెనాల్, 100 అడుగుల ప్రధాన రహదారి, బల్క్ వాటర్ సప్లై పైప్‌లైన్ డైవర్షన్, డంపింగ్ యార్డు సమస్య పరిష్కారం, విద్యుత్ లైన్ల మార్పిడి తదితర పనులకు అవసరమైన వ్యయ అంచనాలు, సాంకేతిక నివేదికలు, కార్యాచరణ ప్రణాళికలను వెంటనే సిద్ధం చేయాలని ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రాజెక్టు పనులను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

# కామన్వెల్త్ క్రీడల్లో భారత జట్టుకు ప్రధాని మోదీ అభినందనలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 3 :**

గ్లాస్గోలో జరిగిన కామన్వెల్త్ క్రీడలు–2026లో భారత జట్టు అద్భుత ప్రదర్శన కనబరిచినందుకు ప్రధాని నరేంద్ర మోదీ అభినందనలు తెలిపారు.భారత్ 13 స్వర్ణాలతో కలిపి మొత్తం 39 పతకాలు సాధించడం గర్వకారణమని పేర్కొన్నారు. పతక విజేతలందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ, పోటీలంతా భారత క్రీడాకారులు అసాధారణ ప్రతిభ, పట్టుదల, అంకితభావాన్ని ప్రదర్శించారని కొనియాడారు.క్రీడాకారుల కృషి దేశ యువతకు స్ఫూర్తిగా నిలుస్తుందని పేర్కొన్న ప్రధాని, భవిష్యత్తులోనూ భారత జట్టు అత్యుత్తమ ప్రదర్శనతో దేశానికి మరిన్ని విజయాలు అందించాలని ఆకాంక్షించారు.

# ప్రశాంత్ కిశోర్ తొలి ఎన్నికల్లోనే చారిత్రక విజయం

**పాట్నా, ఆగస్టు 3 ::**

ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త, జన సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ తన తొలి ఎన్నికల్లోనే ఘన విజయం సాధించారు. బీజేపీకి బలమైన కోటగా భావించే బీహార్‌లోని బ్యాంకీపూర్ అసెంబ్లీ నియోజకవర్గాన్ని కైవసం చేసుకుని రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చకు తెరలేపారు.ఈ విజయంతో జన సురాజ్ పార్టీకి గణనీయమైన రాజకీయ గుర్తింపు లభించగా, రాబోయే బీహార్ రాజకీయ సమీకరణాలపై ప్రభావం చూపే అవకాశముందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# ప్రతి శిశువుకు తొలి ఆహారం తల్లిపాలే: కలెక్టర్ ప్రతీక్ జైన్



**సంగారెడ్డి, ఆగస్టు 3 :**

ప్రతి శిశువుకు తల్లిపాలే తొలి, ఉత్తమ ఆహారమని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రతి కుటుంబం తల్లిపాల ప్రాధాన్యతను గుర్తించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు.ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా సోమవారం కలెక్టరేట్‌లో తల్లిపాల ప్రాధాన్యతపై అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించిన ఆయన, శిశువు పుట్టిన గంటలోపే తల్లిపాలు పట్టించాలని సూచించారు. ముర్రుపాలు శిశువుకు సహజ రోగనిరోధక శక్తిని పెంచి, ఆరోగ్యకరమైన ఎదుగుదలకు బలమైన పునాది వేస్తాయని తెలిపారు. అలాగే తల్లి–శిశువు మధ్య అనుబంధం మరింత బలపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సంగీత, పాండు తదితర అధికారులు పాల్గొన్నారు.

# ₹87 కోట్ల ప్రభుత్వ ధాన్యం పక్కదారి..

## రైస్ మిల్లులపై క్రిమినల్ కేసులు

**జగిత్యాల, ఆగస్టు 3:):**

విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ అదనపు ఎస్పీ బసవరెడ్డి ఆధ్వర్యంలో జిల్లా సివిల్ సప్లై అధికారి ఎస్. జితేందర్ రెడ్డి, ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులతో కలిసి జగిత్యాల జిల్లాలోని శ్రీ అభయాంజనేయ సాయి రైస్ మిల్, శ్రీ లక్ష్మి బాలాజీ ఇండస్ట్రీస్, లక్ష్మి గణపతి ఇండస్ట్రీస్‌లలో తనిఖీలు నిర్వహించారు.తనిఖీల్లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా సీఎంఆర్ ధాన్యాన్ని పక్కదారి మళ్లించినట్లు గుర్తించారు. ప్రాథమిక విచారణ అనంతరం సుమారు ₹87 కోట్లకు పైగా విలువైన ప్రభుత్వ ధాన్యాన్ని అక్రమంగా మళ్లించినట్లు అధికారులు నిర్ధారించారు.ఈ నేపథ్యంలో సంబంధిత రైస్ మిల్లుల యాజమాన్యాలపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్‌లో మిల్లు యజమాని కొండ లక్ష్మణ్ తదితరులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# విద్యార్థులు చదువుపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

## కలెక్టర్ గరిమ అగ్రవాల్



**రాజన్న సిరిసిల్ల, ఆగస్టు 3**

విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని ప్రతి పాఠ్యాంశంపై పట్టు సాధించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. సోమవారం సిరిసిల్ల అర్బన్ రెసిడెన్షియల్ విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆమె, ఆహార నిల్వలు, సిబ్బంది హాజరు, విద్యార్థులకు అందిస్తున్న భోజన నాణ్యతను పరిశీలించారు. తరగతి గదిలో విద్యార్థులతో మాట్లాడి సైన్స్ అంశాలపై ప్రశ్నలు అడిగి వారి ప్రతిభను పరీక్షించారు. ప్రణాళికాబద్ధంగా చదివితే భవిష్యత్తుకు బలమైన పునాది ఏర్పడుతుందని, విరామ సమయంలో ఆటలు ఆడుతూ ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవాలని విద్యార్థులకు సూచించారు.

# నేపాల్ ప్రతినిధులకు పట్టణ పాలనపై 10 రోజుల శిక్షణ ప్రారంభం

**హైదరాబాద్, ఆగస్టు 3 :**

జాతీయ గ్రామీణాభివృద్ధి & పంచాయతీరాజ్ సంస్థ (NIRDPR), హైదరాబాద్‌లో నేపాల్‌కు చెందిన పట్టణ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల కోసం పట్టణ పాలన (Urban Governance) అంశంపై 10 రోజుల ప్రత్యేక శిక్షణా కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. విదేశాంగ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ శిక్షణ ఆగస్టు 3 నుంచి 12 వరకు కొనసాగుతుంది.నేపాల్‌లోని కోషి ప్రావిన్స్‌కు చెందిన ఇలామ్, పాంచ్‌థర్, తప్లేజుంగ్, తెహ్రాథుమ్ జిల్లాల మేయర్లు, చైర్‌పర్సన్లు, కార్యనిర్వాహక మేయర్లు, మున్సిపల్ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు.ప్రారంభ కార్యక్రమంలో విదేశాంగ మంత్రిత్వ శాఖ ఉప కార్యదర్శి సాకేత రాజా మునిపల్లి మాట్లాడుతూ, భారత్–నేపాల్ మధ్య సుదీర్ఘ స్నేహ సంబంధాల బలోపేతంలో సామర్థ్యాభివృద్ధి కార్యక్రమాలు కీలకమని పేర్కొన్నారు. వ్యవసాయం, ఉద్యానవనం, పట్టణాభివృద్ధి తదితర రంగాల్లో పరస్పర అనుభవాల మార్పిడి రెండు దేశాలకు ప్రయోజనకరమని తెలిపారు.శిక్షణలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణ (LSDG), పట్టణ పాలన, మురుగునీటి నిర్వహణ, ఘన వ్యర్థాల నిర్వహణ, పర్యావరణ పర్యాటకం, మౌలిక సదుపాయాలు, సాంకేతికత వంటి అంశాలపై ప్రత్యేక సెషన్లు నిర్వహించనున్నారు. అలాగే తెలంగాణ, మహారాష్ట్ర, తమిళనాడులోని ఉత్తమ పట్టణ పాలనా విధానాలను ప్రత్యక్షంగా పరిశీలించే అధ్యయన పర్యటనలను కూడా ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో NIRDPR ప్రొఫెసర్

# రహదారుల మరమ్మతులు చేపట్టాలి..

- నీటి ముంపు సమస్యను పరిష్కరించాలి
- జోనల్ కమిషనర్‌కు బీజేపీ నాయకుల వినతి

**మల్కాజ్‌గిరి ఆగస్టు03::**



మల్కాజ్‌గిరి నియోజకవర్గ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్. శ్రీనివాస్ ముదిరాజ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు మల్కాజ్‌గిరి జోనల్ కమిషనర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గంలోని పలు రహదారులు అధ్వాన స్థితికి చేరుకున్నాయని, ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నందున యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని కోరారు. మిర్జాల్‌గూడలోని చిన్మయ మార్గ్ ప్రాంతంలో వర్షపు నీరు నిలిచి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని, నీటి ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు.మల్కాజ్‌గిరి పరిధిలోని ఇతర ప్రజా సమస్యలను కూడా అధికారులు గుర్తించి తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సునీత యాదవ్, ప్రసన్న, లవ, జీడి బాలచందర్ గౌడ్, ఉడుత నవీన్, నాగరాజు, ధనలక్ష్మి, అంజలి, సోమ శ్రీనివాస్, భరత్ యాదవ్, ధరం తేజ, గణ, ప్రకాశ్, మనోజ్, చందు, కిరణ్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.ఫొటో రైటప్: 03HCITY04 —

# కమలా నగర్‌లో లయన్స్ క్లబ్ ఉచిత వైద్య శిబిరం

- కంటి, దంత, సాధారణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించిన వైద్య నిపుణులు

**మల్కాజ్‌గిరి ఆగస్టు03:**

లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సేవాదళ్ ఆధ్వర్యంలో సోమవారం కమలా నగర్‌లోని మాస్టర్ మైండ్స్ స్కూల్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 320–సి డిస్ట్రిక్ట్ గవర్నర్ కళ్యాం కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు.వైద్య నిపుణుల బృందం కంటి, దంత, సాధారణ ఆరోగ్య పరీక్షలను ఉచితంగా నిర్వహించి, అవసరమైన వారికి వైద్య సూచనలు, ఆరోగ్య జాగ్రత్తలను తెలియజేసింది. కమలా నగర్‌తోపాటు పరిసర ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు.ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సేవాదళ్ అధ్యక్షుడు లయన్ చింతపల్లి ఫణిభూషణ్ మాట్లాడుతూ, అన్ని వర్గాల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు.కార్యక్రమంలో పీడీజీలు ఇన్నారెడ్డి, వెంకట్ నారాయణరెడ్డి, ఫస్ట్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మంద సురేష్‌కుమార్, సెకండ్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గుంటుక శేఖర్‌రెడ్డి, లయన్ కళ్యాం మోహన్‌రెడ్డి, లయన్ శ్రీనివాస్, ఎఫ్‌డబ్ల్యూసీ కోఆర్డినేటర్ తుమ్మల హేమలత, లక్ష్మీమూర్తి, శ్రీనివాస్‌రెడ్డి, జెడ్‌సీ భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.శిబిరం విజయవంతం కావడంలో క్లబ్ ప్రధాన కార్యదర్శి తుమ్మల నాగేంద్రప్రసాద్,




కోశాధికారి నమ్ముల రమేష్ యాదవ్, పాఠశాల ప్రిన్సిపల్ ఆర్. లత, లయన్ సభ్యులు తోకల బాపురాజ్ యాదవ్, లాక ఆదిలక్ష్మి యాదవ్, కవిత తదితరులు కీలక పాత్ర

# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు

**ములుగు, ఆగస్టు 3 ::**




స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా కేంద్రంలోని తాగేడు మైదానంలో స్టేజ్, ప్రోటోకాల్ ప్రకారం సీటింగ్, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, త్రాగునీటి సౌకర్యం తదితర ఏర్పాట్లను ముందస్తుగా పూర్తి చేయాలని సూచించారు. జాతీయ పతాకావిష్కరణకు సంబంధించిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు.సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల స్టాల్స్ ఏర్పాటు చేయడంతో పాటు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు తమ సిబ్బందితో కలిసి తప్పనిసరిగా వేడుకలకు హాజరుకావాలని కలెక్టర్ సూచించారు.

# వైద్య కళాశాల, యంగ్ ఇండియా స్కూల్ పనులు వేగవంతం చేయాలి

## మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**ఖమ్మం, ఆగస్టు 3 :**

ఖమ్మంలోని ప్రభుత్వ వైద్య కళాశాల, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు.వైద్య కళాశాల హాస్టళ్లను సెప్టెంబర్‌లో, అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్‌ను అక్టోబర్‌లో పూర్తి చేసి, డిసెంబర్ చివరి నాటికి అన్ని నిర్మాణాలు పూర్తిచేసి ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కళాశాల పనుల కోసం అదనంగా రూ.64 కోట్ల నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రిని కోరినట్లు





తెలిపారు.యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌లో 17 బ్లాకులు, హాస్టళ్లు, అకడమిక్ బ్లాకులు, అంతర్గత రహదారులు, ఇతర మౌలిక సదుపాయాల పనులను నాణ్యతతో పూర్తి చేసి, వచ్చే విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని

# ఇద్దరు విద్యార్థుల మృతి విషాదకరం.. సమగ్ర విచారణకు ఆదేశాలు

**జగిత్యాల, ఆగస్టు 3 :**

మల్యాల మండలంలోని ఎంపీపీఎస్ ఒడ్డెర కాలనీ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు కుంటలో పడి మృతి చెందడం అత్యంత విషాదకరమని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ పేర్కొన్నారు.జగిత్యాల ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించిన వారు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఘటనపై అన్ని కోణాల్లో సమగ్ర విచారణ జరిపి నివేదిక సమర్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. విచారణలో నిర్లక్ష్యం తేలితే బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, ప్రభుత్వ పరంగా అందాల్సిన సహాయాన్ని అందజేస్తామని కలెక్టర్ తెలిపారు. ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి మరియు రాష్ట్ర ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి దృష్టికి విషయాన్ని తీసుకెళ్లి బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా చర్యలు చేపడతామని చెప్పారు.



చురకలు



# స్థానిక యువత ఉపాధే లక్ష్యం..

- పెట్టుబడులకు పూర్తి సహకారం: మంత్రి శ్రీధర్ బాబు

**మంథని, ఆగస్టు 3 :**

స్థానిక యువతకు ఉపాధి కల్పించే పరిశ్రమలు, పెట్టుబడులకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసన వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు.మంథనిలో 'మన ఊరు–మన కోచింగ్ సెంటర్'ను ప్రారంభించిన మంత్రి, పోలీస్ ఉద్యోగాల కోసం యువత వచ్చే మూడు నెలలు క్రమశిక్షణతో సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఇప్పటికే 70 వేల ఉద్యోగాలు భర్తీ చేయగా, మరో 7 వేలకుపైగా పోలీస్ నియామకాలు కొనసాగుతున్నాయని చెప్పారు.అనంతరం పరిశ్రమల ప్రతినిధు లతో సమావేశమైన మంత్రి, పరిశ్రమలకు అవసరమైన విద్యుత్, నీరు, రహదారులు తదితర మౌలిక వసతులను ప్రభుత్వం కల్పిస్తుందని స్పష్టం చేశారు. హిందుస్థాన్ కోకాకోలా బెవరేజెస్ సీఎస్ఆర్ నిధులతో రూ.2 కోట్ల వ్యయంతో చేపడుతున్న బొక్కలవాగు చెక్‌డ్యామ్ అభివృద్ధి, సుందరీకరణ పనులకు శంకుస్థాపన చేసి, నాణ్యతతో గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ప్రభుత్వ సివిల్ ఆసుపత్రిలో వైద్య సేవల అభివృద్ధిపై సమీక్ష నిర్వహించిన మంత్రి, రత్నాపూర్‌లో ప్రతిపాదిత కోకాకోలా పరిశ్రమ స్థలాన్ని పరిశీలించి స్థానిక యువతకు అధిక ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు వేగవంతం చేయాలని



## మెదక్‌ను టూరిస్ట్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు పటిష్ట ప్రణాళిక

**మెదక్, ఆగస్టు 3 :**

మెదక్ జిల్లాను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు సమగ్ర కార్యాచరణ రూపొందించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆర్వీ కన్సల్టెంట్స్ ప్రతినిధులు, పర్యాటక శాఖ డీఈ శ్రీశైలం, ఈడీఎం సందీప్, డీపీఆర్వో రామచంద్రరాజు తదితర అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు.అంతకుముందు ఆర్వీ కన్సల్టెంట్స్ ప్రతినిధులు, పర్యాటక శాఖ అధికారులు మెదక్ ఖిల్లా, పోచారం అభయారణ్యాన్ని సందర్శించి పర్యాటక అవకాశాలను పరిశీలించారు.జిల్లాలో ఉన్న ఆధ్యాత్మిక, చారిత్రక, పర్యావరణ ప్రాధాన్య ప్రాంతాలను సమర్థంగా అభివృద్ధి చేస్తే మెదక్ ప్రముఖ పర్యాటక కేంద్రంగా అవతరిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఇందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి పటిష్ట ప్రణాళికను రూపొందించాలని అధికారులకు సూచించారు.



## గురుకులాల్లో కామన్ డైట్ మెనూ తప్పనిసరిగా అమలు చేయాలి

కలెక్టర్ కె. హైమావతి

**సిద్దిపేట, ఆగస్టు 3 :**

గురుకుల పాఠశాలల్లో కామన్ డైట్ మెనూను తప్పనిసరిగా అమలు చేసి, విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆదేశించారు. సోమవారం రంగదాంపల్లిలోని తెలంగాణ అల్పసంఖ్యాకుల బాలికల గురుకుల పాఠశాలను ఆకస్మికంగా సందర్శించిన ఆమె మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, పప్పు నాణ్యతపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సాయంత్రం భోజనంలో గుడ్డు, నెయ్యి తప్పనిసరిగా ఇవ్వాలని, కామన్ డైట్ మెనూను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. అనంతరం స్టోర్‌రూమ్,






## టీబీ నిర్మూలనకు ప్రత్యేక కార్యాచరణ

కలెక్టర్ రాహుల్ శర్మ

**భూపాలపల్లి, ఆగస్టు 3 :**

జిల్లాలో టీబీ నిర్మూలన లక్ష్యంగా ప్రతి అనుమానితుడికి స్కిన్ టెస్ట్, ఛాతీ ఎక్స్‌రే, కఫం పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో మొబైల్ ఎక్స్‌రే వాహనాల ద్వారా పరీక్షలు నిర్వహించాలని సూచించారు.చిన్నారులు, గర్భిణులు, వృద్ధులు, మధుమేహం, హెచ్ఐవీ బాధితులపై ప్రత్యేక దృష్టి సారించాలని, టీబీ రోగుల కుటుంబ సభ్యులకు కూడా స్క్రీనింగ్ నిర్వహించి అవసరమైన చికిత్స అందించాలని పేర్కొన్నారు. ప్రతి మండలంలో కేసుల గుర్తింపు, పరీక్షలు, చికిత్స, పోషకాహార కిట్ల పంపిణీపై ప్రత్యేక అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, డీఆర్వో వసంత కుమారి, డీఎంహెచ్‌వో డా. మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా ప్రభుత్వ కృషితో సింగరేణికి మరో చారిత్రక విజయం

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**హైదరాబాద్, ఆగస్టు 3 :**

కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ నిర్వహించిన ఆన్‌లైన్ వేలంలో మణుగూరు పీకేఓసీ–2 డిప్ సైడ్ బొగ్గు బ్లాక్‌ను సింగరేణి దక్కించుకోవడం చారిత్రక విజయమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ప్రజా ప్రభుత్వ కృషితో సింగరేణికి గత నెలలో ఇది రెండో కీలక విజయం అని పేర్కొన్నారు.మణుగూరు పీకేఓసీ–2 డిప్ సైడ్ బ్లాక్‌లో 120 మిలియన్ టన్నుల జీ–8 గ్రేడ్ నాణ్యమైన బొగ్గు నిల్వలు ఉండగా, ఏటా 6 మిలియన్ టన్నుల చొప్పున 20 సంవత్సరాల పాటు బొగ్గు వెలికితీసే అవకాశం ఉందన్నారు. ఈ ప్రాజెక్టుతో దాదాపు 2 వేల మందికి ఉపాధి భద్రత లభించడంతో పాటు మణుగూరు ప్రాంత ఆర్థికాభివృద్ధికి ఊతమిస్తుందని చెప్పారు.ఒడిశాలోని నైనీ బొగ్గు గని ప్రారంభం, తాడిచర్ల–2 బ్లాక్‌కు మైనింగ్ లీజు సాధించిన అనంతరం ఇప్పుడు మణుగూరు బ్లాక్‌ను సింగరేణి దక్కించుకోవడం సంస్థ విస్తరణలో కీలక మైలురాయిగా అభివర్ణించారు. తెలంగాణ విద్యుత్ అవసరాలకు దీర్ఘకాలికంగా బొగ్గు సరఫరా భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.భవిష్యత్తులో కోయగూడెం–3, సత్తుపల్లి–3 బొగ్గు బ్లాక్‌లను కూడా సింగరేణికి దక్కేలా కృషి చేస్తామని, ఇతర రాష్ట్రాల్లో బొగ్గు గనులు, కీలక ఖనిజాల అన్వేషణలో కూడా సింగరేణి విస్తరణకు కార్యాచరణ రూపొందిస్తున్నామని

## స్పెయిన్–మొరాకో వలసదారుల సంక్షోభం

**మాడ్రిడ్, ఆగస్టు 3 ::**

మొరాకో నుంచి స్పెయిన్‌కు చెందిన ఉత్తర ఆఫ్రికా ప్రాంతం సియూటాలోకి గత కొన్ని రోజుల్లో దాదాపు 60 వేల మంది వలసదారులు ప్రవేశించేందుకు ప్రయత్నించడంతో తీవ్ర సంక్షోభం నెలకొంది. సరిహద్దు కేంద్రాలు కిక్కిరిసిపోగా, 72 మంది స్పెయిన్ వైపు, 11 మంది మొరాకో వైపు ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు తెలిపారు. ఇప్పటికే సుమారు 69,500 మందిని తిరిగి మొరాకోకు పంపించారు. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు స్పెయిన్ సముద్రంలో తేలియాడే భద్రతా అవరోధాన్ని ఏర్పాటు చేసింది. ఈ పరిణామంతో యూరోపియన్ యూనియన్ అత్యవసర సమావేశం నిర్వహించేందుకు సిద్ధమవగా, అక్రమ వలసలు, సరిహద్దు భద్రత, మానవ అక్రమ రవాణాపై మళ్లీ చర్చ మొదలైంది

## రాజ్యసభలో ఎంఎస్ఎంఈ సవరణ బిల్లు ఆమోదం

**న్యూఢిల్లీ, ఆగస్టు 3 :**

సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) అభివృద్ధికి ఊతమివ్వాలనే లక్ష్యంతో ఎంఎస్ఎంఈ అభివృద్ధి (సవరణ) బిల్లు–2026ను రాజ్యసభ సోమవారం ఆమోదించింది. ఈ బిల్లుతో ఎంఎస్ఎంఈలకు పెద్ద సంస్థలు, ప్రభుత్వ విభాగాల నుంచి బకాయి చెల్లింపులు మరింత వేగంగా జరిగేలా చర్యలు తీసుకోనున్నారు.బిల్లులో చెల్లింపుల ఆలస్యానికి సంబంధించిన వివాదాల పరిష్కార ప్రక్రియను సరళీకరించడంతో పాటు, డిజిటల్ విధానంలో ఫిర్యాదుల పరిష్కారానికి అవకాశం కల్పించారు. ఎంఎస్ఎంఈలకు నగదు ప్రవాహం మెరుగుపడి, వ్యాపార నిర్వహణ సులభతరం అవుతుందని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. పారిశ్రామిక రంగంలో చిన్న, మధ్యతరహా సంస్థలకు ఈ బిల్లు మరింత ప్రోత్సాహాన్ని అందిస్తుందని ప్రభుత్వం

## హుజూరాబాద్ ఐసీడీఎస్‌లో 16 అంగన్వాడీ టీచర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**హుజూరాబాద్, ఆగస్టు 3 ::**

హుజూరాబాద్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న 16 అంగన్వాడీ టీచర్ పోస్టుల భర్తీకి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ ఎం. సుగుణ తెలిపారు. ఈ నెల 15వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు.ఇంటర్మీడియట్ అర్హత కలిగిన 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు గల మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అభ్యర్థి సంబంధిత అంగన్వాడీ కేంద్ర పరిధిలోని గ్రామపంచాయతీ లేదా హుజూరాబాద్ మున్సిపాలిటీ సంబంధిత వార్డుకు స్థానికురాలై ఉండాలని స్పష్టం చేశారు.సైదాపూర్‌లో 6, వీణవంకలో 1, జమ్మికుంటలో 5, ఇల్లందకుంటలో 1, హుజూరాబాద్ మండలంలో 3 పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఖాళీలు, రిజర్వేషన్లు, ఎంపిక విధానం తదితర పూర్తి వివరాలు wdcw.tg.nic.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని, అదే వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు ఆగస్టు 5న అంతరాయం

**హైదరాబాద్, ఆగస్టు 3 :**

మంజీరా ప్రాజెక్టు పరిధిలోని కలబ్‌గూర్ సబ్‌స్టేషన్‌లో నిర్వహణ పనుల కారణంగా ఆగస్టు 5 (బుధవారం) ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నగరంలోని పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరా పాక్షికంగా, మరికొన్ని ప్రాంతాల్లో పూర్తిగా నిలిచిపోనుంది.ఆర్‌సీ పురం, అశోక్‌నగర్, జ్యోతినగర్, లింగంపల్లి, చందానగర్, హఫీజ్‌పేట్, మదీనాగూడ, మియాపూర్, బీరంగూడ, అమీన్‌పూర్, భాగ్యనగర్ కాలనీతో పాటు బీహెచ్‌ఈఎల్ ఫ్యాక్టరీ, బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్, హెచ్‌సీవై, ఇండస్ట్రియల్ ఏరియా బల్క్ కనెక్షన్లు, ఇతర ఆఫ్‌టేక్ పాయింట్లలో నీటి సరఫరా ప్రభావితమవుతుంది.వినియోగదారులు ముందుగానే తాగునీటిని నిల్వ చేసుకుని పొదుపుగా వినియోగించాలని జలమండలి సూచించింది. నిర్వహణ పనులు పూర్తయిన వెంటనే సాధారణ నీటి సరఫరా పునరుద్ధరిస్తామని తెలిపింది.

## అరుణాచల్ ప్రదేశ్‌కు తొలి రామ్‌సార్ స్థలం – గ్లా సరస్సు

భారత్ లో రామ్ సార్ స్థలాల సంఖ్య 101కు చేరింది

**న్యూఢిల్లీ, ఆగస్టు 3 :**

అరుణాచల్ ప్రదేశ్‌లోని గ్లా (Glaw) సరస్సును రామ్‌సార్ స్థలంగా ప్రకటించినట్లు కేంద్ర పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పుల శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ ప్రకటించారు. దీంతో అరుణాచల్ ప్రదేశ్‌కు తొలి రామ్‌సార్ స్థలం లభించగా, దేశంలో మొత్తం రామ్‌సార్ స్థలాల సంఖ్య 101కు చేరింది.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో 2014లో ఉన్న 26 రామ్‌సార్ స్థలాలు ప్రస్తుతం 101కు పెరగడం దేశం చిత్తడి నేలల సంరక్షణ, జీవవైవిధ్య పరిరక్షణ, నీటి భద్రత, వాతావరణ పరిరక్షణ పట్ల ఉన్న నిబద్ధతకు నిదర్శనమని మంత్రి తెలిపారు.తూర్పు హిమాలయ ప్రాంతంలోని కంలాంగ్ టైగర్ రిజర్వ్ మరియు వన్యప్రాణి అభయారణ్యం పరిధిలో ఉన్న గ్లా సరస్సు స్వచ్ఛమైన మంచినీటి సరస్సు. ఈ ప్రాంతంలో 150కు పైగా వృక్ష జాతులు, 49 ఆర్కిడ్ జాతులు నమోదై ఉండటం వల్ల ఇది జీవవైవిధ్యానికి కీలక కేంద్రంగా గుర్తింపు పొందింది.రామ్‌సార్ గుర్తింపు ద్వారా ఈ ప్రాంతంలోని చిత్తడి నేలల సంరక్షణతో పాటు స్థానిక ప్రజల జీవనోపాధి, పర్యావరణ సమతుల్యతకు మరింత ప్రోత్సాహం లభించనుంది.

## రైలు భద్రతపై సమగ్ర సమీక్ష నిర్వహించిన దక్షిణ మధ్య రైల్వే జీఎం

**సికింద్రాబాద్, ఆగస్టు 3 ::**

దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ జోన్ వ్యాప్తంగా రైలు కార్యకలాపాల భద్రతపై సోమవారం సమగ్ర సమీక్ష నిర్వహించారు. నిర్మాణ ప్రాంతాల్లో, ముఖ్యంగా లోతైన గుంతల వద్ద తప్పనిసరిగా కంచెలు ఏర్పాటు చేసి ప్రమాదాలు నివారించాలని అధికారులను ఆదేశించారు.వర్షాకాలంలో ట్రాక్‌లు, స్టేషన్లలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు సిబ్బందికి భద్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. తనిఖీల్లో గుర్తించిన లోపాలను వెంటనే సరిదిద్దాలని, ఇంజనీరింగ్, సిగ్నల్, మెకానికల్, ఎలక్ట్రికల్ విభాగాల భద్రతా చర్యలను సమీక్షించారు.ఎల్‌సీ గేట్ల వద్ద అక్రమ ప్రవేశాలను అరికట్టేందుకు బారికేడ్లు, కందకాలు ఏర్పాటు చేయాలని, ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి గ్రామస్తులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్ని డివిజన్లను ఆదేశించారు.

## వృద్ధుడిని కాల్చిచంపిన ఘటన కలకలం

**పాట్నా, ఆగస్టు 3 :**

బీహార్‌లోని వైశాలి జిల్లాలో పాత విభేదాల నేపథ్యంలో ఓ వృద్ధుడిని దుండగులు కాల్చిచంపారు. ఈ ఘటనలో మరో మహిళ గాయపడగా, ఆమెను ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టారు. ప్రాథమికంగా పాత విభేదాలే హత్యకు కారణమై ఉండొచ్చని భావిస్తూ అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## 14 ఏళ్ల బాలికపై లైంగిక దాడి.. పోస్టుమ్యాన్ అరెస్ట్

**ముంబై, ఆగస్టు 3 ::**

మహారాష్ట్రలోని రత్నగిరి జిల్లాలో 14 ఏళ్ల బాలికపై లైంగిక దాడి చేసి ఆమె గర్భవతిగా మారడానికి కారణమైన పోస్టుమ్యాన్‌ను పోలీసులు పోక్సో చట్టం కింద అరెస్టు చేశారు. బాధితురాలు అస్వస్థతకు గురికావడంతో వైద్య పరీక్షలు నిర్వహించగా గర్భం దాల్చిన విషయం వెలుగులోకి వచ్చింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. బాలికకు వైద్య, మానసిక సహాయం అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం రేపింది.

చురకలు



# మాదకద్రవ్యాల కేసుల వేగవంత విచారణకు ప్రత్యేక కోర్టులు

**న్యూఢిల్లీ, ఆగస్టు 3 :**

దేశంలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగానికి సంబంధించిన కేసులు పెరుగుతున్న నేపథ్యంలో, అధిక సంఖ్యలో ఎన్‌డీపీఎస్ (మాదకద్రవ్యాలు మరియు మానసిక ప్రభావిత పదార్థాల చట్టం) కేసులు నమోదవుతున్న జిల్లాల్లో ప్రత్యేక ఎన్‌డీపీఎస్ కోర్టులను ఏర్పాటు చేయాలని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను కోరింది. ఈ కోర్టులు ఏర్పాటు చేసిన తర్వాత అవి ప్రధానంగా ఎన్‌డీపీఎస్ కేసుల విచారణనే చేపట్టేలా చూడాలని సూచించింది. రాష్ట్రాల నుంచి ప్రతిపాదనలు అందిన తర్వాత అవసరమైన ఆర్థిక సహాయంపై కేంద్రం నిర్ణయం తీసుకోనుంది. ఈ చర్యతో మాదకద్రవ్యాల కేసుల పెండెన్సీ తగ్గి, విచారణలు వేగవంతమై, నిందితులపై త్వరితగతిన చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని కేంద్రం భావిస్తోంది.

# బ్యాంకర్ల రికార్డులపై కొత్త బిల్లు ప్రవేశపెట్టిన కేంద్రం

**న్యూఢిల్లీ, ఆగస్టు 3 :**

బ్రిటిష్ కాలం నాటి బ్యాంకర్స్ బుక్స్ ఎవిడెన్స్ చట్టం–1891 స్థానంలో కొత్త చట్టాన్ని తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో బ్యాంకర్స్ బుక్స్ ఎవిడెన్స్ బిల్లు–2026ను ప్రవేశపెట్టింది. డిజిటల్ యుగానికి అనుగుణంగా బ్యాంకుల డిజిటల్, క్లౌడ్ ఆధారిత రికార్డులకు కోర్టుల్లో చట్టబద్ధ గుర్తింపు కల్పించడం ఈ బిల్లు ప్రధాన ఉద్దేశం.ప్రస్తుతం అమల్లో ఉన్న చట్టం బ్రిటిష్ కాలంలో రూపొందించబడినందున, ఆధునిక బ్యాంకింగ్ వ్యవస్థలో విస్తృతంగా ఉపయోగిస్తున్న డిజిటల్, వర్చువల్ రికార్డులకు తగిన చట్టపరమైన స్పష్టత లేకపోవడంతో ఈ మార్పును ప్రతిపాదించారు. కొత్త చట్టం అమల్లోకి వస్తే ఎలక్ట్రానిక్ రికార్డులు, క్లౌడ్‌లో భద్రపరిచిన బ్యాంకు సమాచారాన్ని కూడా కోర్టులు సాక్ష్యాలుగా పరిగణించే అవకాశం ఉంటుంది. భవిష్యత్తులో ఈ చట్టాన్ని ఇతర ఆర్థిక సంస్థలకూ విస్తరించే అంశాన్ని కూడా ప్రభుత్వం పరిశీలిస్తోంది.

# ప్రధాని మోదీ వీడియో తొలగింపుపై మెటా క్షమాపణ

**న్యూఢిల్లీ, ఆగస్టు 3 :**

ప్రధాని నరేంద్ర మోదీ ఫేస్‌బుక్ వీడియోను సాంకేతిక లోపం కారణంగా తాత్కాలికంగా తొలగించిన ఘటనపై మెటా పార్లమెంటరీ స్థాయి సంఘం ముందు క్షమాపణ తెలిపింది. ఈ ఘటనపై పలువురు ఎంపీలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ, వీడియో ఎందుకు తొలగించబడిందనే విషయంపై సంస్థ నుంచి పూర్తి వివరణ కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని కూడా సూచించారు.

# నీట్ నిరసనల విద్యార్థులపై నమోదైన ఎఫ్ఐఆర్‌ల ఉపసంహరణకు అవకాశం

**న్యూఢిల్లీ, ఆగస్టు 3 :**

నీట్–యూజీ పరీక్షలో అక్రమాల ఆరోపణలపై దేశవ్యాప్తంగా జరిగిన విద్యార్థుల నిరసనల్లో పాల్గొన్న వారిపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను రాష్ట్ర ప్రభుత్వాలు ఉపసంహరించుకోవడానికి ఎలాంటి చట్టపరమైన అడ్డంకి లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అయితే శాంతియుతంగా నిరసన తెలిపిన విద్యార్థులకు మాత్రమే ఈ వెసులుబాటు వర్తిస్తుందని, హింసాత్మక ఘటనలు లేదా ఇతర నేరాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు కొనసాగవచ్చని కోర్టు పేర్కొంది. ఈ వ్యాఖ్యల నేపథ్యంలో ఇప్పటికే కొన్ని రాష్ట్రాలు నిరసనకారులపై నమోదైన కేసులను ఉపసంహరించుకునే ప్రక్రియను ప్రారంభించగా, మరికొన్ని రాష్ట్రాలు కూడా అదే దిశగా చర్యలు చేపట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా కేసుల ఉపసంహరణపై సానుకూలంగా నిర్ణయం తీసుకోవాలని పలు వర్గాలు రాష్ట్ర ప్రభుత్వాలను కోరుతున్నాయి.

# ఉపాధ్యాయుల కొరతపై విద్యార్థుల ఆందోళనలు

**జైపూర్, ఆగస్టు 3 :**

రాజస్థాన్‌లోని బార్మేర్, జాలోర్, సిరోహి జిల్లాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత, మౌలిక సదుపాయాల లేమిని నిరసిస్తూ విద్యార్థులు ఆందోళనకు దిగారు. పలు పాఠశాలల వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు నిరసనలు చేపట్టి, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. నిరసనల అనంతరం అధికారులు విద్యార్థులతో చర్చలు జరిపి, తక్షణం కొందరు ఉపాధ్యాయులను నియమిస్తామని హామీ ఇచ్చారు. పాఠశాలల్లో తాగునీరు, ఫ్యాన్లు, మరుగుదొడ్లు వంటి కనీస సౌకర్యాలు కల్పించాలని కూడా విద్యార్థులు కోరారు.

# పుణెలో ఇద్దరు వర్గాల ఘర్షణ.. యువకుడి దారుణ హత్య

**ముంబై, ఆగస్టు 3 ::**

మహారాష్ట్రలోని పుణెలో ఇద్దరు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో 22 ఏళ్ల యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. ప్రాథమిక సమాచారం ప్రకారం, పాత వ్యక్తిగత విభేదాల నేపథ్యంలో సుమారు 15 మంది దుండగులు యువకుడిపై కర్రలు, పదునైన ఆయుధాలతో విచక్షణారహితంగా దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన అతడిని ఆసుపత్రికి తరలించగా, వైద్యులు మృతిగా ప్రకటించారు.ఘటన అనంతరం ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో భారీ సంఖ్యలో పోలీసులు మోహరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించిన పోలీసులు హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటనకు సంబంధించి పలువురిని అదుపులోకి తీసుకుని విచారిస్తుండగా, పరారీలో ఉన్న నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు కొనసాగిస్తున్నారు.ప్రాథమిక దర్యాప్తులో పాత కక్షలే ఈ హత్యకు కారణమై ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. అయితే అన్ని కోణాల్లో విచారణ కొనసాగుతోందని, నిందితులందరినీ త్వరలోనే అరెస్టు చేస్తామని అధికారులు తెలిపారు.

# పర్యావరణ అనుమతులకు నాలుగు సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యం

- **ఆరు నెలల్లో క్లియరెన్స్ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశం**

**హైదరాబాద్, ఆగస్టు 3 :**

పలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం (పీఆర్ఎల్ఐఎస్), సీతారామ, దిండి, గౌరవెల్లి సాగునీటి ప్రాజెక్టులకు పెండింగ్‌లో ఉన్న పర్యావరణ అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలని సాగునీటి శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సుప్రీంకోర్టు తాజా తీర్పు పర్యావరణ అనుమతుల విషయంలో కొత్త అవకాశాలను కల్పించిందని పేర్కొంటూ, ఆరు నెలల్లో క్లియరెన్స్ ప్రక్రియ పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు.సోమవారం నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, ప్రతి ప్రాజెక్టుకు ప్రత్యేక నోడల్ అధికారులను నియమించి, ఏడు రోజుల్లో రికార్డుల సమీకరణ, 30 రోజుల్లో పర్యావరణ అధ్యయనాలు, 60 రోజుల్లో పరిపాలనా ప్రక్రియలు పూర్తి చేయాలని ఆదేశించారు. వారానికోసారి పురోగతి నివేదికలు సమర్పించాలని స్పష్టం చేశారు.గౌరవెల్లి ప్రాజెక్టు పంప్‌హౌస్‌ను వెంటనే పనిచేసే స్థితిలో ఉంచాలని, కాలువల పరిశీలన, మరమ్మతులు, అడ్డంకుల తొలగింపు పనులు చేపట్టాలని సూచించారు. సీతారామ, పలమూరు–రంగారెడ్డి, దిండి ప్రాజెక్టులకు అవసరమైన పర్యావరణ పత్రాలను సిద్ధం చేసి, అనుమతులు లభించిన వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.పోలవరం బ్యాక్‌వాటర్ ప్రభావంపై తెలంగాణలో ముంపునకు గురయ్యే ప్రాంతాలపై శాస్త్రీయ అధ్యయనాలు వేగవంతం చేసి, రాష్ట్ర హక్కులను కేంద్ర ప్రభుత్వం, పోలవరం ప్రాజెక్టు అథారిటీ ఎదుట బలంగా వినిపించాలని మంత్రి సూచించారు.

# జార్ఖండ్‌లో నియామక పరీక్షల వివాదం ముదురుతోంది

- **JPSC–JSSC పరీక్షల రద్దు, సీబీఐ దర్యాప్తు కోరుతూ విద్యార్థుల భారీ ఆందోళన**

**రాంచీ, ఆగస్టు 3 :**

జార్ఖండ్‌లో ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలకు సంబంధించిన JPSC (జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్), JSSC (జార్ఖండ్ స్టాఫ్ సెలెక్షన్ కమిషన్) పరీక్షల్లో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ వేలాది మంది ఉద్యోగార్థులు రాంచీలో నిరవధిక ఆందోళన కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా 14వ జేపీఎస్సీ సంయుక్త సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్ పరీక్షతో పాటు ఇతర నియామక పరీక్షల్లో పారదర్శకత లోపించిందని ఆరోపిస్తూ, పరీక్షలను రద్దు చేసి సీబీఐ లేదా స్వతంత్ర సంస్థతో దర్యాప్తు జరిపించాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు.రాంచీలోని మోర్హాబాది మైదానంలో విద్యార్థులు పగలు–రాత్రి ధర్నా నిర్వహిస్తూ నిరసన కొనసాగిస్తున్నారు. భారీ వర్షాలు కురుస్తున్నప్పటికీ బహిరంగ ప్రదేశాల్లోనే ఉండి ఆందోళనను కొనసాగిస్తున్నారు. పారదర్శకమైన నియామక వ్యవస్థ, సమయపాలిత పరీక్షల క్యాలెండర్, గత పరీక్షలలో జరిగిన అవకతవకలపై నిష్పాక్షిక విచారణ, ఎంపిక ప్రక్రియలో జాప్యానికి ముగింపు, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు ఐదు ప్రధాన డిమాండ్లు వినిపిస్తున్నారు. ఈ వివాదం రాజకీయ రంగు కూడా దాల్చింది. ఆజ్‌సూ పార్టీతో పాటు ప్రతిపక్షాలు నియామక పరీక్షలపై స్వతంత్ర దర్యాప్తు జరపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి. మరోవైపు ప్రభుత్వం ఇప్పటికే కొన్ని చర్యలు చేపట్టినట్లు చెబుతున్నప్పటికీ, అవి సరిపోవని విద్యార్థి సంఘాలు స్పష్టం చేస్తున్నాయి.నిరసనల నేపథ్యంలో రాంచీలో పోలీసులు భారీగా మోహరించి భద్రతను కట్టుదిట్టం చేశారు. విద్యార్థులతో చర్చలు కొనసాగుతున్నప్పటికీ, తమ డిమాండ్లు నెరవేరే వరకు ఆందోళనను విరమించబోమని ఉద్యమకారులు స్పష్టం

# ప్రజల గుండెల్లో చిరస్థాయిగా 'పెద్ది'...

- **ఖమ్మం అభిమానుల భావోద్వేగ నివాళి**
- **పెద్ది లేరు... కానీ అభిమానం చెదరలేదు!**
- **ఖమ్మం నుంచి తరలివచ్చిన అభిమానులు**

**నల్లబెల్లి, ఆగస్టు 3 ::**

ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి పట్ల అభిమానానికి దూరం అడ్డుకాలేదని మరోసారి రుజువైంది. ఆయన మరణవార్తను, అంతిమయాత్ర దృశ్యాలను టెలివిజన్‌లో వీక్షించి తీవ్ర మనోవేదనకు గురైన ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గానికి చెందిన నాయకులు, అభిమానులు సోమవారం నల్లబెల్లి మండలంలోని ఆయన నివాసానికి ప్రత్యేకంగా తరలివచ్చి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజల కష్టసుఖాల్లో ఎల్లప్పుడూ అండగా నిలిచి, ప్రజా సమస్యల పరిష్కారానికే తన జీవితాన్ని అంకితం చేసిన పెద్ది సుదర్శన్ రెడ్డి వంటి ప్రజానాయకుడు ఇక లేరనే విషయం జీర్ణించుకోలేకపోతున్నామని భావోద్వేగానికి గురయ్యారు. ఆయన నిరాడంబర జీవనం, సేవా తపన, ప్రజలతో మమేకమైన తీరు, అందరినీ ఆప్యాయంగా పలకరించే స్వభావం ఆయనను ప్రత్యేక నాయకుడిగా నిలబెట్టాయని కొనియాడారు.పెద్ది సుదర్శన్ రెడ్డి మరణవార్త తమను తీవ్రంగా కలచివేసిందని, ఆయన పట్ల తమకున్న అపారమైన అభిమానం, గౌరవానికి గుర్తుగానే వందల కిలోమీటర్ల దూరం ప్రయాణించి వచ్చి నివాళులర్పిస్తున్నామని తెలిపారు. భౌతికంగా ఆయన దూరమైనా, ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయే నాయకుడిగా ఆయన స్ఫూర్తి, సేవలు తరతరాలకు



మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొన్నారు.ఈ సందర్భంగా అభిమానులు, స్థానిక నాయకులు కలిసి ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, రెండు నిమిషాల మౌనం పాటించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, పెద్ది సుదర్శన్ రెడ్డి ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని

# స్నేహబంధాల సందడితో కళకళలాడిన మినీ స్టేడియం...

- **ఘనంగా అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవ వేడుకలు**
- **మంచి స్నేహం, ఆరోగ్యకరమైన జీవనశైలే జీవితానికి నిజమైన సంపద: డాక్టర్ పుల్లూరి శ్రీనివాస్ గౌడ్**

**నర్సంపేట, ఆగస్టు 3 : :**

నర్సంపేట వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక మినీ స్టేడియంలో అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవ వేడుకలు ఆదివారం ఉత్సాహభరితంగా నిర్వహించారు. వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, మహిళా వాకర్స్, స్నేహితులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ ఆత్మీయత, ఆనందోత్సాహాల మధ్య వేడుకలను జరుపుకున్నారు.ఈ కార్యక్రమానికి వాకర్స్ ఇంటర్నేషనల్ గవర్నర్, ఎస్సార్ యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్, వరంగల్



జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ పుల్లూరి శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. స్నేహం అనేది మనిషి జీవితంలో అత్యంత విలువైన బంధమని, జీవితానికి నిజమైన సంపద మంచి స్నేహితులు, ఆరోగ్యకరమైన జీవనశైలేనని పేర్కొన్నారు. ప్రతిరోజూ వాకింగ్ చేయడం శారీరక ఆరోగ్యాన్ని కాపాడటమే కాకుండా, పరస్పర పరిచయాలు, స్నేహబంధాలు, సామాజిక అనుబంధాలను మరింత బలోపేతం చేస్తుందని అన్నారు.స్నేహితుల మధ్య పరస్పర విశ్వాసం, సహకారం, ఆప్యాయత సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయని, వాకర్స్ అసోసియేషన్ ఇటువంటి కార్యక్రమాల ద్వారా ఆరోగ్యంతో పాటు మానవ సంబంధాలకు కూడా ప్రాధాన్యత ఇస్తోందని ఆయన కొనియాడారు.స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సభ్యులంతా కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకుంటూ వేడుకలను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. ఆరోగ్యం, స్నేహం, ఐక్యతకు ప్రతీకగా నిలిచిన ఈ కార్యక్రమం సభ్యుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది.ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆడపు సదానందం, కోశాధికారి సంకినేని కృష్ణ, స్టేడియం ఇన్‌చార్జి, కబడ్డీ కోచ్ యాట రవికుమార్ ముదిరాజ్, సభ్యులు కేశపాక అశోక్, రామ్మూర్తి, ఉపాధ్యక్షులు అమ్మద్ పాషా, సంగేపు శ్రీనివాస్, మనోహర్ గౌడ్, సహాయ కార్యదర్శులు గందు రవి గౌడ్, వెంగల బిక్షపతి, మాజీ ప్రధాన కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ గుప్తా, సాన్యో శ్రీనివాస్, దొడ్డ రమేష్

# ఆయుధాల వినియోగంపై పట్టు సాధించాలి

- **ఆర్ఐ విజయ్ భాస్కర్**
- **జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS ఆదేశాల మేరకు**

**నారాయణపేట, ఆగస్ట్,03:**

నారాయణపేట: జిల్లా పోలీసు శాఖలో విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించడం, శారీరక దారుఢ్యాన్ని మెరుగుపరచడం,ఆయుధాల వినియోగంలో మరింత ప్రావీణ్యం సాధించడం లక్ష్యంగా జిల్లా పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో మూడు రోజుల ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆర్ఐ విజయ్ భాస్కర్ మాట్లాడుతూ... పోలీసు ఉద్యోగం అత్యంత బాధ్యతాయుతమైనదని, ప్రతి పోలీసు సిబ్బంది తమ వృత్తి నైపుణ్యాన్ని ఎప్పటికప్పుడు మెరుగుపరుచుకుంటూ ఆధునిక పోలీసింగ్‌కు అనుగుణంగా పనిచేయాలని సూచించారు. విధి నిర్వహణలో ఆత్మవిశ్వాసంతో పాటు ఆయుధాల వినియోగంపై పూర్తి అవగాహన,నైపుణ్యం కలిగి ఉండడం అత్యంత అవసరమన్నారు.ప్రతి పోలీసు సిబ్బంది శారీరకంగా, మానసికంగా దృఢంగా





ఉండేందుకు క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని, పరేడ్, డ్రిల్, ఫైరింగ్, వెపన్ హ్యాండ్లింగ్ వంటి అంశాల్లో నిరంతరం సాధన చేయాలని తెలిపారు. శిక్షణ ద్వారా అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనే సామర్థ్యం పెరుగుతుందని పేర్కొన్నారు.పోలీసు శాఖలో క్రమశిక్షణ, సమయపాలన, బాధ్యతాయుతమైన విధి నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజలతో మర్యాదపూర్వకంగా, స్నేహపూర్వకంగా వ్యవహరించడం ద్వారా పోలీసు శాఖపై ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించవచ్చని అన్నారు.అంతేకాకుండా, చట్టాలపై అవగాహన, ఆధునిక దర్యాప్తు విధానాలు, ప్రజా సంబంధాల మెరుగుదల, ఒత్తిడిని సమర్థంగా ఎదుర్కొనే సామర్థ్యాన్ని కూడా ప్రతి పోలీసు సిబ్బంది పెంపొందించుకోవాలని సూచించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను విధి నిర్వహణలో సమర్థవంతంగా అమలు చేసి ప్రజలకు నాణ్యమైన, వేగవంతమైన పోలీసు సేవలు అందించాలని పిలుపునిచ్చారు.ఈ మూడు రోజుల శిక్షణ కార్యక్రమంలో ట్రైనర్ హెడ్ కానిస్టేబుల్ రాములు పోలీసు సిబ్బందికి డ్రిల్, వెపన్ హ్యాండ్లింగ్, క్రమశిక్షణ, శారీరక దారుఢ్యం తదితర అంశాలపై శిక్షణ అందించారు.ఈ కార్యక్రమంలో RSI శ్వేత, శిరీష, ట్రైనర్ హెడ్ కానిస్టేబుల్ రాములు, వివిధ పోలీస్ స్టేషన్లకు చెందిన పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# వికారాబాద్ జిల్లా లో బాలల అక్రమ రవాణాకు వ్యతిరేకంగా సాధన సంస్థ నిర్ణయాత్మక జాతీయ సంస్థ ప్రారంభించిన- డా. ఆలూరి కామేశ్వరి సీఈఓ

**వికారాబాద్, ఆగస్ట్,03:**

**వికారాబాద్ :** మానవ అక్రమ రవాణా వ్యతిరేక ప్రపంచ దినోత్సవాన్ని పురస్కరించుకుని,వికారాబాద్ జిల్లాలో పనిచేస్తున్న సాధన సంస్థ క్షేత్రస్థాయి బాలల హక్కుల సంస్థ అయిన న్యూఢిల్లీలో ప్రారంభించిన దేశవ్యాప్త బాలల అక్రమ రవాణా వ్యతిరేక జాతీయ ప్రచారంలో భాగంగా, బాలల అక్రమ రవాణాకు వ్యతిరేకంగా ఒక నిర్ణయాత్మక ప్రచారాన్ని ప్రకటించింది.అక్రమ రవాణాను నివారించడానికి ప్రభుత్వం, స్థానిక పరిపాలన మరియు బాలల సంక్షేమ సంఘాలతో కలిసి పనిచేయడం ద్వారా జిల్లాను పిల్లలకు సురక్షితంగా మార్చడానికి తాము కట్టుబడి ఉన్నామని ఆ సంస్థ తెలిపింది. ఈ ప్రచారంలో భాగంగా, జిల్లా వ్యాప్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడతాయి. అదే సమయంలో, బలహీన మరియు అట్టడుగు వర్గాల కుటుంబాలను గుర్తించి, వారి పిల్లలు పాఠశాలలోనే ఉండేలా మరియు అక్రమ రవాణా నెట్‌వర్క్‌ల నుండి రక్షించబడేలా ప్రభుత్వ సంక్షేమ పథకాలతో అనుసంధానిస్తారు.అదనంగా, గుర్తించిన అక్రమ రవాణాదారులపై చట్టపరమైన చర్యలు కూడా ఉంటాయి.న్యూఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో జరిగిన "బాలల హక్కులు, సామర్థ్యం మరియు శ్రేయస్సును నిర్ధారించడం" అనే నాలుగు రోజుల జాతీయ సంప్రదింపుల సందర్భంగా బాలల అక్రమ రవాణా వ్యతిరేక జాతీయ ప్రచారం ప్రారంభించబడింది. బాలల హక్కులను పరిరక్షించడానికి మరియు 2030 నాటికి భారతదేశాన్ని మానవ అక్రమ రవాణా




రహిత దేశంగా మార్చడానికి కృషి చేస్తున్న 250కి పైగా పౌర సమాజ సంస్థల జాతీయ నెట్‌వర్క్ అయిన 'జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్' (JRC) ఆధ్వర్యంలో,భారతదేశవ్యాప్తంగా 782 జిల్లాల నుండి భాగస్వామ్య సంస్థల ప్రతినిధులు ఈ సంప్రదింపుల సమావేశంలో పాల్గొన్నారు సాధన సంస్థ జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్' యొక్క భాగస్వామ్య సంస్థ. పిల్లలపై జరిగే నేరాలకు వ్యతిరేకంగా 'జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్' ప్రపంచంలోనే అతిపెద్ద న్యాయపరమైన జోక్య కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. దాని భాగస్వామ్య సంస్థల సమిష్టి కృషి ద్వారా, ఏప్రిల్ 2023 నుండి డిసెంబర్ 2025 మధ్య భారతదేశవ్యాప్తంగా 1,22,516 మంది పిల్లలను మానవ అక్రమ రవాణా నుండి రక్షించడం జరిగింది. ఇది సమన్వయంతో కూడిన న్యాయపరమైన చర్యలు మరియు సమాజ ఆధారిత జోక్యాల ప్రభావాన్ని స్పష్టంగా తెలియజేస్తుంది.ఈ సంప్రదింపుల సమావేశాన్ని ప్రారంభిస్తూ, కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ సహాయ మంత్రి సావిత్రి ఠాకూర్, బాలల రక్షణ అనేది దేశం ఎదుర్కొంటున్న అత్యంత సవాలుతో కూడిన బాధ్యతలలో ఒకటని అభివర్ణించారు. దోపిడీల నుండి పిల్లలను రక్షించడంలో పౌర సమాజ సంస్థలు చేస్తున్న కృషిని ఆమె ప్రశంసించారు.ఒక్క బిడ్డ ప్రాణాన్ని కాపాడటం కూడా అత్యంత గొప్ప కార్యాలలో ఒకటి. ఎంతో మంది బాలికలు మానవ అక్రమ రవాణాకు బలి అవుతూ, తిరిగి ఇంటికి చేరుకోలేకపోతున్నారు. ఈ పిల్లలు తమను ఎవరో ఒకరు రక్షిస్తారని ఎదురుచూస్తుంటారు.వారిని లైంగిక దోపిడీ నుంచి కాపాడే పౌర సమాజ సంస్థల స్వచ్ఛంద కార్యకర్తలు దేవదూతలతో సమానం," అని ఆమె అన్నారు.ఈ సందర్భంగా డా .ఆలూరి కామేశ్వరి సాధనా సంస్థ డైరెక్టర్ మాట్లాడుతూ, భారతదేశంలోని పిల్లలకు ఎదురయ్యే అత్యంత తీవ్రమైన ముప్పులలో బాలల అక్రమ రవాణా ఒకటిగా కొనసాగుతోందని అన్నారు. "సగటున ప్రతిరోజూ ఆరుగురు పిల్లలు అక్రమ రవాణాకు గురవుతుండగా, ఐదుగురు పిల్లలను బలవంతపు చాకిరీలోకి నెడుతున్నారనేది ఒక విషాద వాస్తవం. ప్రభుత్వ గణాంకాల ప్రకారం, ప్రతి గంటకు 11 మంది పిల్లలు అదృశ్యమవుతున్నారు, మరియు వారిలో గణనీయమైన సంఖ్యలో అక్రమ రవాణా బాధితులుగా మారుతున్నారు.ఆయుధాలు మరియు మాదకద్రవ్యాల అక్రమ రవాణా తర్వాత, ప్రపంచంలో మూడవ అతిపెద్ద వ్యవస్థీకృత నేరం మానవ అక్రమ రవాణా. మహిళలు మరియు పిల్లలే దీనికి ప్రధాన లక్ష్యాలుగా ఉంటున్నారు, అక్రమ రవాణాదారులు వాణిజ్య లైంగిక దోపిడీ మరియు వెట్టిచాకిరి ద్వారా లాభాలు

పొందుతున్నారు.అసంఘటిత రంగంలోని బాల కార్మిక వ్యవస్థ, అక్రమ రవాణా యొక్క అత్యంత దారుణమైన రూపాలలో ఒకటి."అక్రమ రవాణాదారులు తరచుగా బయటి వ్యక్తులు కాదని, స్థానిక సమాజాలలో తెలిసిన వారేనని, వారు ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల పిల్లలను ఉపాధి, విద్య లేదా మెరుగైన జీవితం ఇప్పిస్తామని తప్పుడు వాగ్దానాలతో ఆకర్షించి, ఆ తర్వాత వారిని లైంగిక దోపిడీకి లేదా వెట్టిచాకిరిలోకి నెడతారని డైరెక్టర్ నొక్కి చెప్పారు.మా ప్రధాన లక్ష్యం మానవ అక్రమ రవాణాను నివారించడం, రక్షించబడిన పిల్లలకు చట్టపరమైన మద్దతు అందించడం, మరియు అక్రమ రవాణాదారులపై శిక్ష పడేలా చూడటం. ప్రభుత్వం మరియు జిల్లా యంత్రాంగం సహకారంతో, మేము బలహీన కుటుంబాలను గుర్తించి, వారిని సామాజిక రక్షణ పథకాలతో అనుసంధానిస్తాము. తద్వారా పిల్లలు తమ విద్యను కొనసాగించగలరు మరియు అక్రమ రవాణాదారుల బారి నుండి సురక్షితంగా ఉండగలరు. అదే సమయంలో, అక్రమ

# ఎంజేపీ స్కూల్ & కాలేజీలో వసతులు, ఆహార నాణ్యత పరిశీలించిన

- **మున్సిపల్ చెర్మెన్ నందారం ప్రశాంత్,కమిషనర్ బలరాం నాయక్**

**కొడంగల్ మున్సిపల్, ఆగస్ట్,03:**

కొడంగల్ ఉడిమేశ్వరం గేట్ సమీపంలో ఉన్నటువంటి ఎంజేపీ స్కూల్ & కాలేజీలో విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, భోజన నాణ్యతను కొడంగల్ మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్,మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్ సోమవారం ఆకస్మికంగా పరిశీలించారు.ఈ సందర్భంగా హాస్టల్‌లోని వంటశాల, భోజనశాల, విద్యార్థులకు అందిస్తున్న ఆహార పదార్థాల నాణ్యత, పరిశుభ్రత, తాగునీటి సౌకర్యం, హాస్టల్ గదులు తదితర అంశాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న సౌకర్యాలు, ఎదురవుతున్న సమస్యల గురించి తెలుసుకున్నారు.విద్యార్థులకు నాణ్యమైన, పోషకాహారం అందించడంతో పాటు హాస్టల్ ప్రాంగణంలో పరిశుభ్రతను ఎప్పటికప్పుడు పాటించాలని సంబంధిత అధికారులకు సూచించారు అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థుల సంక్షేమం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని, అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.విద్యార్థుల ఆరోగ్యం, విద్యాభివృద్ధికి



# దివ్యాంగులకు ఉచిత మొబైల్ బిజినెస్ బ్యాటరీ ట్రై సైకిల్ అందజేత..

**వికారాబాద్, ఆగస్ట్,03:**

తెలంగాణ దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉచిత మొబైలు బిజినెస్ బ్యాటరీ ట్రై సైకిల్ పంపిణీ తెలంగాణ ప్రభుత్వం దివ్యాంగుల ఆర్థిక స్వావలంబన,సాధికారతను ప్రోత్సహించే లక్ష్యంతో దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అర్హులైన దివ్యాంగులకు ఉచితంగా మొబైలు బిజినెస్ బ్యాటరీ ట్రై సైకిల్ వాహనాని సోమవారం పంపిణీ చేసింది.ఈ కార్యక్రమంలో భాగంగా యాలాల్ మండలం, అన్నసాగర్ గ్రామానికి చెందిన దివ్యాంగ లబ్ధిదారుడు కర్రె అశోక్ కి జిల్లా కలెక్టర్ & జిల్లా మేజిస్ట్రేట్ చేతుల మీదుగా ఉచిత మొబైలు బిజినెస్ బ్యాటరీ ట్రై సైకిల్



వాహనాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి కాంతారావు (దివ్యాంగుల సంక్షేమ శాఖ) తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా లబ్ధిదారుడు కర్రె అశోక్ ప్రభుత్వం అందించిన ఉచిత మొబైలు బిజినెస్ బ్యాటరీ ట్రై సైకిల్ వాహనాన్ని అందుకున్నందుకు హర్షం వ్యక్తం చేస్తూ, రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ & జిల్లా మేజిస్ట్రేట్ మరియు దివ్యాంగుల సంక్షేమ శాఖకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ వాహనాన్ని స్వయం ఉపాధి కోసం వినియోగించి తన కుటుంబ ఆర్థిక పరిస్థితిని మరింత మెరుగుపరుచుకుంటానని పేర్కొన్నారు.జిల్లా సంక్షేమ అధికారి వికారాబాద్ జిల్లా

# ఆటో అడ్డా వివాదంపై పోలీస్–ఆర్టీఏ కౌన్సెలింగ్.. చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు

- **సిఐ డి.విశ్వేశ్వర్**
- **ఇతర ఆటో డ్రైవర్లను అడ్డుకోవడం, బెదిరించడం చట్టవిరుద్ధం**
- **ప్రజలకు అంతరాయం కలగకుండా ఆటో సేవలు కొనసాగించాలి**
- **శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు ఖాయం**

**గీసుగొండ, ఆగస్టు 3 : :**

గీసుగొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని మచ్చాపూర్ గ్రామ ఆటో అడ్డా వినియోగానికి సంబంధించి మచ్చాపూర్, ఎలుకుర్తి, అరెపల్లి గ్రామాల ఆటో డ్రైవర్ల మధ్య వివాదం నెలకొంది. ఈ నేపథ్యంలో గీసుగొండ పోలీసులు, ప్రాంతీయ రవాణా శాఖ (ఆర్టీఏ) అధికారులతో కలిసి ఇరు గ్రామాల ఆటో యూనియన్ ప్రతినిధులు, ఆటో డ్రైవర్లకు సోమవారం కౌన్సెలింగ్ నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ అనుమతితో ఏర్పాటు చేసిన ఆటో స్టాండ్‌ల వినియోగానికి సంబంధించిన నిబంధనలు, ఆటో డ్రైవర్లు మరియు వాహనాలకు అవసరమైన అన్ని పత్రాలను తప్పనిసరిగా కలిగి ఉండాల్సిన అవసరాన్ని అధికారులు వివరించారు. మోటార్ వాహన చట్టం, సంబంధిత నిబంధనలు, అధికారుల ఆదేశాలకు అనుగుణంగా వ్యవహరించాలని సూచించారు.ఏ ఆటో యూనియన్‌కు చెందిన వ్యక్తులు లేదా సమూహాలు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని ఇతర ఆటో డ్రైవర్లను అడ్డుకోవడం, బెదిరించడం లేదా శాంతిభద్రతలకు భంగం కలిగించే చర్యలకు పాల్పడడం చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు.ఇరు గ్రామాల ఆటో డ్రైవర్లు పరస్పర అవగాహనతో వ్యవహరిస్తూ ప్రజలకు




ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆటో సేవలను కొనసాగించాలని సిఐ విశ్వేశ్వర్ సూచించారు. భవిష్యత్తులో ఈ అంశంపై ఎలాంటి వివాదాలు, గొడవలు లేదా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై అమలులో ఉన్న చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రజలందరూ

# ఆయిల్ పామ్ రైతుల సమస్యల పరిష్కారానికి చర్యలు

**కలెక్టర్ ఖుష్బూ గుప్తా**

**మహబూబ్‌నగర్, ఆగస్టు 3**

జిల్లాలో ఆయిల్ పామ్ రైతుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా తెలిపారు. విద్యుత్ లైన్ల వల్ల అగ్నిప్రమాదాల ప్రమాదంపై సమీక్ష నిర్వహించి, విద్యుత్, ఉద్యానవన శాఖలు సమన్వయంతో కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. యూరియా అందుబాటు, వ్యవసాయ యంత్రాలు, సోలార్ ఫెన్సింగ్, డ్రిప్ ఇరిగేషన్, ఫార్మ్ పాండ్లు తదితర సమస్యలను రైతులు ఆమె దృష్టికి తీసుకెళ్లగా, జిల్లా స్థాయిలో పరిష్కరించగల అంశాలపై వెంటనే చర్యలు తీసుకుని, మిగిలిన వాటిని రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు.



# బాంకీపూర్ ఉపఎన్నికలో జనసురాజ్ సంచలన విజయం..

**బీహార్ రాజకీయాల్లో కొత్త చర్చ**

**పాట్నా, ఆగస్టు 3 ::**

బీహార్‌లోని బాంకీపూర్ అసెంబ్లీ ఉపఎన్నికలో జనసురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ సంచలన విజయం సాధించారు. దాదాపు మూడు దశాబ్దాలుగా బీజేపీకి కంచుకోటగా భావించిన బాంకీపూర్‌లో ఈ గెలుపు రాష్ట్ర రాజకీయాల్లో కీలక మలుపుగా మారింది. ఓట్ల లెక్కింపు ప్రారంభం నుంచే ఆధిక్యంలో కొనసాగిన ప్రశాంత్ కిశోర్, బీజేపీ అభ్యర్థి నీరజ్ కుమార్ సిన్హాపై దాదాపు 19 వేల ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు.రాజకీయ వ్యూహకర్తగా జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ప్రశాంత్ కిశోర్‌కు ఇది తొలి ఎన్నికల విజయం. 2025 అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గెలవలేకపోయిన జనసురాజ్ పార్టీకి ఈ ఫలితం పెద్ద ఊతమిచ్చిందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. బీహార్‌లో ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా జనసురాజ్ ఎదుగుతున్న సంకేతంగా ఈ విజయాన్ని విశ్లేషిస్తున్నారు.ఈ ఫలితంతో బీహార్ రాజకీయ సమీకరణాలపై కొత్త చర్చ మొదలైంది. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో జనసురాజ్ పార్టీ ప్రభావం పెరిగే అవకాశాలపై విశ్లేషణలు వెలువడుతున్నాయి. బీజేపీకి ఇది ప్రతిష్ఠాత్మక నియోజకవర్గంలో ఎదురుదెబ్బగా రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# దతియా ఉపఎన్నికలో కాంగ్రెస్ ఘన విజయం

**భోపాల్, ఆగస్టు 3 :**

మధ్యప్రదేశ్‌లోని దతియా అసెంబ్లీ ఉపఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి ఘనశ్యామ్ సింగ్ విజయం సాధించారు. ఆయన బీజేపీ అభ్యర్థి ఆశుతోష్ తివారీపై 6,016 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. మొత్తం ఓట్ల లెక్కింపు ముగిసే సమయానికి ఘనశ్యామ్ సింగ్ 66,757 ఓట్లు సాధించారు. ఈ ఫలితంతో దతియా స్థానాన్ని కాంగ్రెస్ తన ఆధీనంలో కొనసాగించుకుంది.ఈ ఉపఎన్నిక మాజీ కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజేంద్ర భారతి అనర్హతకు గురికావడంతో నిర్వహించబడింది. బీజేపీలో అభ్యర్థి ఎంపికపై అంతర్గత అసంతృప్తి కూడా ఎన్నికల ప్రచారంలో ప్రధాన చర్చనీయాంశంగా మారింది. దతియా ఫలితాన్ని మధ్యప్రదేశ్ రాజకీయాల్లో కాంగ్రెస్‌కు కీలక విజయంగా విశ్లేషిస్తున్నారు.

## కామన్వెల్త్ రజత పతక విజేత జ్ఞానేశ్వరి యాదవ్‌కు సీఎం అభినందనలు

**రాయ్ పూర్, ఆగస్టు 3 ::**

గ్లాస్గోలో జరుగుతున్న కామన్వెల్త్ గేమ్స్–2026లో మహిళల 53 కేజీల వెయిట్‌లిఫ్టింగ్ విభాగంలో రజత పతకం సాధించిన ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వెయిట్‌లిఫ్టర్ జ్ఞానేశ్వరి యాదవ్కు రాష్ట్ర ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయ్ అభినందనలు తెలిపారు. రాజ్‌నంద్‌గావ్‌కు చెందిన జ్ఞానేశ్వరి అత్యుత్తమ ప్రదర్శనతో రజత పతకం గెలుచుకుని రాష్ట్రానికే కాకుండా దేశానికి కూడా గర్వకారణంగా నిలిచారని సీఎం పేర్కొన్నారు. ఆమె విజయం రాష్ట్ర యువతకు స్ఫూర్తిదాయకమని, మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అయితే, రూ.30 లక్షల నగదు బహుమతితో పాటు డీఎస్పీ హోదా ఇస్తామని ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ప్రకటించిందనే సమాచారానికి విశ్వసనీయ అధికారిక ఆధారాలు ప్రస్తుతం లభించలేదు. అందుబాటులో ఉన్న అధికారిక, విశ్వసనీయ నివేదికల ప్రకారం సీఎం ఆమె విజయాన్ని అభినందించిన విషయం మాత్రమే ధృవీకరించబడింది.

## జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజావాణి నిర్వహణ – ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS

**వికారాబాద్, ఆగస్ట్,03:**



వికారాబాద్ జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా నేడు జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు.ఈ సందర్భంగా వివిధ సమస్యలతో వచ్చిన బాధితులను ఎస్పీ స్వయంగా కలిసి వారి సమస్యలను శ్రద్ధగా ఆలకించారు. అందిన ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత పోలీసు అధికారులతో వివరాలు తెలుసుకుని, చట్టపరమైన నిబంధనల మేరకు నిష్పక్షపాతంగా విచారణ చేపట్టి, బాధితులకు సత్వర న్యాయం జరిగేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS మాట్లాడుతూ, ప్రజల సమస్యల పరిష్కారానికి పోలీసు శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని, ప్రతి ఫిర్యాదును అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి చట్టబద్ధమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం నిర్భయంగా పోలీసు శాఖను ఆశ్రయించాలని, జిల్లా పోలీసు అధికారులు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తారని పేర్కొన్నారు.ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజలకు త్వరితగతిన న్యాయం అందించడమే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని ఎస్పీ తెలిపారు.

## దేశ ఉప ఎన్నికల ఫలితాల విశ్లేషణ

దేశంలోని మూడు అసెంబ్లీ ఉప ఎన్నికల్లో మూడు ప్రధాన రాజకీయ సందేశాలు వెలువడ్డాయి. బీహార్‌లో జన సురాజ్, మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్, గుజరాత్‌లో బీజేపీ విజయాలు నమోదు చేశాయి. దీంతో మూడు రాష్ట్రాల్లో మూడు భిన్న రాజకీయ సంకేతాలు కనిపించాయి.

**బీహార్ (బ్యాంకీపూర్):** జన సురాజ్ అధినేత ప్రశాంత్ కిశోర్ విజయం అత్యంత కీలక పరిణామం. బీజేపీ బలమైన స్థావరంగా భావించిన నియోజకవర్గంలో గెలవడం ద్వారా ఆయన బీహార్ రాజకీయాల్లో ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతున్నారనే సంకేతాలు ఇచ్చారు. రాబోయే రాష్ట్ర ఎన్నికల్లో జన సురాజ్ ప్రభావం పెరిగే అవకాశాలపై చర్చ మొదలైంది.

**మధ్యప్రదేశ్ (దతియా):** కాంగ్రెస్ విజయం అధికార బీజేపీకి ఎదురుదెబ్బగా భావిస్తున్నారు. స్థానిక అసంతృప్తి, అభ్యర్థి ఎంపిక వంటి అంశాలు ఫలితంపై ప్రభావం చూపినట్లు రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. గుజరాత్ (మంజల్పూర్): బీజేపీ భారీ మెజారిటీతో సీటును నిలబెట్టుకోవడం ద్వారా రాష్ట్రంలో తన బలమైన పట్టును మరోసారి నిరూపించింది. ఈ ఫలితం గుజరాత్‌లో పార్టీకి అనుకూల రాజకీయ పరిస్థితులు కొనసాగుతున్నాయని సూచిస్తోంది.

### మొత్తంగా చూస్తే:

బీహార్‌లో ప్రశాంత్ కిశోర్ రాజకీయంగా పెద్ద విజయాన్ని నమోదు చేశారు.మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ ఉత్సాహాన్ని పెంచుకునే ఫలితం లభించింది.గుజరాత్‌లో బీజేపీ తన ఆధిపత్యాన్ని కొనసాగించింది.ఈ ఉప ఎన్నికల ఫలితాలు రాబోయే రాష్ట్ర ఎన్నికల వ్యూహాలు, అభ్యర్థుల ఎంపిక, కూటముల రాజకీయాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

# రికార్డుస్థాయికి యూపీఐ లావాదేవీలు




**బిజినెస్ డెస్క్ :**

యూపీఐ లావాదేవీలు రికార్డు స్థాయిలో నమోదవుతున్నాయి. ఇదే క్రమంలో జూలై నెలలోనూ రూ.29.9 లక్షల కోట్ల స్థాయిలో లావాదేవీలు జరిగినట్టు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎన్‌పీసీఐ) తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. ఈ ఏడాది మే నెలలోనూ రూ.29.9 లక్షల కోట్ల స్థాయిలోనే జరిగాయి. ఎన్‌పీసీఐ నివేదిక ప్రకార ం జూలై నెలలో యూపీఐ లావాదేవీల పరిమాణం 2,366 కోట్ల లావాదేవీలు జరుగగా, ఇది మే నెలలో జరిగిన 2320 కోట్ల లావాదేవీల కంటే అధికం.ఏడాది క్రితం రూ. 25.08 లక్షల కోట్లుగా జరిగిన లావాదేవీలు..ఈసారి జూలై నెలలో రూ.29.88 లక్షల కోట్లకు పెరిగాయ ని తెలిపింది. వార్షిక వృద్ధి రేటు 19 శాతంగా ఉన్నది. కరెన్సీ వాడకాన్ని తగ్గించి డిజిటల్ లావాదేవీలను ప్రో త్సహించడానికి కేంద్ర ప్ర భుత్వం తీసుకుంటున్న చర్యలు స త్ఫలితాలను ఇస్తున్నాయని, ప్రతి నెలలో రి కార్డు స్థాయిలో జరుగుతున్నాయని ఇండస్ట్రీ వర్గాలు వెల్లడించాయి.

# అపోలో హాస్పిటల్స్‌కు ఈటీ ఫ్యామిలీ బిజినెస్ అవార్డ్స్




**బిజినెస్ డెస్క్ :**

ది ఎకనామిక్ టైమ్స్ ఫ్యామిలీ బిజినెస్ అవార్డ్స్ 2026లో "ఫ్యామిలీ బిజినెస్ ఆఫ్ ది ఇయర్" మెగా పురస్కారాన్ని అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజ్ లిమిటెడ్ అందుకుంది. భారతదేశంలోని అతిపెద్ద కుటుంబ ఆధారిత సంస్థల్లో వృద్ధి, సుస్థిర కార్పొరేట్ పాలన, తరతరాల వారసత్వాన్ని విజయవంతంగా కొనసాగించడం వంటి అంశాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు ఈ అవార్డు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అపోలో గ్రూప్ వ్యవస్థాపకులు, చైర్మన్ డా.ప్రతాప్ సి. రెడ్డి మాట్లాడుతూ..."ప్రపంచ స్థాయి ఆరోగ్య సేవలను ప్రతి భారతీయుడికి అందుబాటులోకి తీసుకురావడం నా కల. నా కుమార్తెలు ఆ కలను తమ కలగా స్వీకరించి, నేడు అపోలో హాస్పిటల్స్‌గా రూపుదిద్దుకున్న ఈ సంస్థను నిర్మించేందుకు తమ జీవితాలను అంకితం చేశారు. వారిలో ప్రతి ఒక్కరూ తమదైన ప్రత్యేక దృక్పథంతో మా ప్రస్థానంలోని ఒక్కో కీలక విభాగానికి నాయకత్వం వహిస్తున్నారు. మా నాయకత్వ బృందం, వైద్యులు, నర్సులు, అలాగే అపోలోలోని ప్రతి ఉద్యోగితో కలిసి వారు నిర్మించిన ఈ సంస్థ భారతదేశ ఆరోగ్య రంగ భవిష్యత్తును మలచడంలో కీలక పాత్ర పోషించింది" అని పేర్కొన్నారు.

# 12%వ్యవసాయేతర కార్మికులు ఏఐతో భర్తీ




**బిజినెస్ డెస్క్ :**

భారత్‌లో 12 శాతం వరకు వ్యవసాయేతర కార్మికులను జనరేటివ్ కృత్రిమ మేధ(ఏఐ) భర్తీ చేయగలదని అమెరికా బ్రోకరేజీ సంస్థ గోల్డ్‌మాన్ శాక్స్ అంచనా కడుతోంది. జెన్ ఏఐ ప్రభావం కార్మికులపై కనిపించనుందని, అయితే అది అంతటా ఏకరీతి ప్రభావాన్ని చూపదని అంటోంది. భారత భవిష్యత్ వృద్ధికి జెన్ ఏఐ మధ్యకాలంలో సానుకూలతలను తీసుకురాగలదని భావిస్తోంది. ఇంకా ఏమంటోందంటే.ప్రస్తుతం వ్యవసాయేతర సిబ్బంది చేసే 917 శాతం మేర పనులను జెన్ ఏఐ చేయగలదు. అందువల్ల 812% వరకు ఈ రంగంలో ఉపాధికి ఇబ్బందులు రావచ్చు. 4248 శాతం వరకు వ్యవసాయేతర సిబ్బందికి ఏఐ చేదోడుగా నిలిచే అవకాశం ఉంది. మిగతా సిబ్బందిపై ఎటువంటి ప్రభావమూ పడకపోవచ్చు.సాధారణ క్లరికల్, ప్రొఫెషనల్‌టెక్నిషియన్ వంటి ఉద్యోగాలు తగ్గవచ్చు.భౌతికంగా హాజరై చేయాల్సిన పనులు, క్రాఫ్ట్, ట్రేడ్ ఆధారిత కార్మికులు, మెషీన్ ఆపరేటర్లు వంటి ఉద్యోగాలు పెరగవచ్చు. ఎందుకంటే వీటిని ఆటోమేట్ చేయడం కష్టం.రంగాల వారీగా చూస్తే ఐటీ ఆధారిత బిజినెస్ ప్రాసెస్ సేవలు(బీపీఎస్), పోస్టల్‌టెలికాం సేవలకు ఏఐతో భర్తీ అయ్యేందుకు ఎక్కువ అవకాశం ఉంది. ఆరోగ్య సంరక్షణ, విద్య, ఆర్థిక, ప్రొఫెషనల్ సేవల్లో డయాగ్నోస్టిక్స్, డేటా అనలిటిక్స్ ద్వారా ఏఐ పాగా వేయొచ్చు. తయారీలో మాత్రం ప్రత్యక్ష ప్రభావం తక్కువగా ఉండొచ్చు.

# టాప్‌గేర్‌లో వాహన అమ్మకాలు..

## మారుతి, హ్యుందాయ్ రికార్డు స్థాయి విక్రయాలు

**బిజినెస్ డెస్క్ :**



వాహన అమ్మకాలు టాప్‌గేర్‌లో దూసుకుపోయాయి. కార్ల తయారీలో అగ్రగామి సంస్థలైన మారుతి సుజుకీ, హ్యుందాయ్, టాటా మోటర్స్, మహీంద్రా అండ్ మహీంద్రా సంస్థలు రికార్డు స్థాయిలో వాహనాలను విక్రయించాయి. ప్రస్తుత నెలలో ధరలను పెంచబోతున్నట్టు ఆటోమొబైల్ దిగ్గజాలు ప్రకటించడం, జీఎస్టీ ప్రయోజనాలు లభించడం, వడ్డీరేట్లు తగ్గడం, రూ.12 లక్షల వరకు ఆదాయ పన్ను మినహాయింపు లభించడంతో వాహనాలకు ఎనలేని డిమాండ్ నెలకొన్నది.గడిచిన నెలలో దేశవ్యాప్తంగా ప్యాసింజర్ వాహన విక్రయాలు 4.65 లక్షల నుంచి 4.7 లక్షలకు చేరుకున్నాయని మారుతి సుజుకీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పార్థో బెనర్జీ తెలిపారు. కిందటేడాది ఇదే నెలలో 3.5 లక్షల స్థాయిలో ఉండగా, ఈ సారి 33 శాతం వరకు వృద్ధి నమోదైందన్నారు. గత నెలలో మారుతి 1,96,203 యూనిట్ల ప్యాసింజర్ వాహనాలను విక్రయించగా, హ్యుందాయ్ 54,210 యూనిట్ల విక్రయాలు జరిపింది.హ్యుందాయ్ చరిత్రలో ఒక నెలలో ఈ స్థాయిలో వాహనాలను విక్రయించడం ఇదే తొలిసారని, కొనుగోలుదారుల నుంచి పలు మాడళ్లకు డిమాండ్ నెలకొనడం వల్లనే ఇది సాధ్యమైందని హ్యుందాయ్ ఎండీ, సీఈవో తరుణ్ గార్గ్ తెలిపారు. టాటా మోటర్స్ వాహన విక్రయాల్లో 58 శాతం పెరుగుదల నమోదుకాగా, మహీంద్రా 20 శాతం, హోండా కార్స్ ఇండియా 48 శాతం, టయోటా కిర్లోస్కర్ 5 శాతం, కియా 27.4 శాతం చొప్పున వృద్ధిని సాధించాయి.

# రూ.1.78 లక్షల కోట్లకు రక్షణ ఉత్పత్తులు

**బిజినెస్ డెస్క్ :**

భారత రక్షణ తయారీ రంగం ఆత్మనిర్భరత సాధిస్తూ రికార్డు స్థాయి వృద్ధిని నమోదు చేస్తోంది. 202526లో దేశీయ రక్షణ ఉత్పత్తుల విలువ రూ.1.78 లక్షల కోట్లకు చేరగా, అందులో రూ.38,000 కోట్ల విలువైన ఉత్పత్తులను వివిధ దేశాలకు ఎగుమతి చేసినట్లు శనివారం ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ (ఐసీసీ) ఆధ్వర్యంలో నిర్వహించిన రక్షణ రంగ తయారీదారుల ఎంఎస్ఎంఈల ఫోరమ్ సదస్సు వెల్లడించింది. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ పరిశ్రమలు, వాణిజ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి, తెలంగాణ ఏరోస్పేస్, డిఫెన్స్ డైరెక్టర్ ప్రవీణ్ పీఏ, మిధాని సీఎండీ ఎస్‌వీఎస్ నారాయణ మూర్తి, గార్డెన్ రీచ్ షిప్ బిల్డర్స్ అండ్ ఇంజినీరింగ్ ఛైర్మన్, పీఆర్ హరి, ఆజాద్ ఇంజినీరింగ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విష్ణు మల్పాని, అపోలో మైక్రోసిస్టమ్స్ మేనేజింగ్ డైరెక్టర్ బద్దం కరుణాకర్ రెడ్డి, ఐసీసీ డైరెక్టర్ జనరల్ రాజీవ్ సింగ్ తదితరులు మాట్లాడారు.ఈ సందర్భంగా భారత రక్షణ రంగంలో ఎంఎస్ఎంఈల పాత్రపై ప్రత్యేక నివేదికను విడుదల చేశారు. ప్రస్తుతం దేశంలో దాదాపు 7వేలకు పైగా రక్షణ రంగ ఎంఎస్ఎంఈలు పనిచేస్తుండగా, ఒక్క తెలంగాణలోనే దాదాపు 1,700 వరకూ ఉన్నాయి. ప్రపంచంలో ఆయుధాలను అత్యధికంగా దిగుమతి చేసుకునే దేశాల్లో భారత్ రెండో స్థానంలో ఉంటే, ఎగుమతుల్లో 25వ స్థానంలో ఉందని, ఈ వ్యత్యాసాన్ని తగ్గించడంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలు (ఎంఎస్ఎంఈ) కీలక పాత్ర పోషిస్తాయని సదస్సులో వక్తలు స్పష్టం చేశారు. రక్షణ, ఏరోస్పేస్, డ్రోన్ రంగాల ప్రగతికి తెలంగాణ ప్రభుత్వం పూర్తి మద్దతునిస్తోందని కృష్ణ ఆదిత్య తెలిపారు. ప్రత్యేక రక్షణ, ఏరోస్పేస్ పార్కులను ఏర్పాటు చేస్తున్నట్లు, ఇందులో ఎంఎస్ఎంఈలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యను పరిష్కరించేందుకు అత్యాధునిక 'కామన్ టెస్టింగ్' సౌకర్యాలను అందుబాటులోకి తెస్తున్నట్లు వివరించారు. క్లిష్టమైన ముడి పదార్థాలను దేశంలో ఉత్పత్తి చేసేందుకు ఎంఎస్ఎంఈలు ముందుకు రావాలని నారాయణ మూర్తి పిలుపునిచ్చారు.



ఇస్రో, డీఆర్‌డీఓ, ఏరోస్పేస్ అవసరాల కోసం మిధాని 500 రకాల ప్రత్యేక అల్లాయ్స్ తయారు చేస్తోందని వివరించారు. మిధాని కొనుగోళ్లలో 50 శాతానికి పైగా ఎంఎస్ఎంఈల నుంచే సేకరిస్తున్నామని తెలిపారు.

# స్టాక్ మార్కెట్ లిస్టింగ్‌కు సిద్ధమైన జెప్టో..

## ప్రీ-ఐపీఓ ఫండింగ్ ప్రారంభం




**బిజినెస్ డెస్క్ :**

క్విక్ కామర్స్ రంగంలో ప్రముఖ సంస్థ జెప్టో తన ప్రతిపాదిత ఐపీఓకు ముందు కీలక నిర్ణయం తీసుకుంది. స్టాక్ మార్కెట్‌లో లిస్టింగ్‌కు ముందు ఈక్విటీ షేర్ల ద్వారా ప్రీఐపీఓ ప్రైవేట్ ప్లేస్‌మెంట్ చేపట్టేందుకు ప్రధాన వాటాదారులతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు సంస్థ ప్రకటించింది. కంపెనీ ఆర్థిక బలాన్ని మరింత పెంచడం, నగదు నిల్వలను బలోపేతం చేయడమే ఈ నిర్ణయం వెనుక ప్రధాన ఉద్దేశమని వెల్లడించింది.జెప్టో తెలిపిన వివరాల ప్రకారం, తాజా పెట్టుబడుల ద్వారా ఇప్పటికే ఉన్న రూ.5,681 కోట్ల నగదు నిల్వలకు మరింత బలం చేకూరనుంది. అలాగే 2026 మార్చి 31 నాటికి కంపెనీపై ఎలాంటి రుణభారం లేదని స్పష్టం చేసింది. కంపెనీ బోర్డు, వ్యవస్థాపకులకు పబ్లిక్ మార్కెట్ ఇన్వెస్టర్ల నుంచి లిస్టింగ్‌కు సంబంధించి సానుకూల స్పందన లభించిందని జెప్టో పేర్కొంది. అయితే ప్రస్తుతం కంపెనీ బలమైన ఆర్థిక స్థితిలో ఉన్నందున వ్యాపార విస్తరణపైనే ప్రధాన దృష్టి పెట్టనున్నట్లు తెలిపింది. రాబోయే త్రైమాసికాల ఆర్థిక ఫలితాలతో డీఆర్‌హెచ్‌పీ పత్రాలను నవీకరించి, సెబీ నిర్దేశించిన గడువులోపు ఐపీఓను తీసుకురావాలని యోచిస్తున్నట్లు వెల్లడించింది.ఈ ప్రైవేట్ ప్లేస్‌మెంట్ ద్వారా కంపెనీ సుమారు 4.5 బిలియన్ అమెరికన్ డాలర్ల (దాదాపు రూ.42,925 కోట్లు) విలువ ఆధారంగా నిధులు సమీకరించనుంది. ఈ పెట్టుబడుల్లో దేశీయ ఇన్వెస్టర్ల వాటా అధికంగా ఉండే అవకాశం ఉందని, ప్రస్తుతం సుమారు 40 శాతంగా ఉన్న భారతీయ వాటాదారుల వాటాను మరింత పెంచడమే లక్ష్యమని తెలిపింది. గత ఏడాది అక్టోబర్‌లో 7 బిలియన్ డాలర్ల విలువ ఆధారంగా 450 మిలియన్ డాలర్ల పెట్టుబడులు సమీకరించిన జెప్టో, ఈసారి తక్కువ విలువ వద్ద నిధులు సమీకరించడం గమనార్హం.స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం మాజీ విద్యార్థులు ఆదిత్ పాలిచా, కైవల్య వోహ్రా స్థాపించిన జెప్టో, 2025 డిసెంబర్‌లో గోప్య విధానంలో ఐపీఓ ప్రాథమిక పత్రాలను దాఖలు చేసింది. అనంతరం 2026 జూన్‌లో సమర్పించిన తాజా ముసాయిదా ప్రకారం, రూ.8,010 కోట్ల తాజా షేర్ల జారీతో పాటు 11.35 కోట్ల ఈక్విటీ షేర్ల ఆఫర్ ఫర్ సేల్ ద్వారా నిధులు సమీకరించాలని కంపెనీ ప్రణాళిక రూపొందించింది. 202526 ఆర్థిక సంవత్సరంలో జెప్టో రూ.22,624 కోట్ల ఆదాయాన్ని నమోదు చేసింది. సంస్థ నెట్ రిసీవబుల్స్ విలువ రూ.24,816 కోట్లకు చేరింది. ఏడాది మొత్తం సగటున రోజుకు 17.5 లక్షల ఆర్డర్లు ప్రాసెస్ చేయగా, 2026 మార్చితో ముగిసిన త్రైమాసికంలో ఈ సంఖ్య 23.3 లక్షలకు పెరిగింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 1,139 స్టోర్లు, దాదాపు 4.8 కోట్ల వార్షిక యాక్టివ్ వినియోగదారులు జెప్టోకు ఉన్నారు. ఐపీఓ అనంతరం జెప్టో స్టాక్ ఎక్స్ఛేంజ్‌లలో లిస్టయితే, ఇప్పటికే మార్కెట్లో ఉన్న స్విగ్గీ, ఎటర్నల్ సంస్థల క్విక్ కామర్స్ విభాగాలైన ఇన్‌స్టామార్ట్, బ్లింకిట్లకు ప్రత్యక్ష పోటీగా నిలవనుంది.

# జులైలో జీఎస్టీ వసూళ్లు రూ.2.11 లక్షల కోట్లు

## కేంద్ర ఆర్థిక శాఖ వెల్లడి

**బిజినెస్ డెస్క్ :**

దేశంలో జూలై నెలకు సంబంధించిన జీఎస్టీ వసూళ్ల వివరాలను కేంద్ర ఆర్థిక శాఖ విడుదల చేసింది. ఈ ఏడాది జూలైలో మొత్తం రూ.2.11 లక్షల కోట్ల జీఎస్టీ వసూలైనట్లు వెల్లడించింది. ఇది గత ఏడాది ఇదే నెలతో పోలిస్తే 15.4 శాతం వృద్ధిని నమోదు చేయడం విశేషం.

**వివరాల్లోకి వెళితే**

సెంట్రల్ జీఎస్టీ (CGST): రూ.39,835 కోట్లు
స్టేట్ జీఎస్టీ (SGST): రూ.47,881 కోట్లు
ఇంటిగ్రేటెడ్ జీఎస్టీ (IGST): రూ.1.23 లక్షల కోట్లు

ఒకే ఆర్థిక సంవత్సరంలో రూ.2 లక్షల కోట్లకు పైగా జీఎస్టీ వసూళ్లు నమోదవడం ఇది రెండోసారి కావడం గమనార్హం.

రాష్ట్రాల వారీగా వృద్ధిని పరిశీలిస్తే, హరియాణా రాష్ట్రం అత్యధిక వృద్ధిని నమోదు చేసింది. గుజరాత్ రెండో స్థానంలో నిలిచింది. తెలంగాణ రాష్ట్రం కూడా 19 శాతం వృద్ధితో ప్రముఖంగా నిలిచింది. ఇదిలా ఉండగా, ఫిక్స్డ్ డిపాజిట్ (FD) వడ్డీ రేట్లపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (RBI) అక్టోబర్ 1వ తేదీ నుంచి కొత్త నిబంధనలు అమలు చేయనున్నట్లు తెలిపింది. ఈ మార్పులు బ్యాంకింగ్ రంగంపై ప్రభావం చూపే అవకాశముంది.



# గ్లాస్గోలో ముగిసిన కామన్వెల్త్ క్రీడలు







**గ్లాస్గో, ఆగస్టు 3 :** స్కాట్లాండ్‌లోని గ్లాస్గో వేదికగా 11 రోజుల పాటు అంగరంగ వైభవంగా సాగిన కామన్వెల్త్ క్రీడలు–2026 ఆదివారం ముగిశాయి. జూలై 23న ప్రారంభమైన ఈ బహుళ క్రీడల మహోత్సవం ముగింపు వేడుకలతో తెరపడింది. ఈసారి బడ్జెట్ పరిమితుల కారణంగా కేవలం 10 క్రీడా విభాగాల్లోనే పోటీలు నిర్వహించినప్పటికీ, 74 దేశాలకు చెందిన వేలాది మంది క్రీడాకారులు తమ ప్రతిభను ప్రదర్శించారు. భారత అథ్లెట్లు మరోసారి అంతర్జాతీయ వేదికపై సత్తా చాటుతూ మొత్తం 39 పతకాలు సాధించారు. ఇందులో 13 స్వర్ణాలు, 17 రజతాలు, 9 కాంస్య పతకాలు ఉన్నాయి. ఈ ప్రదర్శనతో భారత్ పతకాల పట్టికలో ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, కెనడాల తర్వాత నాలుగో స్థానాన్ని కైవసం చేసుకుంది. 2022 బర్మింగ్‌హామ్ కామన్వెల్త్ క్రీడల్లో భారత్ 61 పతకాలు సాధించినప్పటికీ, ఈసారి పతకాల సంఖ్య తగ్గింది. అయితే దీనికి ప్రధాన కారణం షూటింగ్, రెజ్లింగ్, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, హాకీ వంటి భారత్‌కు సంప్రదాయంగా ఎక్కువ పతకాలు అందించే క్రీడలను ఈ ఎడిషన్ నుంచి తొలగించడమేనని క్రీడా విశ్లేషకులు పేర్కొంటున్నారు. పరిమిత అవకాశాల్లో నూ భారత క్రీడాకారులు అద్భుత పోరాట పటిమ కనబరిచారు.

## 39 పతకాలతో భారత్‌కు నాలుగో స్థానం

- 13 స్వర్ణాలు, 17 రజతాలు, 9 కాంస్యాలు సాధించిన భారత అథ్లెట్లు
- 2030 కామన్వెల్త్‌కు అహ్మదాబాద్ ఆతిథ్యం.. బాధ్యతల బదిలీ పూర్తి



ముఖ్యంగా మహిళా అథ్లెట్లు స్వర్ణ పతకాల వేటలో కీలక పాత్ర పోషించి భారత్‌కు గర్వకారణంగా నిలిచారు. కామన్వెల్త్ క్రీడలు ముగియడంతో భారత క్రీడాకారుల దృష్టి ఇప్పుడు ఆసియా క్రీడలపై కేంద్రీకృతమైంది. సెప్టెంబర్‌లో జరగనున్న ఆసియా క్రీడల్లో కూడా ఇదే జోరు కొనసాగించాలని భారత బృందం లక్ష్యంగా పెట్టుకుంది. ఇక 2030 కామన్వెల్త్ క్రీడలకు భారత్ ఆతిథ్యం ఇవ్వనుంది. గుజరాత్‌లోని అహ్మదాబాద్ ఈ ప్రతిష్ఠాత్మక క్రీడలకు వేదిక కానుంది. 2010లో ఢిల్లీలో విజయవంతంగా కామన్వెల్త్ క్రీడలను నిర్వహించిన భారత్, రెండోసారి ఈ మహోత్సవానికి ఆతిథ్యం ఇవ్వనున్న దేశంగా నిలవనుంది. ఆస్ట్రేలియా తర్వాత కామన్వెల్త్ క్రీడలను రెండుసార్లు నిర్వహిస్తున్న రెండో దేశంగా భారత్ చరిత్ర సృష్టించనుంది. గ్లాస్గోలో జరిగిన బాధ్యతల బదిలీ కార్యక్రమంలో ఒలింపిక్ స్వర్ణ పతక విజేత నీరజ్ చోప్రా, భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు పీటీ ఉష, గుజరాత్ ఉప ముఖ్యమంత్రి హర్ష్ సంఘవీ భారత తరఫున కామన్వెల్త్ జెండా, బ్యాటన్‌ను స్వీకరించారు. దీంతో ప్రపంచ క్రీడాభిమానుల దృష్టి ఇప్పుడు అహ్మదాబాద్‌లో జరగనున్న 2030 కామన్వెల్త్ క్రీడలపై పడింది.



# మ్యాచ్ ఫిక్సింగ్.. ఐసీసీ కొరడా

**భారత సంతతి ఆటగాడు అఖిలేష్ రెడ్డికి ఎనిమిదేళ్ల నిషేధం**

**అబుదాబి టీ10 టోర్నీలో అవినీతి నిరోధక నిబంధనల ఉల్లంఘన**

**చాట్‌లు, కాల్ రికార్డులు తొలగించినందుకూ అదనపు చర్యలు**

**దుబాయ్/హైదరాబాద్, ఆగస్టు 3 :** అమెరికా తరఫున ఆడుతున్న భారత సంతతి క్రికెటర్ బొడుగుమ్ అఖిలేష్ రెడ్డిపై అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) కఠిన చర్యలు తీసుకుంది. మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడినట్లు నిర్ధారణ కావడంతో అతడిపై ఎనిమిదేళ్లపాటు అన్ని రకాల క్రికెట్ నుంచి నిషేధం విధించింది. ఈ నిషేధం 2025 నవంబర్ 21 నుంచి అమల్లోకి వచ్చినట్లుగా పరిగణించబడుతుందని, 2033 నవంబర్ వరకు కొనసాగుతుందని ఐసీసీ వెల్లడించింది. హైదరాబాద్‌లో పెరిగిన 26 ఏళ్ల అఖిలేష్ రెడ్డి కుడిచేతి బ్యాటర్, ఆఫ్‌స్పిన్ బౌలర్. 2025లో అమెరికా జాతీయ జట్టు తరఫున నాలుగు టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడాడు. అయితే 2025 అబుదాబి టీ10 టోర్నీ సందర్భంగా ఐసీసీ అవినీతి నిరోధక నిబంధనలను ఉల్లంఘించినట్లు విచారణలో తేలింది. ఐసీసీ యాంటీ కరప్షన్ ట్రిబ్యునల్ నివేదిక ప్రకారం మ్యాచ్ ఫలితాన్ని లేదా మ్యాచ్‌లోని ఇతర అంశాలను అక్రమంగా ప్రభావితం చేసేందుకు ప్రయత్నించడం ద్వారా అవినీతి నిరోధక కోడ్‌లోని నిబంధనలను ఉల్లంఘించాడు. అలాగే మ్యాచ్ ఫిక్సింగ్‌లో పాల్గొనాలని మరో ఆటగాడిని ప్రోత్సహించడం, ప్రేరేపించడం కూడా నిర్ధారణ అయింది. దర్యాప్తు ప్రారంభమైన తర్వాత తన మొబైల్ ఫోన్‌లోని చాట్‌లు, కాల్ రికార్డులు, ఇతర డేటాను తొలగించి విచారణకు ఆటంకం కలిగించినట్లు కూడా ట్రిబ్యునల్ గుర్తించింది. ఈ చర్యలను తీవ్రంగా పరిగణించిన ఐసీసీ అతడిపై సుదీర్ఘ నిషేధాన్ని విధించింది. ఈ శిక్షతో అఖిలేష్ రెడ్డి క్రికెట్ కెరీర్‌కు దాదాపు ముగింపు పలికినట్టేనని క్రీడా వర్గాలు భావిస్తున్నాయి. ఐసీసీ అవినీతి నిరోధక నిబంధనల ఉల్లంఘనకు గురై దీర్ఘకాల నిషేధం ఎదుర్కొన్న అమెరికా రెండో అంతర్జాతీయ క్రికెటర్‌గా అఖిలేష్ రెడ్డి నిలిచాడు. క్రికెట్‌లో పారదర్శకత, నిష్పాక్షికతను కాపాడేందుకు అవినీతి నిరోధక నిబంధనలను అత్యంత కఠినంగా అమలు చేస్తామని ఐసీసీ మరోసారి స్పష్టం చేసింది.

# మహిళల ఆసియా కప్‌కు భారత జట్టు ప్రకటన







**ముంబై, ఆగస్టు 3 :** మహిళల ఆసియా కప్‌--2026 టోర్నీకి భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) సోమవారం భారత జట్టును ప్రకటించింది. అనుభవజ్ఞురాలైన హర్మన్‌ప్రీత్ కౌర్ మరోసారి జట్టుకు కెప్టెన్‌గా కొనసాగనుండగా, స్టార్ ఓపెనర్ స్మృతి మందానా వైస్ కెప్టెన్‌గా బాధ్యతలు నిర్వర్తించనుంది. అనుభవం, యువ ప్రతిభ కలయికతో కూడిన జట్టును ఎంపిక చేయడంతో ఈసారి కూడా భారత్ టైటిల్ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. జట్టులో షెఫాలి వర్మ, జెమీమా రోడ్రిగ్స్, భారతి ఫుల్మాలీ, రిచా ఘోష్, దీప్తి శర్మ, రాధా యాదవ్ వంటి కీలక ఆటగాళ్లకు చోటు లభించింది. వికెట్‌కీపర్లుగా రిచా ఘోష్‌తో పాటు జి. కమలినిని ఎంపిక చేశారు. అయితే యువ స్పిన్నర్ శ్రేయాంక పాటిల్‌కు ఈసారి నిరాశ ఎదురైంది. చీలమండ లిగమెంట్ గాయం నుంచి పూర్తిగా కోలుకోకపోవడంతో ఆమెను జట్టుకు దూరంగా ఉంచారు. ఇదే గాయం కారణంగా గతంలో టీ20 ప్రపంచకప్‌ను కూడా ఆమె మధ్యలోనే వీడాల్సి వచ్చింది. అయితే సెప్టెంబర్‌లో జరిగే ఆసియా క్రీడల నాటికి పూర్తిగా కోలుకుని తిరిగి జట్టులో చేరే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. మహిళల ఆసియా కప్–2026 షెడ్యూల్‌ను ఇప్పటివరకు అధికారికంగా ప్రకటించలేదు. ఆగస్టు చివరి వారం నుంచి సెప్టెంబర్ మధ్య వరకు టోర్నీ నిర్వహించే అవకాశం ఉంది. అనంతరం సెప్టెంబర్ 17 నుంచి 22 వరకు ఆసియా క్రీడల మహిళల క్రికెట్ పోటీలు జరగనున్నాయి. రిజర్వ్ జాబితాలో ప్రతీకా రావల్, ఉమా చేత్రీ, వైష్ణవి శర్మ, సయాలి సాత్‌ఘరే, మిన్ను మణి వంటి ప్రతిభావంతులైన ఆటగాళ్లను ఎంపిక చేయడం జట్టుకు అదనపు బలంగా మారనుంది. భారత జట్టు: హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మందానా (వైస్ కెప్టెన్), షెఫాలి వర్మ, జెమీమా రోడ్రిగ్స్, భారతి ఫుల్మాలీ, రిచా ఘోష్ (వికెట్ కీపర్), జి. కమలిని (వికెట్ కీపర్), దీప్తి శర్మ, రాధా యాదవ్, ప్రేమా రావత్, అరుంధతి రెడ్డి, క్రాంతి గౌడ్, రేణుకా సింగ్, ఎన్. శ్రీ చరణి, నందిని శర్మ.

**రిజర్వ్ ఆటగాళ్లు:** ప్రతీకా రావల్, ఉమా చేత్రీ (వికెట్ కీపర్), వైష్ణవి శర్మ, సయాలి సాత్‌ఘరే, మిన్ను మణి.

## హర్మన్‌ప్రీత్‌కే కెప్టెన్సీ.. స్మృతి మందానా వైస్ కెప్టెన్

**గాయం కారణంగా శ్రేయాంకకు దక్కని చోటు**

**స్టార్ ఆటగాళ్లతో టైటిల్ ఫేవరెట్‌గా బరిలో టీమిండియా**



# బ్రిజ్ భూషణ్‌కు ఢిల్లీ కోర్టులో ఊరట

## లైంగిక వేధింపుల కేసులో నిర్దోషిగా తీర్పు

**డబ్ల్యూఎఫ్ఐ మాజీ అసిస్టెంట్ సెక్రటరీ వినోద్ తోమర్‌కూ విముక్తి**

**న్యూఢిల్లీ, ఆగస్టు 4 :** భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) మాజీ అధ్యక్షుడు, బీజేపీ మాజీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌కు ఢిల్లీ కోర్టులో భారీ ఊరట లభించింది. ఆరుగురు మహిళా రెజ్లర్లు చేసిన లైంగిక వేధింపుల ఆరోపణలకు సంబంధించిన కేసులో బ్రిజ్ భూషణ్‌తో పాటు డబ్ల్యూఎఫ్ఐ మాజీ అసిస్టెంట్ సెక్రటరీ వినోద్ తోమర్‌ను ఢిల్లీ రోజ్ అవెన్యూ కోర్టు నిర్దోషులుగా ప్రకటించింది. అడిషనల్ చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ అశ్వినీ పన్వార్ విచారణ అనంతరం ఈ తీర్పు వెలువరించారు. గురువారం వాదనలు పూర్తయిన తర్వాత తీర్పును రిజర్వ్ చేసిన న్యాయస్థానం తాజాగా ఇద్దరికీ విముక్తి కల్పించింది. మహిళా రెజ్లర్ల ఫిర్యాదుల ఆధారంగా ఢిల్లీ పోలీసులు 2023 జూన్‌లో బ్రిజ్ భూషణ్‌పై ఐపీసీ సెక్షన్లు 354, 354ఏ, 354డీ, 506 కింద అభియోగపత్రం దాఖలు చేశారు. అనంతరం 2024 మేలో లైంగిక వేధింపులు, నేరపూరిత బెదిరింపుల కేసుల్లో అభియోగాలు నమోదు చేయాలని కోర్టు ఆదేశించింది. అయితే ఒక ఫిర్యాదుదారు చేసిన ఆరోపణల విషయంలో అప్పుడే ఉపశమనం లభించగా, మిగిలిన కేసులపై విచారణ కొనసాగింది. విచారణ కాలమంతా బ్రిజ్ భూషణ్, వినోద్ తోమర్ బెయిల్‌పై ఉన్నారు. మూడేళ్ల క్రితం పలువురు ప్రముఖ భారత మహిళా రెజ్లర్లు బ్రిజ్ భూషణ్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు చేస్తూ చేపట్టిన ఆందోళనలు దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీశాయి. ఆయనను అరెస్టు చేయాలంటూ జంతర్‌మంతర్ వద్ద జరిగిన నిరసనలు జాతీయ స్థాయిలో సంచలనం సృష్టించాయి. తాజా తీర్పు అనంతరం మీడియాతో మాట్లాడిన బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్, తాను ఎలాంటి తప్పు చేయలేదని మొదటి నుంచే చెబుతున్నానని అన్నారు. తనపై కుట్ర జరిగిందని, నిజం చివరకు న్యాయస్థానం ముందు వెలుగులోకి వచ్చిందని పేర్కొన్నారు. కోర్టు తనను నిర్దోషిగా ప్రకటించడం తనకు, తన కుటుంబ సభ్యులకు, మద్దతుదారులకు ఎంతో ఆనందాన్ని కలిగించిందన్నారు. జూనియర్ అథ్లెట్ల హక్కుల పరిరక్షణ కోసం తాము కృషి కొనసాగి స్తామని ఆయన తెలిపారు.

# శ్రీలంకతో టీమిండియా కొత్త టెస్ట్ మిషన్

- డబ్ల్యూటీసీ ఫైనల్ రేసే లక్ష్యం
- ఆగస్టు 15 నుంచి శ్రీలంక పర్యటన.. భారత్‌కు కీలక సిరీస్
- మిగిలిన 9 టెస్టుల్లో కనీసం 7 విజయాలు అవసరమన్న విశ్లేషకులు

**న్యూఢిల్లీ, ఆగస్టు 3 :** జింబాబ్వే పర్యటన అనంతరం స్వల్ప విరామం తీసుకున్న భారత క్రికెట్ జట్టు ఇప్పుడు ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ)పై పూర్తిగా దృష్టి సారించింది. ఆగస్టు 15 నుంచి ప్రారంభం కానున్న శ్రీలంక పర్యటనతో టీమిండియా కొత్త టెస్ట్ మిషన్‌కు శ్రీకారం చుట్టనుంది. ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ రేసులో నిలవాలంటే ఈ సిరీస్ భారత్‌కు అత్యంత కీలకంగా మారింది. ప్రస్తుతం డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో భారత్ ఐదో స్థానంలో ఉంది. జట్టు ఖాతాలో ఇంకా తొమ్మిది టెస్టు మ్యాచ్‌లు మిగిలి ఉన్నాయి. ఇందులో శ్రీలంకతో రెండు, న్యూజిలాండ్ పర్యటనలో రెండు, ఆస్ట్రేలియాతో స్వదేశంలో ఐదు టెస్టులు ఉన్నాయి. ఫైనల్‌కు అర్హత సాధించాలంటే ఈ తొమ్మిది మ్యాచ్‌ల్లో కనీసం ఏడు నుంచి ఎనిమిది విజయాలు సాధించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా జట్లు పట్టికలో ముందంజలో కొనసాగుతున్నాయి. ప్రధాన కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన గౌతమ్ గంభీర్ హయాంలో టీమిండియా న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా సిరీస్‌లలో ఆశించిన ఫలితాలు సాధించలేకపోయింది. దీంతో ఆయన కోచింగ్‌పై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో భారత మాజీ వికెట్‌కీపర్, క్రికెట్ వ్యాఖ్యాత దీప్ దాస్‌గుప్తా స్పందిస్తూ గంభీర్‌కు ఇది కీలక పరీక్ష అని వ్యాఖ్యానించారు. జట్టు ఆశించిన స్థాయిలో రాణించనప్పుడు కోచ్, కెప్టెన్, మేనేజ్‌మెంట్‌పై ప్రశ్నలు రావడం సహజమేనని అన్నారు. గత మూడు టెస్టు సిరీస్‌ల్లో రెండింటిని కోల్పోయిన నేపథ్యంలో ఒత్తిడి ఉండటం సహజమే అయినప్పటికీ, గంభీర్, కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తో పాటు భారత ఆటగాళ్లకు ఆ ఒత్తిడిని అధిగమించే సామర్థ్యం ఉందని విశ్వాసం వ్యక్తం చేశారు. జట్టులో జరుగుతున్న మార్పులపై కూడా దాస్‌గుప్తా సందేహాలు వ్యక్తం చేశారు. న్యూజిలాండ్ టెస్టు సిరీస్ నుంచి మార్పుల ప్రక్రియ ప్రారంభమైనప్పటికీ, అవి ఏ దిశగా సాగుతున్నాయనే విషయంలో స్పష్టత కనిపించడం లేదన్నారు. శ్రీలంక, న్యూజిలాండ్ పర్యటనలు ఎప్పుడూ కఠిన సవాళ్లేనని, ప్రస్తుత పరిస్థితుల్లో ఏ టెస్టు సిరీస్‌ను కూడా తేలికగా తీసుకునే అవకాశం లేదని ఆయన హెచ్చరించారు. మిగిలిన తొమ్మిది టెస్టుల్లో కనీసం ఏడు విజయాలు సాధించడం టీమిండియాకు పెద్ద సవాలేనని ఆయన అభిప్రాయపడ్డారు.

చురకలు



# 'టాక్సిక్' పాటపై ట్రోలింగ్

## కియారాకు హుమా అండ

- మహిళలనే ఎందుకు లక్ష్యంగా చేసుకుంటున్నారు?
- యశ్‌పై మౌనం.. కియారాపై విమర్శలు ద్వంద్వ వైఖరి: హుమా ఖురేషి
- 'ఆగస్టు 26న సినిమా చూసి సమాధానం చెప్పండి'





**ముంబై, ఆగస్టు 3 :** రాకింగ్ స్టార్ యశ్ కథానాయకుడిగా, ' తు మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ యాక్షన్ చిత్రం 'టాక్సిక్' విడుదలకు ముందే చర్చనీయాంశమైంది. ఇటీవల విడుదలైన 'తబాహీ' పాటకు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించినప్పటికీ, అందులో యశ్, కియారా అద్వానీ మధ్య చిత్రీకరించిన కొన్ని సన్నిహిత సన్నివేశాలు సోషల్ మీడియాలో తీవ్ర చర్చకు దారితీశాయి. పాట విడుదలైన తర్వాత వివాహిత, ఇటీవల తల్లిగా మారిన కియారా అద్వానీ ఇలాంటి సన్నివేశాల్లో నటించడంపై కొందరు నెటిజన్లు విమర్శలు గుప్పించారు. కొందరు ఆమె భర్త సిద్ధార్థ్ మల్హోత్రా సామాజిక మాధ్యమాల ఖాతాల్లో కూడా అనుచిత వ్యాఖ్యలు చేయడంతో వివాదం మరింత ముదిరింది. అయితే ఇదే పాటలో నటించిన యశ్ కూడా వివాహితుడు, ఇద్దరు పిల్లల తండ్రి అయినప్పటికీ ఆయనపై ఎలాంటి విమర్శలు రాకపోవడాన్ని సినీ వర్గాలు ద్వంద్వ వైఖరిగా అభివర్ణిస్తున్నాయి. ఈ అంశంపై స్పందించిన నటి హుమా ఖురేషి, మహిళలను మాత్రమే లక్ష్యంగా చేసుకుని విమర్శించడం బాధాకరమని అన్నారు. పాత్రలో భాగంగా నటించిన సన్నివేశాలను వ్యక్తిగత జీవితంతో ముడిపెట్టి తీర్పులు ఇవ్వడం సరైన పద్ధతి కాదని స్పష్టం చేశారు. ఇలాంటి ట్రోలింగ్‌కు ప్రత్యేకంగా సమాధానం చెప్పాల్సిన అవసరం లేదని, ఆగస్టు 26న విడుదలయ్యే 'టాక్సిక్' సినిమానే అందరికీ సమాధానం చెబుతుందని వ్యాఖ్యానించారు. హుమా ఖురేషి వ్యాఖ్యలకు నటుడు సాకిబ్ సలీమ్ మద్దతు పలికారు. సోషల్ మీడియాలో నటీనటుల వ్యక్తిగత జీవితాలపై తీర్పులు ఇవ్వడం ప్రమాదకర ధోరణి అని పేర్కొన్నారు. బ్రిటిష్ నటుడు బెనెడిక్ట్ గారెట్ కూడా స్పందిస్తూ, యశ్‌ను విమర్శించకుండా కియారాను మాత్రమే లక్ష్యంగా చేసుకోవడం సమాజంలో ఇంకా కొనసాగుతున్న లింగ వివక్షకు నిదర్శనమని అన్నారు. నటీనటులు తమ వృత్తిలో భాగంగా పాత్రలను పోషిస్తారని, వాటిని వారి వ్యక్తిగత జీవితాలతో ముడిపెట్టకూడదని సూచించారు. 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్–అప్స్' పేరుతో రూపొందుతున్న ఈ చిత్రంలో యశ్ సరసన కియారా అద్వానీ కథానాయికగా నటిస్తుండగా, నయనతార, హుమా ఖురేషి, తారా సుతారియా, రుక్మిణి వసంత్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది.




# 'ఇరుముడి' నుంచి

## 'యాలాలో.. యాలాలో' విడుదల

### ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు 'ఇరుముడి'

**హైదరాబాద్, ఆగస్టు 3 :** మాస్ మహారాజా రవితేజ హీరోగా, కుటుంబ కథా చిత్రాల దర్శకుడు శివ నిర్వాణ తెరకెక్కిస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'ఇరుముడి'పై రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ భావోద్వేగ కుటుంబ కథా యాక్షన్ ఎంటర్‌టైనర్ ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. సినిమా విడుదలకు సమయం దగ్గరపడుతుండటంతో చిత్రబృందం ప్రచార కార్యక్రమాలను మరింత వేగవంతం చేసింది. ఇందులో భాగంగా చిత్రం నుంచి రెండో ' తం 'యాలాలో.. యాలాలో.. వెన్నెల్లో ఎన్నెన్ని ముచ్చట్లో..'ను విడుదల చేసింది. కుటుంబ అనుబంధాలు, ప్రేమ, ఆప్యాయత, భావోద్వేగాలను ఆవిష్కరించే ఈ మెలోడీ తొలి వినికిడిలోనే సం' తాభిమానులను ఆకట్టుకుంటోంది. ఈ పాటకు ప్రముఖ గేయరచయిత అనంత శ్రీరామ్ హృదయాన్ని తాకే సాహిత్యాన్ని అందించగా, సం' త దర్శకుడు జి.వి. ప్రకాష్ కుమార్ తన మధురమైన స్వరాలతో పాటకు మరింత అందాన్ని చేకూర్చారు. విడుదల చేసిన పోస్టర్‌లో రవితేజ తన కుటుంబ సభ్యులతో కనిపించిన ఆప్యాయ దృశ్యాలు సినిమా భావోద్వేగ నేపథ్యాన్ని ప్రతిబింబిస్తున్నాయి. ఇప్పటికే విడుదలైన తొలి ' తం 'ఇరుముడి కట్టు' భక్తి ' తంగా విశేష ఆదరణ పొందింది. యూట్యూబ్‌లో ట్రెండింగ్‌లో నిలిచిన ఆ పాట తర్వాత ఇప్పుడు 'యాలాలో.. యాలాలో'తో చిత్రంపై మరింత ఆసక్తి పెరిగింది. ఈ చిత్రంలో రవితేజ ఇప్పటివరకు చేయని విభిన్నమైన పాత్రలో కనిపించనున్నట్లు చిత్రబృందం వెల్లడించింది. తండ్రీ–కూతుళ్ల అనుబంధాన్ని ప్రధానంగా తీసుకున్న ఈ కథలో అయ్యప్ప స్వామి దీక్షకు కూడా కీలక ప్రాధాన్యం ఉంటుందని తెలిపింది. తన కుమార్తె కోసం జీవితాన్ని మార్చుకునే ఓ తండ్రి భావోద్వేగ ప్రయాణాన్ని ఈ చిత్రంలో ఆవిష్కరించనున్నారు. సినిమా విడుదల తేదీపై వస్తున్న ఊహాగానాలకు కూడా చిత్రబృందం తెరదించింది. ముందుగా ప్రకటించినట్లుగానే ఆగస్టు 21న 'ఇరుముడి' ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుందని అధికారికంగా స్పష్టం చేసింది. కుటుంబ అనుబంధాలు, ఆధ్యాత్మికత, మాస్ యాక్షన్ అంశాల సమ్మేళనంగా రూపొందుతున్న ఈ చిత్రం రవితేజ కెరీర్‌లో మరో ప్రత్యేక చిత్రంగా నిలుస్తుందనే నమ్మకంతో అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.




## ఎల్లమ్మలో పర్షిగా దేవిశ్రీప్రసాద్ లుక్ విడుదల

దిల్ రాజు సమర్పణలో, 'రాక్‌స్టార్' దేవి శ్రీ ప్రసాద్, వేణు యెల్దండి, శిరీష్, శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ 'ఎల్లమ్మ' నుంచి పర్షిగా దేవి శ్రీ ప్రసాద్ ఫస్ట్ లుక్ రిలీజ్ అయ్యింది. బలగంతో క్రేజ్ సంపాదించుకున్న దర్శకుడు వేణు యెల్దండి మరో ప్రతిష్టాత్మక చిత్రం ఎల్లమ్మను నిర్మిస్తున్నాడు. గతకొంతకాలంగా ఎల్లమ్మపై అనేక ఊహాగానాలకు తెరదించుతూ.. దేవిశ్రీప్రసాదన్‌ను హీరోగా ఎంపిక చేశారు. ఇందులో పర్షిగా అతను లుక్‌ను విడుదల చేశారు.

# అతీంద్రియ శక్తుల కథ.. అగధ




### 14 రిలీజ్‌కు రెడీ అవుతున్న చిత్రం

ప్రముఖ నిర్మాత, దర్శకుడు ఎంఎస్ రాజు మరో విభిన్నమైన కథతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఆయన దర్శకత్వంలో తెరకెక్కుతున్న మిస్టికల్ థ్రిల్లర్ 'అగధ' ఇప్పటికే సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తుండగా, తాజాగా విడుదలైన ట్రైలర్ సినిమాపై అంచనాలను మరింత పెంచేసింది. కామాక్షి భాస్కర్ల, శ్రవణ్ రెడ్డి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీ ఆది వరాహ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై కాశీ విశాలాక్షి బలుసు నిర్మిస్తున్నారు. ఆగస్టు 14న తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ సినిమా ప్రమోషన్ కార్యక్రమాలను చిత్రబృందం వేగవంతం చేసింది. అందులో భాగంగా విడుదలైన ట్రైలర్ ప్రేక్షకులను థ్రిల్లింగ్ ప్రపంచంలోకి తీసుకెళ్తోంది. ట్రైలర్ ప్రారంభం నుంచే మిస్టరీ, ఆధ్యాత్మికత, మంత్ర తంత్రాల నేపథ్యాన్ని ఆసక్తికరంగా పరిచయం చేశారు. 'మంత్ర తంత్ర విద్యలకు అందని శక్తి ఉంది? దాని గురించి నాకు తెలియాలి' అంటూ కామాక్షి భాస్కర్ల చెప్పే డైలాగ్ ట్రైలర్‌కు హైలైట్‌గా నిలిచింది. ఈ ఒక్క డైలాగ్‌తోనే సినిమాలో అతీంద్రియ శక్తులు, రహస్యాల చుట్టూ తిరిగే కథ ఉండబోతుందనే సంకేతాలు ఇచ్చారు. విజువల్స్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, సినిమాటోగ్రఫీ ట్రైలర్‌కు ప్రధాన బలంగా కనిపిస్తున్నాయి. ప్రతి ఫ్రేమ్‌లోనూ ఉత్కంఠను పెంచేలా ఎంఎస్ రాజు కథనాన్ని రూపొందించినట్లు తెలుస్తోంది. మిస్టరీతో పాటు భావోద్వేగాలు, సస్పెన్స్ అంశాలను సమతూకంగా మేళవించినట్టు ట్రైలర్ స్పష్టం చేస్తోంది. కామాక్షి భాస్కర్ల తన పాత్రలో ఎంతో ఎమోషన్‌ను ప్రదర్శించగా, శ్రవణ్ రెడ్డి కూడా కథలో కీలకమైన పాత్రలో ఆకట్టుకునేలా కనిపిస్తున్నారు. వీరితో పాటు ఇతర నటీనటులు కూడా కథకు తగ్గట్టుగా తమ పాత్రలకు న్యాయం చేసినట్లు ట్రైలర్ ద్వారా అర్థమవు తోంది. ఎంఎస్ రాజు గతంలో కుటుంబ కథా చిత్రాలు, ప్రేమకథలతో విజయాలు అందుకున్నప్పటికీ, ఈసారి పూర్తిగా భిన్నమైన జానర్‌ను ఎంచుకోవడం ఆసక్తికరంగా మారింది. అతీంద్రియ శక్తులు, మంత్ర తంత్రాలు, పురాతన రహస్యాల నేపథ్యంలో రూపొందుతున్న ఈ సినిమా ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందిస్తుందనే నమ్మకంతో చిత్రబృందం ఉంది. ఇప్పటికే ట్రైలర్‌కు సోషల్ మీడియాలో మంచి స్పందన లభిస్తోంది. విజువల్స్, కాన్సెప్ట్, కామాక్షి భాస్కర్ల నటనపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

# స్పైడర్ మ్యాన్ కెలక్షన్ల దూకుడు

టామ్ హాలెండ్, జెండయా ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'స్పైడర్ మ్యాన్: బ్రాండ్ న్యూ డే' జులై 30న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా రికార్డులు తిరగరాస్తోంది. మొదటి వారంలోనే 900 మిలియన్ డాలర్లలకు పైగా వసూళ్లు చేసినట్లు టీమ్ పేర్కొంది. ఇప్పటి వరకూ బాక్సాఫీస్ వద్ద 927 మిలియన్ డాలర్లు (దాదాపు రూ. 8,830 కోట్లు) వసూళ్లు చేసింది. దీంతో ప్రపంచ సినిమా చరిత్రలోనే రెండో అతిపెద్ద గ్లోబల్ ఓపెనింగ్ సాధించిన చిత్రంగా రికార్డు సృష్టించింది. సుమారు 225 మిలియన్ డాలర్లతో (సుమారు రూ. 2,100కోట్లు) రూపొందిన ఈ సినిమా, విడుదలైన మొదటి వీకెండ్‌లోనే బ్జడెట్‌ను అధిగమించి భారీ విజయాన్ని నమోదు చేసింది. 2019లో వచ్చిన 'అవెంజర్స్: ది ఎండ్‌గేమ్' (1.2 బిలియన్ డాలర్లు) (రూ. 11వేల కోట్లు) వసూళ్లు చేసి దీని కంటే ఎక్కువ ఓపెనింగ్ సాధించిన చిత్రంగా మొదటి స్థానంలో ఉంది. మార్వెల్ సినిమాటిక్ యూనివర్స్‌లో 38వ చిత్రంగా తెరకెక్కిన 'స్పైడర్ మ్యాన్'కు ఇండియాలోనూ మంచి ఆదరణ లభిస్తోంది. ఇక్కడ ఈ చిత్రానికి రూ. 310కోట్లు వచ్చినట్లు మూవీ టీమ్ వెల్లడించింది. ఇక ఈ డిసెంబర్‌లో మార్వెల్ స్టూడియోస్ నుంచి రానున్న 'అవెంజర్స్: డూమ్స్‌డే'కు ముందు ఈ 'స్పైడర్ మ్యాన్' బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలవడంతో భారీ ఉత్సాహం నెలకొంది.




This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com